www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 11-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 176 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: పంచమి సా.4.44 తదుపరి షష్ఠి, నక్షత్రం: రోహిణి మ.3.20 తదుపరి మృగశిర, వర్జ్యం: ఉ.8.03-9.30, రా.8.31-10.01, దుర్ముహూర్తం: ఉ.6.10-7.44, అమృతఘడియలు: మ.12.25-1.52, తె.5.26 మొదలు, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.10, సూర్యాస్తమయం: 5.52 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారత సైన్యానికి 'మార్ట్‌లెట్'లు!

బ్రిటన్ నుంచి అధునాతన క్షిపణుల కొనుగోలు



- యూకేతో రూ.4151 కోట్ల ఒప్పందం
- తేలికపాటి, బహుళ ప్రయోజన క్షిపణులివి
- 6 కి.మీ. పరిధిలోని భూ, గగనతల లక్ష్యాలను ఛేదిస్తాయ్.. ధ్వని కంటే ఒకటిన్నర రెట్లు వేగంగా దూసుకెళ్తాయ్! 2

ఆ 4.5 కిలోల బంగారం ఎక్కడ?

- తెచ్చినపుడు 42.8 కిలోలు.. తిరిగిచ్చింది 38.25 కిలోలు
- అయ్యప్ప ఆలయ బంగారు తొడుగులు దేశమంతా తిప్పారు
- మరమ్మతు పేరుతో రవాణాకు 39 రోజులు
- ఏపీతో సహా పలు రాష్ట్రాల్లోని ఆలయాలు, ఇళ్లకు..
- కేరళ హైకోర్టుకు సిట్ నివేదికలో సంచలన విషయాలు
- విజయ్ మాల్యా 1998లో ఇచ్చిన విరాళం 30.8 కిలోలు
- వాటి లెక్కలు తేల్చేందుకు నడుం బిగించిన హైకోర్టు
- క్రిమినల్ కేసు పెట్టాలని కేరళ పోలీసులకు ఆదేశం



తిరువనంతపురం, అక్టోబరు 10: శబరిమల ఆలయ నిర్వహణ చేపడుతున్న ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు కార్యకలాపాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. కూతురి పెళ్లికి దేవాలయం దగ్గర బంగారం అడుక్కొనే వ్యక్తిని దాతగా చూపి, ఆయనకు కిలోల కొద్దీ బంగారం పూత ఉన్న భారీ విగ్రహాల తొడుగుల పునరుద్ధరణ బాధ్యత అప్పగించింది. పునరుద్ధరణకు ఆయన సొంతంగా వెచ్చించిన బంగారం 400 గ్రాములు కాగా.. దేవస్థానం 42.8 కిలోల బరువున్న బంగారం పూతతో కూడిన రాగి తొడుగులను ఆయనకు ఇచ్చింది. చివరకు మెరుగులు

మిగతా 2వ పేజీలో...



← ఆలయ ద్వార పాలకుల బంగారు తొడుగులు →

ట్రేడింగ్‌లో నష్టపోయి సొంతింటికే కన్నం

స్నేహితుల సాయంతో దొంగతనం

- 12 తులాల బంగారం, నగదు చోరీ..
- చివరికి బెడిసి కొట్టిన ప్లాన్
- పోలీసుల విచారణలో గుట్టు రట్టు
- విశాఖలో నలుగురి అరెస్టు 13



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు



విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన చింతా శశిధర్ ఫౌండేషన్ చైర్మన్ శశిధర్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు

2047కల్లా ఏపీ నంబర్ 1

- గేమ్ చేంజర్ పాత్రలో రాష్ట్రం: చంద్రబాబు
- చింతా ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం
- పేద విద్యార్థులను దత్తత తీసుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య
- బయో ఇథనాల్ ప్లాంటుతో వాతావరణ సమతుల్యత.. రైతులకూ మేలు
- 'నందిని సేవ్ ది బుల్' సరికొత్త ఆవిష్కరణ
- నెల్లూరు జిల్లాలో విశ్వసముద్ర ప్రాజెక్టులను ప్రారంభించిన సీఎం 14

వెనెజువెలా ఉద్యమకారిణికి నోబెల్ శాంతి

ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న మరియా కొరినాకు దక్కిన పురస్కారం

- 'బుల్లెట్లకు బదులు బ్యాలెట్లు' నినాదంతో వెనెజువెలాలో ఉద్యమం
- స్వేచ్ఛ, నిష్పాక్షిక ఎన్నికల కోసం 20 ఏళ్లుగా పోరాటం
- నియంతృత్వానికి వ్యతిరేకంగా విపక్షాలను ఏకం చేసిన ధీశాలి
- ప్రాణాలకు ముప్పున్నా అజ్ఞాతంలో ఉంటూ పోరాటం
- ట్రంప్‌తో సహా 338 మంది నామినేట్ అయినా వారందరినీ కాదని కొరినాను ఎంపిక చేసిన నోబెల్ కమిటీ
- మా పోరాటానికి అండగా నిలిచిన అమెరికాకు కృతజ్ఞతలు
- ట్రంప్‌కు నోబెల్ బహుమతి అంకితం: మరియా కొరినా



ఆస్లో, అక్టోబర్ 10: ప్రపంచమంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన నోబెల్ శాంతి బహుమతి ప్రకటన శుక్రవారం వెలువడింది. ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారానికి వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో ఎంపికయ్యారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రజల తరపున పోరాడినందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు నార్వేజియన్ నోబెల్ కమిటీ తెలిపింది. చీకట్లు కమ్ముకున్న ప్రాంతంలో ప్రజాస్వామ్య జ్వాల వెలిగేలా చేస్తున్న సాహసిగా శాంతి కోసం ఆమె చేసిన విశేష కృషికి గాను ఈ పురస్కారం ఇస్తున్నట్లు పేర్కొంది. వెనెజువెలాను నియంతృత్వ దేశం నుంచి ప్రజాస్వామ్య దేశంగా మార్చేందుకు శాంతియుత పోరాటం చేశారని

మిగతా 2వ పేజీలో...

ట్రంప్ అ'శాంతి'!

- 8 యుద్ధాలు ఆపానన్నా..'నేనే అర్హుడిని' అన్నా.. దక్కని నోబెల్
- రాజకీయాలకే నోబెల్ కమిటీ ప్రాధాన్యమిచ్చింది: వైట్‌హౌస్
- యుద్ధాలను ఆపేందుకు ట్రంప్ కృషి కొనసాగుతుందని వెల్లడి

రైడెన్‌కు రైట్ రైట్

గూగుల్ అనుబంధ సంస్థ పెట్టుబడికి క్యాబినెట్ ఓకే

రూ.87,500 కోట్లతో విశాఖలో డేటా సెంటర్

- తర్లువాడ, అడవివరం, రాంబిల్లిలో 3 క్యాంపస్‌లు.. 480 ఎకరాలు
- భూమి ధరలో 25% రాయితీ
- స్టాంపు డ్యూటీ రద్దు.. సబ్సిడీపై విద్యుత్
- ఎస్‌జీఎస్టీ 100 శాతం రాయితీ

13న ఢిల్లీకి చంద్రబాబు, లోకేశ్

ప్రధానిని సీఎం కలిసే అవకాశం!

ఆ కంపెనీలకు 4 ఎకరాలే!

టాప్-100 జాబితాల్లో లేని కంపెనీలకు భూకేటాయింపులపై ప్రత్యేక విధానం

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ విశాఖలో రూ.87,500 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)తో ఒక గిగావాట్ సామర్థ్యంతో భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ పెట్టుబడి ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదించింది. రైడెన్ విశాఖలోని తర్లువాడ, అడవివరం, రాంబిల్లిలో 480 ఎకరాల్లో మూడు క్యాంపస్‌లతో కూడిన డేటా సెంటర్‌ను

మిగతా 13వ పేజీలో...

1.27 లక్షల కోట్ల పెట్టుబడులు

- 78,771 మందికి ఉద్యోగావకాశాలు
- ఎస్ఐపీబీ నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం
- దొనకొండలో బీడీఎల్‌కు 1,400 ఎకరాలు
- రూ.212 కోట్లతో రాజ్‌భవన్ నిర్మాణం

లులూ.. అతి షరతులు!

భూములు తీసుకుంటూ ప్రభుత్వానికే కండిషన్లా? 13

- రాష్ట్రానికే తన అవసరమున్నట్లు తీరు
- క్యాబినెట్‌లో పవన్ వరుస ప్రశ్నలు
- ఆహార శుద్ధి అంటే ఏమిటి?.. గోమాంసం ఎగుమతా?.. లీజు పదేళ్లకు పెంచడమేంటి?
- ఉద్యోగులు వాళ్ల వాళ్లేనా? స్థానికులా?
- భూములిచ్చేముందే స్పష్టత తీసుకోండి
- అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచన
- అతి షరతులపై చంద్రబాబు అసహనం



రుత్విక్

పసివాడిని బలిగొన్న వేడి తేనీరు

- తెలియక తాగేయడంతో గొంతు కాలి ఆగిన ఊపిరి 14
- ఆస్పత్రి పాలైన మరో చిన్నారి
- అనంతలో విషాదం

పొగాకు కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం

- రూ.550 కోట్ల పొగాకు దగ్ధం
- ప్రకాశం జిల్లాలో ఘటన 3

13 నుంచి బడులకు కొత్త టీచర్లు 12

ఆ ఎమ్మెల్యే లాకర్లలో 40 కిలోల పసిడి

- ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో కర్ణాటక ఎమ్మెల్యే వీరేంద్రపై ఆరోపణలు
- రెండు లాకర్లు తనిఖీ చేసిన ఈడీ
- రూ.50.33 కోట్ల విలువైన బంగారు కడ్డీలు లభ్యం
- ఇదివరకే 21 కిలోల గోల్డ్ సహా రూ.103 కోట్ల సొత్తు సీజ్

బెంగళూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యే.. పేరు కేసీ వీరేంద్ర. కర్ణాటకలోని చిత్రదుర్గ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈయనకు సంబంధించిన బ్యాంకు లాకర్లను తెరిచిచూసి ఈడీ అధికారులు నోరెళ్లబెట్టారు. ఆ లాకర్ల నిండా బంగారం కడ్డీలే కనిపించాయి! తక్కెట్లో కుప్పగా పోస్తే ఆ గోల్డ్ 40 కిలోలు తూగింది! ఆ బంగారం విలువ రూ.50.33 కోట్లు అని ఈడీ అధికారులు లెక్కగట్టారు. వీరేంద్ర నేతృత్వంలో

మిగతా 11వ పేజీలో...





చేపల చెరువు, కాటేజీలు, (ఇన్‌సెట్) నిందితుడు మెహ్రా 11

కిలోల్లో బంగారం.. 17 టన్నుల తేనె

- ఫాంహౌస్‌లో 39 కాటేజీలు
- చేపల చెరువు, గోశాల, ఆలయం
- పెద్ద సంఖ్యలో లగ్జరీ కార్లు
- భోపాల్‌లో మాజీ చీఫ్ ఇంజనీర్ ఆస్తులు
- 2.64 కిలోల బంగారం, రూ.36 లక్షల నగదు స్వాధీనం

ఏ1 జనార్దనరావు అరెస్టు

- నకిలీ మద్యం కేసు నిందితుడు గన్నవరం ఎయిర్‌పోర్టులో అదుపులోకి
- దక్షిణాఫ్రికా నుంచి ముంబై మీదుగా రాక
- అరెస్ట్ చేసిన ఎన్టీఆర్ జిల్లా ఈఎస్‌టీఎఫ్
- ఏ క్షణమైనా మిగతా నిందితులూ అరెస్టు?
- జయచంద్రారెడ్డి డ్రైవర్ అదుపులోకి 14



గన్నవరం ఎయిర్‌పోర్టులో జనార్దనరావును అరెస్టు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

వెనెజువెలా ఉద్యమకారిణికి నోబెల్ శాంతి



(మొదటి పేజీ తరువాయి)

కమిటీ ఛైర్మన్ వాట్నే ఫ్రైడ్నెస్ ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణి పెరుగుతున్న పరిస్థితుల్లో మరియా లాంటి ప్రజాస్వామ్య పరిరక్షకులు ఎంతో అవసరమని కమిటీ అభిప్రాయపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా ఈ ఏడాది మొత్తం 338 మంది ప్రముఖులు నామినేట్ అవ్వగా.. వారందరినీ కాదని ఈ గౌరవాన్ని మచాడో సొంతం చేసుకున్నారు. ఈ ప్రకటనతో నోబెల్ శాంతి బహుమతి తనకే దక్కాలని పదే పదే చెప్పుకుంటూ వచ్చిన ట్రంప్‌కు నిరాశ తప్పలేదు.

ఎవరీ మరియా కొరినా..

ఒకప్పుడు లాటిన్ అమెరికాలో అత్యంత సుసంపన్న దేశంగా ఉన్న వెనెజువెలా, గత కొన్ని సంవత్సరాలుగా నియంతృత్వ పాలన, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం, రాజకీయ అస్థిరత, మానవతా సంక్షోభం వంటి కారణాలతో కుదేలైంది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో "బుల్లెట్లకు బదులు బ్యాలెట్లను ఎంచుకుందాం" అంటూ మచాడో ఒకసారి చెప్పిన మాటే ఆమె శాంతియుత ప్రజాస్వామ్య పోరాటానికి నినాదమైంది. 'సుమెట్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి రెండు దశాబ్దాలుగా దేశంలో స్వేచ్ఛ, నిష్పాక్షిక ఎన్నికల కోసం ఆమె పోరాటం కొనసాగించారు. అణచివేతలకు వెరవకుండా, సైనిక పాలనకు వ్యతిరేకంగా ప్రజా హక్కుల కోసం గళమెత్తారు. 2024లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో వెనెజువెలా సర్కారు ఆమెను పోటీ చేయనివ్వలేదు. దీంతో ప్రతిపక్ష అభ్యర్థి ఎడ్మండో గోంజాలెజ్‌కు మద్దతిచ్చి, వేలాది మంది వలంటీర్లను పర్యవేక్షకులుగా నియమించారు. బెదిరింపులు, అరెస్టులు, హింస వంటి కుట్రల మధ్య కూడా ప్రతిపక్షం విజయం సాధించినట్టు సాక్ష్యాలున్నా.. అధికార పక్షం ఫలితాన్ని అంగీకరించలేదు. దీంతో ప్రతిపక్షం భారీ నిరసనలు చేపట్టింది. దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో దాదాపు 20మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిణామాల తర్వాత మచాడోపై అరెస్ట్ వారెంట్ జారీ అయింది. అప్పటి నుంచి ఆమె ప్రజా జీవితానికి దూరంగా ఉన్నారు. కానీ, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను చైతన్యపరిచేందుకు పోరాటం చేస్తూనే ఉన్నారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా వెనిజువెలా ప్రజల కోసం దేశంలోనే ఉంటూ లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలిచారు.

కళంకిత నేతల బిల్లుపై విపక్షం లేకుండానే జేపీసీ!

న్యూఢిల్లీ, అక్టోబరు 10: తీవ్రమైన నేరారోపణలపై 30 రోజుల పాటు అరెస్టయిన ప్రధానమంత్రి, సీఎంలు, మంత్రులను పదవుల నుంచి తొలగించే మూడు బిల్లులను సమీక్షించడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లో చేరడంపై ప్రతిపక్షాలు నోరు మెదపడం లేదు. ఈ నేపథ్యంలో అధికార ఎన్డీయే ఎంపీలతో పాటు, చిన్న పార్టీలు, స్వతంత్ర ఎంపీలతో కమిటీని ఏర్పాటు చేసేందుకు కేంద్రం యోచిస్తోంది. కమిటీ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపక్ష పార్టీలకు అనేకసార్లు రిమైండర్లు పంపామని, అయితే జేపీసీకి సభ్యులను నామినేట్ చేస్తారా లేకుంటే బాయ్‌కాట్ చేస్తారా అనేదానిపై స్పీకర్ ఓం బిర్లాకు వారు ఇంకా సమాచారం ఇవ్వలేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రతిపక్షం లేకుండా జేపీసీ ఏర్పాటైతే అది దేశ చరిత్రలోనే అసాధారణమైన ఘటనగా మిగిలిపోతుందని లోక్‌సభ మాజీ సెక్రటరీజనరల్ పీడీటీ ఆచార్య పేర్కొన్నారు.

అమెరికా ఆయుధ తయారీ ఫ్యాక్టరీలో పేలుడు

» కనీసం 19 మంది గల్లంతు .. పెద్ద సంఖ్యలో మృతులు!

టెన్నిస్సీ, అక్టోబరు 10: అమెరికా టెన్నిస్సీలోని ఆయుధ తయారీ కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 19 మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. అక్యురేట్ ఎనర్జిటిక్ సిస్టమ్స్ ఫ్యాక్టరీలో సంభవించిన ఈ పేలుడు ధాటికి భవనం పూర్తిగా నేలమట్టమైంది. శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉంటారని అనుమానిస్తున్నారు. పేలుడు తీవ్రతకు ఫ్యాక్టరీలోని పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. మంటలు చెలరేగడంతో పాటు పెద్ద ఎత్తున పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు 17 కిలోమీటర్ల వరకు వినిపించాయని స్థానికులు తెలిపారు.

గాజాలో కాల్పుల విరమణ అమల్లోకి

వాడి గాజా, అక్టోబరు 10: యుద్ధరంగమైన గాజాలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం, హమాస్ తిరుగుబాటుదార్లు కాల్పులను విరమించారు. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని ఇజ్రాయెల్ మిలటరీ మధ్యాహ్నం ప్రకటించింది. అంతకుముందు ఇజ్రాయెల్ మంత్రివర్గం సమావేశమయి యుద్ధంలో విరామం పాటించాలని నిర్ణయించింది. హమాస్ విడుదల చేయనున్న బందీలకు బదులుగా పాలస్తీనా ఖైదీలను అప్పగించాలని కూడా తీర్మానించింది. కాల్పులను విరమించడంతో సెంట్రల్ గాజాలోని వాడీ గాజాలో వేలాది మంది చేరారు. అక్కడి నుంచి గాజాలోని ఉత్తర ప్రాంతానికి నడక ప్రారంభించారు. కాగా, గాజాలోని అన్నార్థులకు ఆదివారం నుంచి ఆహారం అందించనున్నట్టు ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.

తాలిబన్ మంత్రి భారత్ పర్యటన వేళ.. అఫ్గాన్‌పై పాక్ దాడులు!

ఇస్లామాబాద్/పాకిస్థాన్, అక్టోబరు 10: అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులకు తెగబడింది. తెహ్రీక్-ఇ-తాలిబన్-పాకిస్థాన్ (టీటీపీ) స్థావరాలే లక్ష్యంగా చేసుకొని గురువారం రాత్రి కాబుల్, పక్తికా ప్రావిన్స్‌లో దాడులు చేసింది. దీంతో ఆయా ప్రాంతాలు పేలుళ్లతో దద్దరిల్లాయి. తాలిబన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ భారత్ పర్యటన వేళ ఈ దాడులు చోటు చేసుకున్నాయి. అఫ్గానిస్థాన్-భారత్‌కు దగ్గరవ్వడం జీర్ణించుకోలేకనే పాక్ దాడులకు తెగబడినట్లు తెలుస్తోంది. పాక్‌కు కొరకరాని కొయ్యగా మారిన టీటీపీ చీఫ్ నూర్ వలీ మెహ్సూద్‌ను లక్ష్యంగా చేసుకొని వైమానిక దాడి జరిగినట్లు సమాచారం. అయితే, మెహ్సూద్ పేరు వెల్లడించకుండా.. తమ సైనిక కాన్వాయ్‌పై దాడికి పాల్పడిన 30 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని పాక్ ప్రకటించింది. మరోవైపు, భారత్-అఫ్గాన్ మధ్య స్నేహ బంధం చిగురిస్తోంది. వాణిజ్యం, మానవతా సాయం కోసం కాబుల్‌లో భారత్ నిర్వహిస్తున్న టెక్నికల్ మిషన్‌ను పూర్తిస్థాయి రాయబార కార్యాలయం హోదాకు అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ వెల్లడించారు.

చినాబ్‌పై సావల్‌కోట్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్..!

న్యూఢిల్లీ, అక్టోబరు 10: సింధు జలాల ఒప్పందం నిలిపివేత తర్వాత జమ్ముకశ్మీర్‌లో పలు కీలక ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఈ క్రమంలోనే చినాబ్ నదిపై గతంలో నిలిపివేసిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి లభించే దిశగా కీలక ముందడుగు పడింది. జమ్ముకశ్మీర్‌లోని చినాబ్ నదిపై ఏర్పాటు చేయనున్న ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి ఇవ్వాలని కోరుతూ ఇటీవల జరిగిన సమావేశంలో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల కమిటీ సిఫారసు చేసింది. నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) లిమిటెడ్ నిర్మించే 1,856మెగావాట్ల ప్రాజెక్టు.. పశ్చిమాన ప్రవహించే చినాబ్ నదిపై నిర్మించనున్న అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో ఒకటి.

పీఏసీ రైల్వేల ఉప కమిటీ కన్వీనర్‌గా కె.లక్ష్మణ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ విభాగాలపై అధ్యయనం చేసేందుకు ఆరు ఉప కమిటీలను లోక్‌సభ సచివాలయం ఏర్పాటు చేసింది. ఇందులో ఆర్థిక, రక్షణ, రైల్వేకు చెందినవి ఉన్నాయి. రైల్వేల ఉప కమిటీకి బీజేపీ రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటు చేసిన ఉప కమిటీకి టీఎంసీ ఎంపీ సుఖేందు శేఖర్ కన్వీనర్‌గా ఉండగా ఈ ప్యానెల్‌లో తెలుగు ఎంపీలు సీఎం రమేశ్, ఎం.శ్రీనివాసులురెడ్డి, బాలశౌరి వల్లభనేని సభ్యులుగా ఉన్నారు. రక్షణ వ్యవహారాలపై ఏర్పాటు చేసిన ఉప కమిటీకి ఒడిశా ఎంపీ అపరాజిత సారంగి కన్వీనర్‌గా, సీఎం రమేశ్ సహ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఇందులో బాలశౌరి వల్లభనేని, మాగుంట శ్రీనివాసులురెడ్డి సభ్యులుగా ఉన్నారు. సివిల్-టూ ఉప కమిటీలో కె.లక్ష్మణ్ సభ్యులుగా ఉన్నారు.



ట్రంప్ అశాంతి!

నోబెల్‌పై పెట్టుకున్న ఆశలన్నీ ఆవిరి.. 8 యుద్ధాలు ఆపానన్నా దక్కని బహుమతి

» అసలైన శాంతి కంటే రాజకీయాలకే నోబెల్ కమిటీ ప్రాధాన్యత అని వైట్‌హౌస్ విమర్శ

వాషింగ్టన్, అక్టోబరు 10: రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత 'ప్రపంచ శాంతి దూత'గా అవతారమెత్తిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు 'శాంతి' లేకుండా పోయింది. ఎనిమిది యుద్ధాలు ఆపానని చెప్పినా.. వెంటనే ఒప్పందానికి రాకపోతే నరకం చూపిస్తానంటూ బెదిరించి ఇజ్రాయెల్, హమాస్ మధ్య హడావుడిగా సంధి కుదిర్చినా కూడా ఆయనను నోబెల్ శాంతి బహుమతి వరించలేదు. దానిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ట్రంప్.. దీనితో తీవ్రంగా అసంతృప్తికి లోనయ్యారు. దీనిపై ట్రంప్ నేరుగా ప్రకటన చేయకపోయినా.. అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌజ్ ప్రతినిధి స్టీవెన్ చుయెంగ్ మీడియాతో మాట్లాడారు. "నోబెల్ కమిటీ మరోసారి శాంతి కంటే రాజకీయాలకే ప్రాధాన్యత ఇచ్చింది. అయినా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధాలను ఆపుతూనే ఉంటారు. శాంతి ఒప్పందాలు కుదుర్చుతూనే ఉంటారు. ప్రజల ప్రాణాలను కాపాడుతారు. ఆయనొక గొప్ప మానవతా వాది. తన సంకల్ప బలంతో పర్వతాలనైనా కదిలించగలిగే ట్రంప్ వంటి వ్యక్తి మరొకరు ఉండరు.." అని పేర్కొన్నారు. కాగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని, ఆయనకు తాము మద్దతు పలుకుతున్నామని బహుమతి ప్రకటనకు ముందు రష్యా పేర్కొనడం గమనార్హం. ఈ మేరకు పుతిన్ సన్నిహితుడు యూరి ఉషకోవ్ ప్రకటన చేశారు.

నేను అర్హుడిని.. నేనే అర్హుడిని!

ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా తొలిసారి పనిచేసిన సమయంలోనే తనకు నోబెల్ శాంతి బహుమతిపై ఆశలు ఉన్నట్టు బయటపెట్టారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక అయితే బహిరంగంగానే ప్రకటనలు చేశారు. వివిధ దేశాల మధ్య యుద్ధాలను ఆపానని, నోబెల్ శాంతి బహుమతికి తానే అర్హుడినని కూడా పలుమార్లు పేర్కొన్నారు. భారత్-పాకిస్థాన్, కాంబోడియా-థాయ్‌లాండ్, కాంగో-రువాండా, ఇజ్రాయెల్-ఇరాన్, సెర్బియా-కొసావో, ఈజిప్ట్-ఇథియోపియా, ఆర్మేనియా-అజర్‌బైజాన్‌ల మధ్య యుద్ధాలను ఆపానని చెప్పుకొచ్చారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధ విరమణ కోసం ప్రయత్నాలు చేశారు. తాజాగా హడావుడిగా ఇజ్రాయెల్-హమాస్ మధ్య శాంతి ఒప్పందాన్నీ కుదిర్చారు. మొత్తంగా ఈసారి తనకు నోబెల్ వస్తుందని ఆశలు పెట్టుకున్నారు. బహుమతి ప్రకటనకు ఒక రోజు ముందు శ్వేతసౌధం 'శాంతి అధ్యక్షుడు (ది పీస్ ప్రెసిడెంట్)' అంటూ ట్రంప్ ఫొటోతో ఎక్స్‌లో పోస్టు కూడా పెట్టడం గమనార్హం. పాకిస్థాన్ ప్రభుత్వం నోబెల్ శాంతి బహుమతి కోసం ట్రంప్ పేరును అధికారికంగా నామినేట్ చేసింది. ఇజ్రాయెల్, కాంబోడియా ప్రధానులు నెతన్యాహు, హున్ మానెట్ కూడా ప్రతిపాదించారు.

వింత ప్రకటనలతో పరువు పోతున్నా..

ఇంతగా ఆశపెట్టుకున్నా తనకు నోబెల్ శాంతి బహుమతి రాదని ట్రంప్ మథనపడ్డారు కూడా. తాను ఎన్ని యుద్ధాలు ఆపినా, శాంతికోసం ఎంత కృషి చేసినా తనకు నోబెల్ ఇవ్వకపోవచ్చని కూడా ఒకట్రెండు సార్లు వ్యాఖ్యలు చేశారు. భారత్ నిర్ద్వంద్వంగా ఖండించినా కూడా.. భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ఎన్నోసార్లు ప్రకటనలు చేశారు. ఇప్పటివరకు నలుగురు అమెరికా అధ్యక్షులు రూజ్‌వెల్ట్ (1906లో), వుడ్రో విల్సన్ (1919), జిమ్మీకార్టర్ (2002), బరాక్ ఒబామా (2009లో) నోబెల్ శాంతి బహుమతి పొందారు. అయితే వారందరికన్నా ప్రపంచ శాంతి కోసం తాను చేపట్టిన చర్యలు గొప్పవని ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఒబామా అసలేమీ చేయకపోయినా కూడా నోబెల్ ఇచ్చారని వ్యాఖ్యానించారు.

నోబెల్ బహుమతి ట్రంప్‌కు అంకితం: మరియా మచాడో

ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి పొందిన మరియా మచాడో.. ఈ బహుమతిని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. "వెనెజువెలాలో స్వేచ్ఛ కోసం చేస్తున్న మా పోరాటానికి నోబెల్ బహుమతి గొప్ప గుర్తింపు. గొప్ప విజయానికి మేం దగ్గరయ్యాం. వెనెజువెలా స్వేచ్ఛను పొందుతుంది. ప్రజాస్వామ్యం కోసం పోరాటంలో మాకు మద్దతుగా నిలిచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, అమెరికా ప్రజలు, లాటిన్ అమెరికా ప్రజలు, ప్రజాస్వామ్య దేశాలకు కృతజ్ఞతలు. వెనెజువెలాలో బాధిత ప్రజలకు, మాకు అండగా నిలిచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు నోబెల్‌ను అంకితం ఇస్తున్నా.." అని ఎక్స్‌లో పోస్టు చేశారు. తాను ఓ పెద్ద ఉద్యమంలో భాగస్వామిని మాత్రమేనని.. ఈ బహుమతి వెనెజువెలాలో తమ పోరాటానికి గౌరవమని వ్యాఖ్యానించారు.

లోకం తీరు



హెచ్1బీ వీసా మరింత కఠినం!

వాషింగ్టన్, అక్టోబరు 10: ఇప్పటికే హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచిన ట్రంప్ ప్రభుత్వం.. ఆ వీసా కార్యక్రమాల్లో మరింత కఠిన సంస్కరణలు తీసుకురానుంది. వీసా పరిమితి మినహాయింపుల అర్హత నిబంధనలు కఠినతరం చేయడంతో పాటు, ఉద్యోగాలు కల్పించే కంపెనీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, థర్డ్ పార్టీ ప్లేస్‌మెంట్స్‌పై మరింత దృష్టి పెట్టాలని నిర్ణయించింది. హెచ్1బీ వీసా కార్యక్రమాల్లో మార్పులు చేయడానికి యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ప్రతిపాదనలు చేసింది. ఇవి ఫెడరల్ రిజిస్టర్‌లో 'రిఫార్మింగ్ ది హెచ్1బీ నాన్‌ఇమ్మిగ్రెంట్ వీసా క్లాసిఫికేషన్ ప్రోగ్రామ్' పేరుతో నమోదయ్యాయి. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే విదేశీ నిపుణులపై ఆధారపడ్డ కంపెనీలు తీవ్ర ఇబ్బందులు పడతాయి. ముఖ్యంగా స్టార్టప్ కంపెనీలు అయితే వీసా ఖర్చులు భరించలేవు.

50 సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు

» జాబితాలో ముగ్గురు భారతీయులు

వాషింగ్టన్, అక్టోబరు 10: ఇరాన్ చమురు ఉత్పత్తులు, ఎల్‌పీజీ ఎగుమతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నారనే అభియోగాలపై 50కి పైగా సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధించింది. ఈ జాబితాలో వరుణ్ పులా, సోనియా శ్రేష్ఠ, అయ్యప్పన్ రాజా అనే ముగ్గురు భారతీయులు కూడా ఉన్నారు. ఈ ఆంక్షల వల్ల ఆయా వ్యక్తులు, సంస్థలకు అమెరికాలో ఉన్న ఆస్తులు, సంబంధిత బ్యాంకు ఖాతాలు స్తంభించిపోతాయి. వరుణ్ పులా.. బెర్తా షిప్పింగ్ కంపెనీకి యజమాని. సోనియా శ్రేష్ఠకు చెందిన వెగాస్టార్ షిప్ మేనేజ్‌మెంట్ సంస్థ ఇరాన్ ఎల్‌పీజీని పాకిస్థాన్‌కు రవాణా చేస్తోంది. అయ్యప్పన్ రాజాకు చెందిన ఈవీ లైన్స్ సంస్థ ఇరానీయన్ ఎల్‌పీజీని చైనాకు రవాణా చేసింది.

ధైర్యం.. విశ్వసనీయత

» నోబెల్ శాంతి బహుమతి విజేతలకు ఉండే లక్షణాలివి

» ట్రంప్‌ను ఎందుకు ఎంపిక చేయలేదన్న ప్రశ్నకు నోబెల్ కమిటీ ఛైర్మన్ ఫ్రిడ్నెస్ సమాధానం



ఆస్లో, అక్టోబరు 10: ధైర్యం, విశ్వసనీయత కలిగిన వ్యక్తులు మాత్రమే నోబెల్ శాంతి బహుమతికి ఎంపిక అవుతారని నోబెల్ కమిటీ ఛైర్మన్ జోర్గెన్ వానె ఫ్రిడ్నెస్ స్పష్టం చేశారు. ట్రంప్‌ను ఈ బహుమతికి ఎందుకు ఎంపిక చేయలేదన్న విలేకరుల ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేయటం గమనార్హం. నోబెల్ శాంతి బహుమతి రేసులో ట్రంప్ పేరును అసలు పరిగణించలేదన్న విధంగా ఆయన సంకేతాలిచ్చారు. ట్రంప్‌కు నోబెల్ దక్కనుందంటూ పెద్ద ఎత్తున జరిగిన ప్రచారాన్ని విలేకరులు ప్రస్తావించగా.. 'నోబెల్ కమిటీ అన్ని రకాల ప్రచారాన్ని, మీడియాలో వచ్చిన వార్తలను చూసింది. శాంతి కోసం తాము కృషి చేశామని పేర్కొంటూ ఏటా వేలకు వేల ఉత్తరాలు మాకు అందుతుంటాయి. నోబెల్ విజేతల ఫొటోలున్న గదిలో ఈ కమిటీ సమావేశమవుతుంది. ఆ గది నిండా ధైర్యం, విశ్వసనీయత నిండి ఉంటాయి. శాంతి కోసం జరిగిన కృషి, ఆల్ఫ్రెడ్ నోబెల్ (నోబెల్ బహుమతి వ్యవస్థాపకుడు) వీలునామా ఆధారంగా మాత్రమే మా నిర్ణయం ఉంటుంది' అని ఫ్రిడ్నెస్ స్పష్టం చేశారు. నోబెల్ శాంతి బహుమతి విజేత మరియా కొరినా మచాడో గురించి మాట్లాడుతూ.. అవధుల్లేకుండా విస్తరిస్తున్న అంధకారంలో ప్రజాస్వామ్య జ్వాలను మండించటానికి తనను తాను అంకితం చేసుకున్న మహిళగా అభివర్ణించారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా, చీలికలు పేలికలుగా ఉన్న ప్రతిపక్ష శిబిరాన్ని సమైక్యపరచటంలో ఆమె గొప్ప పాత్ర పోషించారని ప్రశంసలు కురిపించారు. 'గత ఏడాదిగా ఆమె అజ్ఞాతంలో ఉన్నారు. తన ప్రాణాలకు తీవ్రమైన ముప్పు పొంచి ఉందని తెలిసి కూడా వెనెజువెలాలోనే ఉంటున్నారు. ఆమె పోరాటం కోట్లాదిమందిలో స్ఫూర్తి నింపుతోంది. నియంతలు అధికారాన్ని హస్తగతం చేసుకున్నప్పుడు దానికి వ్యతిరేకంగా స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం పోరాడే వ్యక్తులను గుర్తించటం ఎంతో అవసరం' అని చెప్పారు.

ఆ 4.5 కిలోల బంగారం ఎక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

దిద్దించి, అప్పగించిన రాగి-బంగారు తొడుగుల బరువు కేవలం 38.25 కిలోలు. అంటే నాలున్నర కిలోలు తేడా వచ్చింది. తగ్గిందంతా బంగారమేనని అనుమానిస్తున్నారు. శబరిమల ఆలయంలో ద్వారపాలక విగ్రహాల పాదపీఠానికి, తొడుగులకు వేసిన బంగారు తాపడం మెరుగు తగ్గడంతో దానికి తన సొంత ఖర్చుతో కొత్తగా తాపడం వేయించేందుకు బెంగళూరుకు చెందిన ఉన్నికృష్ణన్ పొట్టి ముందుకొచ్చాడు. ఆయన గతంలో దేవస్థానంలో ఉద్యోగం చేసినవాడే కావడం గమనార్హం. మొదట 2019 జూలైలో పాదపీఠాలు, తొడుగులను మెరుగుదిద్దే బాధ్యతను ఆయనకు అప్పగించారు. జూలై 19న పొట్టి సమక్షంలోనే వాటిని తొలగించారు. తూకం వేయగా 42.8 కిలోలని తేలింది. మర్నాడు శబరిమల నుంచి పాదపీఠాలు, విగ్రహ తొడుగులతో కూడిన కంటైనర్ బయల్దేరింది. చెన్నైలో బంగారుతాపడం చేసే సంస్థ స్మార్ట్ క్రియేషన్ వర్క్‌షాప్‌కు చేరగానే అక్కడి ఉద్యోగులు తూకం వేయగా.. 38.25కిలోలు ఉన్నట్లు తేలింది. కంటైనర్‌లో ఎక్కించినపుడు 42.8 కిలోలున్న బంగారం తాపడం ఉన్న రాగి తొడుగులు కిందికి దింపగానే నాలుగున్నర కిలోలు ఎలా తగ్గాయన్నదే ప్రశ్న. దీనికితోడు కంటైనర్ శబరిమల నుంచి చెన్నైలోని వర్క్‌షాప్‌కు చేరడానికి 39 రోజులు పట్టింది! జూలై 20న బయల్దేరితే ఆగస్టు 29కి చేరింది. ఆ 39 రోజుల్లో ఏం జరిగిందనే దానిమీద తాము పరిశోధించామని, సంచలనాత్మక విషయాలు తెలిశాయని ఎన్డీటీవీ ప్రకటించింది. కంటైనర్ కొట్టాయంలోని ఒక ప్రైవేటు దేవాలయం, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ఆలయాలు, బెంగళూరులోని శ్రీరాంపురంలో అయ్యప్ప ఆలయానికి వెళ్లినట్లు తెలిపింది. చెన్నైలో ఉంటున్న ప్రముఖ మలయాళ నటుడు జయరాం ఇంట్లో జరిగిన ప్రైవేటు పూజకు కూడా వీటిని తీసుకెళ్లినట్లు ఆరోపిస్తోంది. ఇందుకు సంబంధించి ఒక ఫేస్‌బుక్ పోస్టును ఆధారంగా చూపిస్తోంది. 2019 ఆగస్టు 29న చెన్నై వర్క్‌షాప్‌కు వచ్చిన విగ్రహాల తొడుగులకు మెరుగులు దిద్ది, సెప్టెంబరు 11న తిరిగి దేవస్థానానికి పంపారు. వర్క్‌షాప్‌కి వచ్చినప్పుడు వాటి బరువు 38.25 కిలోలు ఉంటే ఉన్నికృష్ణన్ పొట్టి తన సొంత బంగారం 394 గ్రాములు కలిపి మెరుగులు దిద్దించాడు. సొంత బంగారం కలిపినప్పటికీ వర్క్‌షాప్‌ఎకు ఎంత బరువుతో వచ్చిందో అంతే బరువుతో తిరిగి పంపించడం గమనార్హం. మరోవైపు తగ్గిన నాలుగున్నర కిలోల బరువు గురించి అడిగిన వారూ లేరు, చెప్పిన వారూ లేరు. అదనంగా చేర్చిన 394 గ్రాములు ఏమయ్యాయని అడిగిన వారు కూడా లేరు. చివరకు 2019 డిసెంబరులో పొట్టి తన దగ్గర కొంత దేవస్థానం బంగారం మిగిలిందని, అనుమతిస్తే కుమార్తె పెళ్లికి వాడుకుంటానని స్వయంగా దేవస్థానానికి ఈ-మెయిల్ పెట్టారు. దీంతో దేవస్థానం బంగారం దాత చేతిలో ఉందన్న విషయం మీడియా దృష్టికి వచ్చింది. వరస కథనాలు రావడంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 2020లో హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం వేశారు. 2021లో దీనిపై దర్యాప్తునకు హైకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ దర్యాప్తులో ద్వారపాలకుల విగ్రహాల తొడుగుల విషయంలో నాలుగున్నర కిలోల బంగారం తేడా ఉందన్న విషయం బయటకు వచ్చింది. నిజానికి 2018లో కూడా ఇతనికి ప్రధాన ద్వారం బంగారం తాపడం మెరుగులు పెట్టే బాధ్యతను అప్పగించారు. ఆయన ఏకంగా ప్రధాన ద్వారాన్ని చెన్నైకి తీసుకెళ్లి బంగారు తాపడం పెట్టించుకువచ్చారు. ఆ సమయంలో దేవస్థానమే ఆయనకు 474.9 గ్రాముల బంగారాన్ని ఇచ్చింది. కొత్తగా తాపడం చేసిన ఆలయ ద్వారాలను ఉన్నికృష్ణన్ పొట్టి 2019 మార్చిలో కేరళకు తీసుకొచ్చి, ఒక పెద్ద కార్యక్రమంలో ఆలయ పెద్దలకు అప్పగించాడు.

దేవస్థానం తప్పు చేయలేదు: విజయన్

ట్రావెంకోర్ దేవస్వం బోర్డు ఎలాంటి తప్పూ చేయలేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. బంగారం దుర్వినియోగం వెనక ఎవరున్నా చట్టం చేతికి చిక్కుతారని వ్యాఖ్యానించారు. గత నెల 22న పంబ తీరంలో తాము నిర్వహించిన శబరిమల కాంక్లేవ్‌ను దెబ్బతీయడానికే కొన్ని శక్తులు కుట్ర చేశాయని అన్నారు. ఆ కార్యక్రమానికి రెండు రోజుల ముందు దాత ఉన్నికృష్ణన్ పొట్టి బంధువు ఇంట్లో మిగిలిన బంగారం పట్టుకోవడం, విలేకరుల సమావేశం పెట్టడం.. ఇవన్నీ కాంక్లేవ్‌ను దెబ్బతీసే ప్రయత్నాలేనని చెప్పారు.

మాల్యా ఇచ్చింది 30 కిలోలు

1998లో వ్యాపారవేత్త విజయ్ మాల్యా 30 కిలోల బంగారాన్ని శబరిమల ఆలయానికి విరాళంగా ఇచ్చారు. మరో 800 గ్రాములు తలుపుల తాపడం కోసం ఇచ్చారు. ఉన్నికృష్ణన్ వ్యవహారాలపై విచారిస్తున్నప్పుడు మాల్యా ఇచ్చిన బంగారంలో ఎంత ఆలయానికి వెచ్చించారు? ఎంత మిగిలింది? అనేది లెక్కలు లేవని కేరళ హైకోర్టు గుర్తించింది. ఆ లెక్కలన్నీ తీయాలని సిట్‌ను ఆదేశించింది. సిట్ రిపోర్టులో మిగిలిన బంగారం వాడుకుంటానని ఉన్నికృష్ణన్ పొట్టి రాసిన



లేఖ ప్రస్తావనకు వచ్చినప్పుడు హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తాము నిబంధనల ప్రకారమే చేశామని ట్రావెంకోర్ బోర్డు స్పష్టం చేసింది. హైకోర్టు అంతటితో వదల్లేదు. ఇప్పుడు ఆలయంలో ద్వారపాలకుల విగ్రహాలకు అమర్చిన పాదపీఠం, తొడుగులు అసలువా, నకిలీవా? అనేది తేల్చాలని ఆదేశించింది.

క్రిమినల్ కేసు నమోదుకు హైకోర్టు ఆదేశం

కేరళ హైకోర్టు దేవస్థానం బంగారం దుర్వినియోగంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రాష్ట్ర పోలీసులను ఆదేశించింది. ద్వారపాలకుల విగ్రహాల తొడుగులేకాకుండాప్రధాన ద్వారం తాపడాల బంగారం విషయంలోనూ అవకతవకలు జరిగాయని హైకోర్టు నిర్ధారించింది. దీనిపైనే క్రిమినల్ కేసు పెట్టమని ఆదేశించింది. తాపడం చేయడానికి ఉన్నికృష్ణన్ పొట్టికి 474.9 గ్రాముల బంగారాన్ని దేవస్థానం ఇచ్చిందని, దాతగా ఆయన ఎంత తిరిగిచ్చారో చెప్పలేదని ప్రస్తావించింది.

పాక్‌కు కొత్త ఆయుధాలేవీ ఇవ్వడం లేదు

క్షిపణుల విక్రయం వార్తలను ఖండించిన అమెరికా

న్యూఢిల్లీ, అక్టోబరు 10: దాయాది దేశం పాకిస్థాన్‌కు అత్యాధునిక క్షిపణులు అందించేందుకు అమెరికా ఒప్పందం చేసుకుందంటూ వస్తున్న వార్తలను అగ్రరాజ్యం తోసిపుచ్చింది. ఇటీవల సవరించిన ఒప్పందం ప్రకారం పాక్‌కు అడ్వాన్స్‌డ్ మీడియం రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్ (ఏఎమ్ఆర్ఏఏఎంఎస్) అందించనుందనే ప్రచారాన్ని ఖండించింది. ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తాజా ఒప్పందం ప్రకారం పాకిస్థాన్ సహా అనేక దేశాలకు ఇప్పటికే ఉన్న ఆయుధాల నిర్వహణ, విడి భాగాలు అందిస్తామని మాత్రమే పేర్కొన్నట్టు తెలిపింది. పాక్‌కు కొత్తగా ఎలాంటి ఆయుధాలూ సరఫరా చేయబోమని స్పష్టం చేసింది. అమెరికా రక్షణ శాఖ సెప్టెంబరు 30న సవరించిన ఒప్పందాన్ని వెల్లడించింది. దీనిపై పాక్‌కు చెందిన డాన్ సహా అనేక పత్రికలు అమెరికా తమ దేశానికి కొత్త క్షిపణులు విక్రయించనున్నట్టు పేర్కొన్నాయి.

భారత సైన్యానికి 'మార్ట్‌లెట్'లు!

» బ్రిటన్‌కు చెందిన అధునాతన క్షిపణుల కొనుగోలు

» యూకేతో రూ.4151 కోట్ల డీల్



న్యూఢిల్లీ, అక్టోబరు 10: భారత సైన్యానికి బ్రిటన్‌కు చెందిన అధునాతన క్షిపణులు సమకూరనున్నాయి. ఈ మేరకు ఇరుదేశాల మధ్య రూ.4151 కోట్ల విలువైన కీలక రక్షణ ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా మార్ట్‌లెట్‌లుగా పిలిచే 'వివిధ రకాల లక్ష్యాలను ఛేదించగల తేలికపాటి క్షిపణుల (ఎల్ఎంఎం)'లను భారత్ కొనుగోలు చేయనుంది. ఈ మార్ట్‌లెట్ క్షిపణులను ఐర్లాండ్‌లోని బెల్‌ఫాస్ట్‌కు చెందిన 'థేల్స్ ఎయిర్ డిఫెన్స్' సంస్థ అభివృద్ధి చేస్తోంది. పురాణాల్లో ఉండే 'మార్ట్‌లెట్' అనే పక్షి పేరును ఈ క్షిపణులకు పెట్టారు. అలుపెరగని పక్షి అని దీని అర్థం. ఇవి తేలికపాటి, బహుళ ప్రయోజనకర క్షిపణులు. వీటిని గగనతలం నుంచి గగనతలం, గగనతలం నుంచి భూతలం, భూతలం నుంచి భూతలం, భూతలం నుంచి గగనతలం దాడులకు ఉపయోగించుకోవచ్చు. గగనతల రక్షణ వ్యవస్థలతో పాటు డ్రోన్లు, సాయుధ వాహనాలు వంటి మిలటరీ లక్ష్యాలను కూడా ఛేదించేలా వీటిని రూపొందించారు. లేజర్ బీమ్ గైడెన్స్‌తో పనిచేసే ఈ క్షిపణులను సైనికులు భుజంపై ఉంచుకొని ప్రయోగించే వీలు కూడా ఉంటుంది. సాయుధ వాహనాలకు అనుసంధానం చేసి, హెలికాప్టర్లు, నౌకల నుంచి కూడా ప్రయోగించవచ్చు. ఇవి ఆరు కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలవు. 13 కిలోల బరువుండే ఈ మార్ట్‌లెట్ క్షిపణులు ధ్వని వేగం కంటే ఒకటిన్నర రెట్లు వేగంగా దూసుకెళ్లగలవు. వీటిని 2019 నుంచి బ్రిటన్ సైన్యంలో వాడుతున్నారు. ఇవే క్షిపణులను యూకే ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తోంది. ప్రస్తుతం రష్యాపై యుద్ధంలో ఉక్రెయిన్ వీటిని వినియోగిస్తోంది. కాగా, భారత్-యూకే మధ్య విస్తృత ఆయుధాల ఒప్పందం కుదిరేందుకు తాజా క్షిపణి ఒప్పందం దారి చూపినట్లయిందని బ్రిటన్ ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే యూకేలో ఇంజనీరింగ్, టెక్నాలజీ, క్రియేటివ్ పరిశ్రమ తదితర రంగాల్లో 64 భారత కంపెనీలు రూ.15,430 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యాయని.. వీటి ద్వారా దాదాపు 7 వేల ఉద్యోగాలు లభిస్తాయని వివరించింది.

త్వరలోనే వాయుసేనకు 'తేజస్'

భారత గగనతల రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. గంటకు 2,200 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో.. బ్రహ్మోస్ క్షిపణులను సైతం మోసుకెళ్లే సామర్థ్యం కలిగిన తేలికపాటి స్వదేశీ యుద్ధ విమానం తేజస్ ఎంకే-1ఏ ఈ నెలాఖరులోనే భారత వాయుసేన (ఐఏఎఫ్)లో చేరనుంది. ఈ నెల చివరి వారంలో మొదటి తేజస్ ఎంకే-1ఏ ఫైటర్ జెట్‌ను హాల్ డెలివరీ చేయనుంది. 1.8 మాక్ స్పీడ్‌తో దూసుకెళ్లే ఈ ఫైటర్ జెట్ కొత్త తరం క్రూయిజ్ క్షిపణులను కూడా మోసుకెళ్లగలదు. వాస్తవానికి గతేడాది ఫిబ్రవరిలోనే తేజస్ ఎంకే-1ఏ యుద్ధ విమానాలు ఐఏఎఫ్‌కు చేరాల్సి ఉంది. కానీ.. అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ (జీఈ) సంస్థ నుంచి ఇంజిన్ల సరఫరా జాప్యం కావడంతో హాల్ వీటిని సకాలంలో తయారుచేయలేక పోయింది. తేజస్ ఎంకే-1ఏకి కీలకమైన ఎఫ్404-ఐఎన్20 ఇంజన్లు నెలకు ఒకటి లేదా రెండు యూనిట్ల చొప్పున మాత్రమే వస్తున్నాయి. ఈ క్రమంలో ఐఏఎఫ్ ఆర్డర్ చేసిన మొత్తం 83 యుద్ధ విమానాలను వచ్చే నాలుగేళ్లలో డెలివరీ చేసేందుకు హాల్ ప్రయత్నిస్తోంది. ఇవిగాక, మరో 97 తేజస్ ఎంకే-1ఏ ఫైటర్ జెట్ల కోసం చర్చలు కీలక దశలో ఉన్నాయి.



స్వామివారి నిత్యకల్యాణంలో పాల్గొన్న కించిత్ కారన్ ట్రస్టు భక్త బృందం

భద్రాద్రి రామయ్య సేవలో 225 జంటలు

- దర్శించుకున్న తమిళనాడు కించిత్ కారన్ ట్రస్టు సభ్యులు

భద్రాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రానికి చెందిన కించిత్ కారన్ ట్రస్టు భక్త బృందం శుక్రవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ట్రస్టు నిర్వాహకులు వేలుకుడి కృష్ణన్ ఆధ్వర్యంలో 1500 మంది భక్త బృందం పురుషోత్తముడు పేరుతో పిలువబడే క్షేత్రాలను సందర్శించే ప్రక్రియలో భాగంగా పురుషోత్తమ విద్యా యాత్రను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ట్రస్టు సభ్యులు మంగళగిరి, సింహాచలం, శ్రీకూర్మం, పూరి, భద్రాచలం, అహోబిలం క్షేత్రాలను సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలం వచ్చిన ట్రస్టు సభ్యులంతా ఉదయం స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం చిత్రకూట మండపంలో స్వామి వారి నిత్య కల్యాణం నిర్వహించగా.. 225 జంటలు కల్యాణంలో పాల్గొన్నాయి. ఇదిలా ఉండగా.. ట్రస్టు సభ్యులు తాము సందర్శించే క్షేత్రాల్లో భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ పారాయణాన్ని నిర్వహిస్తుండడం విశేషం. ఇటీవల కాలంలో అత్యధికంగా నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తుల సంఖ్య ఇదే.

తీర కవచం కకావికలం



ఉమ్మడి గుంటూరు జిల్లా కొత్తపాలెం సముద్రం సమీపంలో నరికేసిన మడచెట్లు

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో యథేచ్ఛగా మడ అడవుల నరికివేత
- అటవీ భూముల్లో రొయ్యల చెరువులు
- చోద్యం చూస్తున్న అటవీ అధికారులు

(రేపల్లె-ఆంధ్రజ్యోతి)

సముద్ర తీర ప్రాంత రక్షణ కవచం కకావికలమవుతోంది. విచ్చలవిడి నరికివేతతో మడ అడవులు కనుమరుగవుతున్నాయి. పచ్చని ప్రహరీలా తుపానులు, ఉప్పెనల వంటి ప్రకృతి విపత్తుల నుంచి తీర ప్రాంతాలను కాపు కాసే మడ చెట్లు మోడుబారిపోతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 37 వేల హెక్టార్లలో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. ముఖ్యంగా రేపల్లె మండలం లంకేవానిదిబ్బ, మోళ్లగుంట, తాళ్లతిప్ప, నిజాంపట్నం మండలం కొత్తపాలెం, అడవులదీవి, దిండి, నిజాంపట్నం ప్రాంతాలు మడ అడవులకు ప్రసిద్ధి. మడ అడవులను ఇష్టానుసారంగా నరికివేస్తూ కొందరు దళారులు రొయ్యల చెరువులు సాగు చేసుకుంటున్నారు.

గత టీడీపీ హయాంలో ప్రత్యేక దృష్టి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మడ అడవుల అభివృద్ధిపై 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. తీర ప్రాంతాల్లో మడ మొక్కలను నాటి అడవులను విస్తరించింది. దీంతో మడ అడవులకు జాతీయ స్థాయిలో అవార్డు కూడా దక్కింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు దృష్టి సారించకపోవడంతో ఇష్టానుసారంగా మడ చెట్లను నరికివేశారు. ఈ కలపను తీసుకెళ్లి రొయ్యల చెరువుల గట్లపై కంచెగా నాటుకునేందుకు వినియోగిస్తున్నారు. వంట చెరకుగా విక్రయిస్తున్నారు. మడ అటవీ భూములను కొందరు భారీగా ఆక్రమించి రొయ్యల చెరువులను సాగు చేస్తున్నారు. స్థానికంగా నివాసం ఉంటూ రేపల్లె, నిజాంపట్నం మండలాల్లోని తీర ప్రాంతాల్లో మడ అడవుల బాగోగులు చూసుకోవాల్సిన అటవీ శాఖ అధికారులంతా బాపట్ల, గుంటూరు జిల్లా కేంద్రాలకే పరిమితమయ్యారు. ఉన్నతాధికారులు సందర్శనకు వచ్చినప్పుడు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిపోతున్నారు. మడ అడవుల రక్షణపై వారు దృష్టి సారించిన దాఖలాల్లేవు. ఈ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు కనీసం పెట్రోలింగ్ కూడా నిర్వహించడం లేదు.

ఎన్నో ఉపయోగాలు

మడ అడవులు ప్రకృతి విపత్తుల నుంచి తీర ప్రాంతాలను రక్షించడమే గాక పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్నాయి. తాబేళ్ల సంతానోత్పత్తికి అనువైన ప్రదేశాన్ని సృష్టిస్తాయి. మత్స్యసంపద అభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని కల్పిస్తాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న మడ అడవులను రక్షించుకునేందుకు కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తీర ప్రాంత గ్రామాల ప్రజలు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. లేకుంటే మడ అడవులు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే రామాంజనేయులు

కలుషిత ఆహారం తిని 54 మంది విద్యార్థులకు అస్వస్థత

- గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స
- పరామర్శించిన మంత్రి సవిత

పెదనందిపాడు/గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అనపర్రు గ్రామంలోని బీసీ వసతి గృహానికి చెందిన 54 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 16 మంది వాంతులు, విరేచనాలతో ఇబ్బందిపడ్డారు. వెంటనే వారిని పెదనందిపాడులోని పీహెచ్‌సీకి తరలించారు. మిగిలిన 38 మంది కూడా అనారోగ్యానికి గురవడంతో పెదనందిపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపానికి తరలించి అక్కడ ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారీయా పెదనందిపాడు చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. 16 మంది విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కాగా.. అస్వస్థతకు గురైన విద్యార్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పరామర్శించారు. త్వరలోనే డిశ్చార్జ్ చేస్తారని వారికి ధైర్యం చెప్పారు.



పొగాకు గోదాము నుంచి ఎగిసిపడుతున్న అగ్నిజ్వాలలు

రూ.550 కోట్ల విలువైన పొగాకు దగ్ధం

- ప్రకాశం జిల్లాలో ఓ పొగాకు కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం

సింగరాయకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలోని ఓ పొగాకు కంపెనీలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శుద్ధి చేసి, ఎగుమతికి సిద్ధంగా ఉంచిన 11 మిలియన్ కేజీల పొగాకు అగ్నికి ఆహుతయింది. వివరాలు.. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కలికివాయి పంచాయతీ పరిధిలో బీకే త్రెషర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉంది. దీన్ని 2012 నుంచి గాడ్ ఫ్రే ఫిలిప్స్ ఇండియా(జీపీఐ) లిమిటెడ్ కంపెనీ అద్దె ప్రాతిపదికన తీసుకొని వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తోంది. శుక్రవారం వేకువజామున 3 గంటల సమయంలో అగ్నిప్రమాదం చోటుచేసుంది. ఎగుమతికి సిద్ధంగా ఉన్న... కోటి 10 లక్షల(11 మిలియన్) కేజీల పొగాకు ఉంచిన ఏ, బీ ఏసీ గోదాముల నుంచి ఒక్కసారిగా భారీగా అగ్నిజ్వాలలు ఎగిసిపడ్డాయి. సిబ్బంది వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు, టంగుటూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉదయం మంటలు అదుపులోకి వచ్చాయి. ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రూ.550 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు జీపీఐ కంపెనీ జీఎం ప్రభాకర్‌రావు పోలీసులకు తెలిపారు. సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర కేసు నమోదు చేశారు.

డీఏలు, పీఆర్సీ కమిషన్‌పై ఉద్యోగుల్లో నిరాశ

- ఏపీ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు

విజయవాడ (గాంధీనగర్), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దీపావళి కానుకగా ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీ కమిషన్‌పై మంత్రివర్గ సమావేశంలో చర్చించి ప్రకటిస్తారని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలిందని ఏపీ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించకపోవడంపై ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొందని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

3 నుంచి మునిసిపల్ వర్కర్స్ సమ్మె

వన్‌టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కాకపోతే నవంబరు 3 నుంచి సమ్మె చేపడతామని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)కు శుక్రవారం సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగనాయకులు, సుబ్బరాయుడు మాట్లాడుతూ మునిసిపల్ వర్కర్ల డిమాండ్ల పరిష్కారం కోరుతూ నవంబరు 3 నుంచి సమ్మె చేపడుతున్నామని తెలిపారు.

సమాచార హక్కు చట్టంతో ప్రజాస్వామ్యం బలోపేతం

- హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రజని

మంగళగిరి సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు వంటి చట్టాలు ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తాయని ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజని అన్నారు. సమాచార హక్కు చట్టం అమలై 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏపీ సమాచార కమిషన్ ఆధ్వర్యంలో ఆర్టీఐ వారోత్సవాలను శుక్రవారం మంగళగిరిలోని సమాచార శాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రజని మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రభుత్వానికి జవాబుదారీతనాన్ని పెంచుతుందని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No.42 to 55/TO/2025-26, తేది: 09.10.2025

కృష్ణా జిల్లాలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ కేంద్ర భవనం, క్రియామాటోరియా & కమ్యూనిటీ హాల్ పూర్తి చేయు 14 పనుల కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. అంచనావ్యయం రూ.133 లక్షలు. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 18.10.2025 నుండి. వివరాలకు దర్శించగలరు: www.tender.apeprocurement.gov.in ఫోన్: 9866062101.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, PRI డివిజన్, మచిలీపట్నం.

DIPR RO.No: 17749/CL/ADVT/1/1/2021-22, తేది: 10.10.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ

నెం. 04/2025-26, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు** తేది:08.10.2025

కార్యపాలక ఇంజనీరు, పి.ఆర్.ఐ. డివిజన్, ఒంగోలు పరిధిలో ZP నిధుల నుండి మంజూరైన 3 పనులు మరియు ఆర్.యల్.పురం గ్రామ పంచాయతీ నిధుల నుండి మంజూరైన 15 పనులకు మొత్తం అంచనా విలువ రూ.**644.00** లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్స్ లభ్యమగు తేది: 15.10.2025 ఉ.11.00గం.ల నుండి. వివరాలను http://www.eprocurement.gov.in లో చూడగలరు.

సం/- కార్యపాలక ఇంజనీరు, పి.ఆర్.ఐ. డివిజన్, ఒంగోలు

DIPR RO No.17739/CL/ADVT/1/1/2021-22, Dt: 10.10.2025

GOVERNMENT OF INDIA
DEPARTMENT OF SPACE
CMG, SDSC - SHAR SRIHARIKOTA - 524124

Brief E- TENDER NOTICE: CORRIGENDUM-II (SALE EXTENSION)

No: e-Tender Notice No.CMG/C/CON/258715-(II) Dt: 09.10.2025

Refer to Tender No CMG/C/CON/258715 dated 09.9.2025 Name of work: **"Balance works for Package - D: Construction of LOSF storage bay for C32 main building etc., for SLP Augmentation, SDSC SHAR"** (Est. cost **Rs 249 Lakhs**).

Sale period extended up to 17.10.2025

Interested tenderers may visit www.isro.gov.in or www.tenderwizard.com/ISRO for details.

Sd/- GROUP HEAD, CMG/SDSC SHAR

GOVERNMENT OF ANDHRA PRADESH
MUNICIPAL ADMINISTRATION DEPARTMENT
MACHILIPATNAM MUNICIPAL CORPORATION

'e'- PROCUREMENT NOTICE

Tender Notice No. 15 / MMC / MGF / 2025-26; Dt. 10-10-2025

No. of Works : 3	Value of Works (EST) Rs. 22,82,000/-
Bid Document Download starting Date	14-10-2025 @ 10-00 PM
Bid Document Download End Date	22-10-2025 @ 10-00 AM
Last Date & time for Receipt of Bids	22-10-2025 @ 10-30 AM
Technical Bid Opening Date	22-10-2025 @ 11-00 AM

Name and Address : **Municipal Commissioner, Machilipatnam Municipal Corporation, Pin code No. 521 001. FAX : 08672- 222856**

Further details can be seen @ 'apeprocurement' market place www.apeprocurement.gov.in

Sd/- MUNICIPAL COMMISSIONER
Machilipatnam Municipal Corporation

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ

(ఉన్నత విద్యా శాఖ, విద్యా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం క్రింద స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ)
మొదటి అంతస్తు, NSIC-MDBP బిల్డింగ్,
ఓఖ్లా ఇండస్ట్రియల్ ఏరియా, న్యూ ఢిల్లీ 110020
ఫోన్: 011 69095250, వెబ్‌సైట్ www.nta.ac.in,
ఇమెయిల్: procurement@nta.ac.in

టెండరు కోరుతూ ప్రకటన

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారిక వినియోగం కొరకు నెలవారీ అద్దె ప్రాతిపదికన ముప్పై వాహనాలు ఏర్పాటు చేయుట కొరకు నమోదిత, పేరొందిన, అనుభవం కలిగిన, మరియు ఆర్థిక సామర్థ్యం కలిగిన ఏజెన్సీల నుండి రెండు బిడ్ల విధానం (సాంకేతిక మరియు ఆర్థిక బిడ్) క్రింద సీల్డ్ టెండర్లు కోరబడుతున్నవి. **GeM బిడ్ నంబర్: GeM/2025/B/6722964 తేది: 29 సెప్టెంబర్ 2025**

అంచనావ్యయం: ఏడు కోట్ల రూపాయలు

బయానా: ఏడు లక్షల రూపాయలు

టెండరు ఫారం మరియు **RFP** www.nta.ac.in and www.gem.gov.in లో లభిస్తాయి.

GeM పోర్టల్‌పై ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే దాఖలు చేయవలసి ఉంటుంది.

సం/- డైరెక్టర్ (ప్రొక్యూర్‌మెంట్)

cbc 21354/12/0002/2526

భారత ప్రభుత్వం
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
ICAI/ICoAI(ICMAI)/ICSI ద్వారా
నియామక ప్రకటన

మానేసర్, హర్యానా వద్ద గల భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో సెంట్రల్ ఫెసిలిటీ సెంటర్స్ (CRC/CPC/CPACE/CSC) లో ICAI, ICSI, ICoAI (ICMAI) ద్వారా **కాంట్రాక్చువల్** ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్/అసిస్టెంట్ యంగ్ ప్రొఫెషనల్ **145 ఉద్యోగాల** భర్తీ కొరకు ICAI/ICoAI(ICMAI)/ICSI లో ఇంటర్మీడియట్/ఎగ్జిక్యూటివ్ లెవల్ పరీక్షలు ఉత్తీర్ణులైనట్టి అర్హత పొందిన CA/CS/CMA మరియు సెమీ క్వాలిఫైడ్ వ్యక్తుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నవి. కాంట్రాక్టు కాలం ప్రాథమికంగా మూడు సంవత్సరాల గరిష్ఠ కాలంగా ఉండి, ప్రతీ సంవత్సరం పునరుద్ధరించుకొనుటకు వీలుగా లేదా 35 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు, ప్రతీ సంవత్సరం చివరిలో పునఃసమీక్షించే సంతృప్తికరమైన పనితీరును బట్టి, ఏది ముందైతే అదిగా ఉంటుంది. భర్తీ చేయబోయే ఉద్యోగాల వివరాలు దిగువ ఇవ్వబడినవి:

క్ర.సం.	ఉద్యోగం పేరు	విద్యార్హత	వేతనం	గరిష్ఠ వయస్సు
1.	యంగ్ ప్రొఫెషనల్	ICAI/ICoAI(ICMAI)/ICSI అర్హత పొందిన సభ్యుడు	నెలకు రూ.75,000/- లు వార్షిక పెరుగుదల రూ.5,000/- ఆదివారాలు మరియు సెలవురోజుల్లో కార్యాలయానికి హాజరు అయిన దానికి రోజుకు రూ.2,500/- కలిపి అదనంగా ఇవ్వబడును.	కాలవ్యవధి 03 సంవత్సరాల సమయంలో ఏ సమయంలోనైనా 35 సంవత్సరాలు మించరాదు.
2.	అసిస్టెంట్ యంగ్ ప్రొఫెషనల్	ICAI/ICoAI(ICMAI)/ICSI ఇంటర్మీడియట్/ఎగ్జిక్యూటివ్ లెవల్ పరీక్ష ఉత్తీర్ణులైన వ్యక్తులు	నెలకు రూ.40,000/- లు వార్షిక పెరుగుదల రూ.2,500/- ఆదివారాలు మరియు సెలవురోజుల్లో కార్యాలయానికి హాజరు అయిన దానికి రోజుకు రూ.2,500/- కలిపి అదనంగా ఇవ్వబడును.	కాలవ్యవధి 03 సంవత్సరాల సమయంలో ఏ సమయంలోనైనా 35 సంవత్సరాలు మించరాదు.

తదుపరి వివరాలు అనగా విద్యార్హత, దరఖాస్తు ఫారాల దాఖలు విధానం, ఇతర నిబంధనలు వగైరా కొరకు వెబ్‌సైట్స్ www.mca.gov.in, www.icai.org, www.icsi,edu./career and icmai.in. లను దర్శించగలరు. ఆసక్తి కలిగిన అర్హత గల అభ్యర్థులు https://www.icai.org/post/career-in-icai, https://eicmai.in/Recruitment/index.aspx మరియు https://stimulate.icsi.edu/RECRUITMENTలో ఆన్‌లైన్‌లో తమ సంబంధిత ఇనిస్టిట్యూట్ ప్రకారం తప్పనిసరిగా దాఖలు చేసుకొనగలరు. దాని అవశ్యకత ప్రకారం ప్రకటిత ఉద్యోగాలను పెంచుటకు/తగ్గించుటకు లేదా ఉద్యోగాన్ని భర్తీకూడా చేయకుండా ఉండే హక్కు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కలిగియున్నది.

దరఖాస్తుల స్వీకరణకు ఆఖరి తేది: 30 అక్టోబర్ 2025

సం/- రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్
సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్

CBC 07123/11/0417/2526

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

E PROCUREMENT SHORT TENDER NOTICE

NIT No. MAU61-USI0HB(OTH)/380/2025-HB, Dt.10.10.2025

NAME OF WORK: "APCRDA-Replacement of the existing street light poles with decorative poles and smart LED luminaire with independent control system along Karakatta road from Kondaveeti vaagu to honble CM Residence and then along the road leading to Seed access road (E3 road). Providing new octagonal poles in the extent portion of seed access road and replacement of existing Luminaire with smart Luminaire upto E3-N9 junction" **ECV:Rs.4,40,94,683/-.**

The bid can be downloaded on AP e-procurement portal from **11.10.2025** to **18.10.2025** up to **14.00 Hrs.** Due date for submission of Bid **18.10.2025** up to **15.00 Hrs,** Technical bid opening **18.10.2025 @ 16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్
(ఆం.ప్ర.ప్రభుత్వ రంగ సంస్థ)
చీఫ్ ఇంజనీర్ (N) & (S) కార్యాలయం, APIIC లిమిటెడ్, 9వ అంతస్తు, APIIC టవర్-1, ఆటోనగర్, IT పార్క్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503, వెబ్:www.apiic.in

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

సంక్షిప్త టెండరు ప్రకటన నం.71/CE (N)
MSME పథకం క్రింద కృష్ణా జిల్లా, పామర్రు (మం), ఐనంపూడి (గ్రా), ఇండస్ట్రియల్ పార్క్ వద్ద ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ షెడ్లకు లోపల, బయట విద్యుదీకరణ మరియు ఫైర్ ఫైటింగ్ పనుల ఏర్పాట్లు. (5వ పిలుపు) - ECV రూ.86,09,538/-.

సంక్షిప్త టెండరు ప్రకటన నం.72/CE (N)
MSE-CDP క్రింద విజయనగరం జిల్లా, నెల్లిమర్ల, IP వద్ద ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు లోపల, బయట విద్యుదీకరణ మరియు ఫైర్ ఫైటింగ్ పనుల ఏర్పాట్లు. (5వ పిలుపు) ECV రూ.1,42,84,523/-.

టెండరు ప్రకటన నం.73/CE (N)
ప్రధాన పని: ఆంధ్రప్రదేశ్, అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, బల్క్ డ్రగ్ పార్క్ నెలకొల్పుట. ఉప-పని: ఆంధ్రప్రదేశ్, అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి వద్ద మెరైన్ ఔట్‌ఫాల్ 5.27 MLD నిర్మాణం. ప్యాకేజ్-II.

టెండరు ప్రకటన నం.74/CE(N)
IALA ఫండ్స్ 2025-26 క్రింద ఆంధ్రప్రదేశ్, శ్రీకాకుళం జిల్లా, రణస్థలం (మం), ఐపి-పైడిభీమవరం (గ్రా) వద్ద ఇండస్ట్రియల్ పార్క్‌లో ఫ్లోటింగ్ పాట్ హోల్స్ MR-1 & CR-1, 3 Wm, 50mm మందం DGBM మరియు 30 మందం BC రెన్యువల్.

టెండరు ప్రకటన నం.75/CE(N)
ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, విజయవాడ ఈస్ట్ నియోజకవర్గం, ముత్యాలంపాడు వద్ద ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (FFC) నిర్మాణం.

బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది : తేది: **10.10.2025న రా.8.00 గం.లకు.**
బిడ్ల దాఖలుకు ఆఖరి తేది : తేది: **27.10.2025న మ.3.00 గం.లకు.**

సంక్షిప్త టెండరు ప్రకటన నం.68/CE(S)
MSE-CDP క్రింద ఆంధ్రప్రదేశ్, తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి (మం), ఐపి-శ్రీకాళహస్తి వద్ద ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు లోపల, వెలుపల విద్యుదీకరణ మరియు ఫైర్ ఫైటింగ్ పనుల ఏర్పాట్లు. (5వ పిలుపు) ECV రూ.1,42,84,523/-.

సంక్షిప్త టెండరు ప్రకటన నం.69/CE(S)
SPSR నెల్లూరు జిల్లా, నెల్లూరు అర్బన్ మండలంలో నెల్లూరు బిట్-II (V), భగత్ సింగ్ కాలనీ వద్ద ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ బిల్డింగ్‌కు లోపల, వెలుపల విద్యుదీకరణ మరియు ఫైర్ ఫైటింగ్ పనుల ఏర్పాట్లు. (5వ పిలుపు) ECV రూ.1,42,84,523/-.

బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: తేది: **09.10.2025 న రా.8.00 గం.లకు**
బిడ్ల దాఖలుకు ఆఖరి తేది : తేది: **15.10.2025న మ.3.00 గం.లకు.**

టెండరు ప్రకటన వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్లను www.apeprocurement.gov.in లేదా http://tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

సం/- చీఫ్ ఇంజనీర్ (N) & (S)
APIIC: మంగళగిరి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ఉద్యానవన శాఖ
ఆసక్తి వ్యక్తీకరణ

ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్ పామ్ అభివృద్ధి కొరకు నూతన ప్రాంతాల కేటాయింపు

(నోటిఫికేషన్)

ఆయిల్ పామ్ సాగు మరియు అభివృద్ధి కొరకు (5) జిల్లాలలో (32) మండలాలు కేటాయించుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల వారీగా మండలాల జాబితా దిగువ ఇవ్వబడినది:

క్ర.సం.	జిల్లా పేరు	మండలాల సంఖ్య	మండలం పేరు
1.	గుంటూరు	10	1) తాడికొండ 2) ఫిరంగిపురం 3) మేడికొండూరు 4) గుంటూరు ఈస్ట్ 5) గుంటూరు వెస్ట్ 6) ప్రత్తిపాడు 7) వట్టిచెరుకూరు 8) కాకుమాను 9) తుళ్లూరు, 10) పెదనందిపాడు
2	పల్నాడు	15	1) దాచేపల్లి, 2) గురజాల 3) కారెంపూడి 4) రెంటచింతల 5) వెల్దుర్తి 6) నరసరావుపేట్ 7) నూజెండ్ల 8) రొంపిచెర్ల 9) శావల్యాపురం 10) వినుకొండ 11) అచ్చంపేట 12) క్రోసూరు 13) ముప్పాళ్ళ 14) నెకరికల్లు 15) పెదకూరపాడు
3	తిరుపతి	2	1) నారాయణవనం 2) నాగలాపురం
4	ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు	2	1) గుడ్లూరు, 2) లింగసముద్రం
5	బాపట్ల	3	1) బల్లికురవ 2) సంతమాగులూరు, 3) అద్దంకి
	మొత్తం	32	

ఆయిల్ పామ్ ప్లాంటేషన్స్‌ను అభివృద్ధి చేయాలనుకునే మరియు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పాలనుకునే సంస్థలు/కంపెనీలు/కో-ఆపరేటివ్స్/రైతులు, సంస్థలు డైరెక్టర్ ఆఫ్ హార్టీకల్చర్ కార్యాలయం నుండి సవివరమైన దరఖాస్తు ఫారాన్ని పొందవచ్చును. ఇందుకుగాను **"కమిషనర్ ఆఫ్ హార్టీకల్చర్, ఆయిల్ పామ్"** పేరున DD ద్వారా రూ.5000/- వాపసు రాని దరఖాస్తు ఫీజును చెల్లించవలెను మరియు **27.10.2025**న లేదా అలోగా **సా.5.30** గం.లోగా కమిషనర్ ఆఫ్ హార్టీకల్చర్ కార్యాలయం, T.T.P.C. బిల్డింగ్, చుట్టుగుంట, గుంటూరు-522007 కార్యాలయంలో పూర్తి చేసిన దరఖాస్తును దాఖలు చేయవలెను. దరఖాస్తు మరియు ఇతర వివరాలు శాఖ వెబ్‌సైట్ **horticulture.ap.nic.in** నుండి కూడా పొందవచ్చును. వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తుదారులు దరఖాస్తు దాఖలు చేయు సమయంలో **కమిషనర్ ఆఫ్ హార్టీకల్చర్, ఆయిల్ పామ్** వారి పేరున తీసిన **రూ.5,000/-** కొరకు తీసిన DD ని కూడా జతచేయవలసి ఉంటుంది.

సం/- డా.కె.శ్రీనివాసులు,
I.A.S, డైరెక్టర్ ఆఫ్ హార్టీకల్చర్ & ఆయిల్ పామ్ కమిషనర్.

DIPR R.O.No.4486PP/CL/ADVT/1/1/2021-22, Dt.10.10.2025

VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY

e-AUCTION NOTICE

Rc. No.122 &123/2025/F1 Dt. 10-10-2025 & Rc. No.08/2025/G1 Dt. 10-10-2025

The VMRDA, Visakhapatnam has proposed to sell the vacant plots in Chinamushidiwada Layout (New), Odd Bits and Flats in various layouts developed by the VMRDA to the public on "as is where is basis" and applications are invited through GOAP e-auction portal **(https://Konugolu.ap.gov.in)** as detailed below:

PLOTS

Name of the Layout	No. of Plots	Receipt of applications	Date of Auction
Chinamushidiwada	5	13-10-2025 to 27-10-2025	29-10-2025
Odd bits in various layouts	10	13-10-2025 to 28-10-2025	30-10-2025
TOTAL PLOTS	15		

FLATS

Name of the Housing Scheme	No. of Flats	Receipt of applications	Date of Auction
Kapuluppada Housing Scheme	3 Flats	16-10-2025 to 30-10-2025	01-11-2025
Kurmannapalem Housing Layout	1 Flat		
TOTAL	4 Flats		

For more details at VMRDA website www.vmrda.gov.in /Email e.auctionvmrda@gmail.com / (Help desk Konugolu portal) +91 9154383633/34, 7337318402/03, VMRDA, Contact details : 9848320117 & 9848716168, Land Line No.0891-2755554 & 0891-2754133/2754005.

Sd/-Metropolitan Commissioner, VMRDA

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ప్రజాప్రయోజన ప్రకటన
ఆహార పరిరక్షణ, ప్రమాణాల అమలు విభాగం

fssai Eat Right India

ఆరోగ్యం హానికరం

మంచి బెల్లం — నిషిద్ధ రంగులు కలిపిన బెల్లం

రంగు కలపని చికెన్ లెగ్స్ — నిషిద్ధ రంగులు కలిపిన చికెన్ లెగ్స్

రంగు కలపని పీచుమిఠాయి — నిషిద్ధ రంగులు కలిపిన పీచుమిఠాయి

ఆరోగ్యానికి హానికరమైన నిషిద్ధ రంగులు కలిపిన ఆహారాన్ని ఈ విధంగా గుర్తించవచ్చు

సలహాలు, ఫిర్యాదుల కోసం సంప్రదించండి
సంచాలకులు: 08645 241 0295
జాయింట్ ఫుడ్ కంట్రోలర్: 94403 79755

జారీ చేసినవారు: ఆహారభద్రత కమీషనర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అఫ్ఘాన్ మైత్రి

అఫ్ఘానిస్థాన్ విదేశాంగమంత్రి మనదేశంలో తొలిసారిగా కాలూనడమే కాక, ఢిల్లీలో కూచొని పాకిస్థాన్‌ను చెడామడా ఏకేయడం పాలకులకు సహజంగానే సంతోషం కలిగిస్తుంది. మాతో పెట్టుకుంటే ఏం జరుగుతుందో తెలియకపోతే, నాటో, సోవియట్ యూనియన్, అమెరికాలని అడిగితెలుసుకో అంటూ మన పొరుగుదేశాన్ని ఉద్దేశించి ఆయన చేసిన హెచ్చరికలు విన్నవారికీ, చూసినవారికి తెగనచ్చేసి ఉంటాయి. వారం రోజుల భారత పర్యటనకు తాను ఉపక్రమించగానే, 'తెహ్రీక్–ఎ–తాలిబాన్ పాకిస్థాన్' (టీటీపీ) స్థావరాలమీద పాకిస్థాన్ దాడులకు దిగడం, ఆ సంస్థ అధినేత నిర్మూలనే లక్ష్యంగా భీకరంగా విరుచుపడుతున్నట్టు పాక్ మీడియా చెప్పుకోవడం ముత్తాఖీకి కోపం తెప్పించింది. అఫ్ఘాన్ల ధైర్యసాహసాలను పరీక్షించి, ప్రమాదంలో పడవద్దని పాకిస్థాన్‌ను హెచ్చరించడంతోపాటు, తమ గడ్డమీదనుంచి భారత వ్యతిరేక కార్యకలాపాలను ఏ మాత్రం అనుమతించబోమని కూడా ఆయన హామీ ఇచ్చారు. ఒక్క మహిళా పాత్రికేయురాలు కూడా లేని విలేఖరుల సమావేశంలో ఉభయదేశాల సంబంధాల గురించి అమీర్‌ఖాన్ ముత్తాఖీ ఎంతో చక్కని వ్యాఖ్యలు చేశారు, భారత్ తమకు ఎంతో ముఖ్యమైన, మిత్రదేశమని ప్రకటించారు.

దాదాపు నాలుగేళ్ళ తరువాత భారత్–అఫ్ఘాన్ మధ్య అత్యున్నతస్థాయి భేటీ జరిగింది. విదేశాంగమంత్రులు ఇద్దరూ కరచాలనాలు చేసుకున్నారు, చేయిచేయి కలిపి ముందుకు సాగాలన్న లక్ష్యాన్ని ప్రకటించుకున్నారు. తాలిబాన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించకుండానే, కొద్దికాలంలోనే భారత్ చాలా దగ్గరైంది. ఇప్పుడు ఓ ఇరవై అంబులెన్స్‌లు, వైద్యపరికరాలు ఇవ్వడం వంటి సుహృద్భావ చర్యలను అటుంచితే, ప్రకృతివైపరీత్యాల్లో దానిని ఆదుకుంటూ, ఆహారధాన్యాలు, మందులు వంటివి అందిస్తూ, మూడు బిలియన్ డాలర్ల ప్రాజెక్టులను కూడా అక్కడ చేపడుతోంది. తాలిబాన్ పునరాగమనానికి ముందు, అష్రాఫ్ ఘనీ పాలనాకాలంలో అయితే వేలకోట్లు కుమ్మరించింది. ఇప్పుడు మరో ఆరు కొత్త ప్రాజెక్టులకు భారత్ సిద్ధపడటంతో పాటు, కాబూల్‌లో నామమాత్రంగా ఉన్న సాంకేతిక కార్యాలయాన్ని పూర్తిస్థాయి దౌత్యకార్యాలయంగా మార్చాలన్న నిర్ణయం బంధం మళ్ళీ బలపడుతోందనడానికి నిదర్శనం. అఫ్ఘానిస్థాన్ తన గనుల రంగాన్ని భారత కంపెనీలకు తెరవడం మరో మంచి పరిణామం. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల పహల్గాం దాడిని ఖండించడంతో పాటు, ఆపరేషన్ సిందూర్ సందర్భంలో సైతం అఫ్ఘానిస్థాన్ మనపక్షానే నిలిచింది. అఫ్ఘాన్‌లోని బగ్రాం వైమానిక స్థావరాన్ని తనకు అప్పగించని పక్షంలో తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సివస్తుందని అమెరికా అధ్యక్షుడు తాలిబాన్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. ససేమిరా ఇచ్చేది లేదంటున్న తాలిబాన్‌ను రష్యా, చైనా, పాకిస్థాన్‌లతోపాటు భారత్ కూడా మొన్న మంగళవారం వెనకేసుకొచ్చింది.

తాలిబాన్ ప్రభుత్వాన్ని రష్యా మాత్రమే గుర్తించింది. గుర్తించిందీ లేనిదీ ప్రపంచానికి చెప్పకుండా, రాయబారిగా ఒకరిని అనుమతించి, చైనా అతివేగంగా తాలిబాన్ ప్రభుత్వానికి ఇప్పటికే దగ్గరై, ఆర్థికంగా ప్రయోజనం పొందుతోంది. చైనా–పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌ను ఇక్కడివరకూ విస్తరించే ఆలోచనలోనూ ఉంది. మారుతున్న పరిణామాల నేపథ్యంలో తాలిబాన్‌ను దగ్గరచేసుకోవడం భద్రత రీత్యా ఎంతో ముఖ్యమని భారత్ గ్రహించింది. అఫ్ఘానిస్థాన్‌ను అమెరికా సైన్యం విడిచిపోగానే అతికొద్దిగంటల్లోనే తాలిబాన్ ఆ దేశాన్ని స్వాధీనం చేసుకోవడం, అంతా అల్లాదయ అంటూ అప్పటి పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆనందాశ్రువులు కురిపించడం తెలిసినవే. అయితే, గతంలో మాదిరిగా పాకిస్థాన్ చెప్పినట్టు తాలిబాన్ ఆడకపోవడంతో అనతికాలంలోనే అఫ్ఘాన్–పాకిస్థాన్ మధ్య వ్యవహారం చెడింది. తాలిబాన్ ప్రోత్సాహంతోనే టీటీపీ విధ్వంసానికి పాల్పడుతోందని పాకిస్థాన్ ఆరోపణ. గత ఏడాది డిసెంబరులో ఉగ్రవాదులన్న ఆరోపణతో యాభైమంది అఫ్ఘాన్లను పాకిస్థాన్ హతమార్చిన ఘటనను భారత్ తీవ్రంగా ఖండించి తాలిబాన్‌కు దగ్గరైంది. భద్రతామండలి ముత్తాఖీని ఉగ్రవాదిగా ప్రకటించి, ఆంక్షలు విధించిన నేపథ్యంలో, ఈ పర్యటనకోసం మన పాలకులు భద్రతామండలిమీదే ఒత్తిడితెచ్చి తాత్కాలిక మినహాయింపు సాధించారట. ఇక, తాలిబాన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించడమన్న ఆనవాయితీ కూడా త్వరలోనే తీరిపోవచ్చు.

ప్రతికూల పవనాల్లో భారత్–అమెరికా మైత్రి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొగడ్తల విషయంలో చాలా పొదుపరి. ఒక వ్యక్తిని ఒకసారి మాత్రమే కాకుండా రెండుసార్లు, అందునా నాలుగు రోజుల వ్యవధిలో ఘనంగా ప్రశంసించడం అసాధారణమైన విషయమే. ఈ అరుదైన వైఖరిని ఆయన ఇటీవల చూపారు. మోదీ మెచ్చుకోలుకు అర్హుడైన పెద్ద మనిషి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ జె. ట్రంప్. 'ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధాన్ని ముగింపునకు తీసుకురావడానికి' ట్రంప్ ఇరవైసూత్రాల 'శాంతి ప్రణాళిక'ను ప్రతిపాదించిన సందర్భంగా ఆయనను మోదీ ఒకటికి రెండుమార్లు మెచ్చుకున్నారు, అభినందించారు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ట్రంప్ ప్రతిపాదించిన 'శాంతి ప్రణాళిక' గురించి సెప్టెంబర్ 30, 2025న మోదీ ఒక ప్రకటనలో ఇలా పేర్కొన్నారు: 'గాజా ఘర్షణను సమాప్తి చేసేందుకు దోహదం చేసే సమగ్ర ప్రణాళిక అది. పాలస్తీనియన్, ఇజ్రాయెలీ ప్రజలకే కాకుండా సమస్త పశ్చిమాసియా ప్రాంతానికి సుదీర్ఘ, సుస్థిర శాంతి, భద్రత, అభివృద్ధిని సమకూర్చే ఆచరణీయ మార్గమది'. మోదీ మరో అసాధారణ చర్య కూడా తీసుకున్నారు. తన ప్రకటనను ఎనిమిది భాషల– అరబిక్, చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్‌తో పాటు హిబ్రూ, హిందీ– లో జారీ చేశారు. అక్టోబర్ 4న మోదీ ఇలా ప్రకటించారు: 'గాజాలో శాంతి స్థాపనకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు నిర్ణయాత్మక పురోగతి సాధించాయి. హర్షామోదాలతో ఆయన నాయకత్వాన్ని స్వాగతిస్తున్నాం'.

నేనీ వ్యాసాన్ని రాస్తున్న సమయంలో ట్రంప్ శాంతి ప్రణాళిక మొదటి దశను అమలుపరిచేందుకు హమాస్, ఇజ్రాయెల్ అంగీకరించాయి. హమాస్ తన చెరలో ఉన్న ఇజ్రాయెలీ బందీలను విడుదల చేస్తుంది, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ పాటిస్తుంది. అయితే ఇవి ఎప్పటి నుంచి అమలవుతాయన్న విషయం తెలియదు, బహుశా, త్వరలోనే కావచ్చు. ఎట్టకేలకు శాంతి వీచికలు వీస్తున్నందుకు గాజాలోనూ, ఇజ్రాయెల్లోను ప్రజలు వీధుల్లోకి వచ్చి పండుగ చేసుకొంటున్నారు. హమాస్ ఇప్పటికీ ఆ శాంతి ప్రణాళికలోని అనేక అంశాలను అంగీకరించలేదు. ముఖ్యంగా గాజాపై తన నియంత్రణ అధికారాలను ఒక బాహ్య అధికార సంస్థకు అప్పగించేందుకు హమాస్ సుముఖత చూపడం లేదు.

జనవరి 20, 2025న అమెరికా అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిననాటి నుంచీ ట్రంప్ మహాశయుడు భారత్‌ను అగౌరవపరుస్తున్నారు, అవమానిస్తున్నారు. భారత్ ప్రయోజనాలను దెబ్బతీసే, భారతీయుల శ్రేయస్సుకు హానికలిగించే నిర్ణయాలే తీసుకుంటున్నారు. అయినప్పటికీ ట్రంప్‌ను ఘనంగా పొగిడేందుకు, ఆయనను ప్రసన్నుడిని చేసుకునేందుకు ప్రధాని మోదీ ఎందుకు అంతగా ఆరాటపడుతున్నారు? ట్రంప్ మొదటి పర్యాయం అధ్యక్షుడుగా ఉన్న కాలం (2017–21)లో భారత్ (ఇంకా కొన్ని ఇతర దేశాల)పై భారీ సుంకాలు విధించారు. ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకాలు విధించారు. భారత్‌కు జీఎస్‌పీ ప్రయోజనాలను రద్దు చేశారు. భారతీయులు వినియోగించుకుంటున్న వివిధ రకాల వీసాలు, ముఖ్యంగా హెచ్–1బిని నిలిపివేశారు. అయినప్పటికీ సెప్టెంబర్ 22, 2019న టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో ట్రంప్‌కు మద్దతుగా 'అబ్కీ బార్, ట్రంప్ సర్కార్' అనే ఒక అప్రతిష్ఠాకర ప్రకటనను మోదీ చేశారు.

ఈ ఏడాది జనవరిలో రెండో పర్యాయం అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన ట్రంప్ దరిమిలా గత తొమ్మిది నెలల్లో భారత్ (బ్రెజిల్ పైన కూడా)పై పెద్ద ఎత్తున సుంకాలు విధించారు. తద్వారా అమెరికాకు భారత్ నుంచి ఉక్కు, అల్యూమినియం, జౌళి ఉత్పత్తులు, ముత్యాలు, బంగారు ఆభరణాలు, సముద్ర ఆహారోత్పత్తులు, ఔషధాలు, పాదరక్షలు, ఫర్నీచర్, కార్లు, ఆట వస్తువులు మొదలైన వాటి ఎగుమతులను దాదాపుగా నిలిపివేశారు. రష్యా నుంచి పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా యుద్ధాన్ని కొనసాగించేందుకు రష్యాకు భారత్ నిధులు సమకూరుస్తోందని ట్రంప్ ఆరోపించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నదనే ఆక్షేపణతో భారత్‌పై మరో 25 శాతం అదనపు సుంకాలు విధించారు. ఆయన సన్నిహితుడు సెనేటర్ లిండ్సే గ్రాహమ్ అయితే భారత్‌ను తీవ్ర కష్టనష్టాలకు గురి చేస్తామని హెచ్చరించారు. 'రష్యా నుంచి చమురు కొనుగోలును కొనసాగిస్తే మీ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేస్తా'మని కూడా ఆయన తీవ్రంగా అన్నారు. భారత్‌ను 'టారిఫ్ కింగ్' అని ట్రంప్ దుయ్యబట్టారు. ఆయన వాణిజ్య సలహాదారు పీటర్ నవార్రో అయితే మరింత ఘోరంగా మాట్లాడారు. భారత్–రష్యా సంబంధాలను తీవ్రంగా విమర్శిస్తూ ఆ రెండు దేశాలూ 'మృత ఆర్థిక వ్యవస్థలు' అని ట్రంప్ వెటకారం చేశారు. హెచ్ 1–బి వీసాలకు దరఖాస్తు చేసే వారు లక్ష డాలర్ల ఫీజు చెల్లించాలని ఉత్తర్వు జారీ చేసారు. విద్యార్థి, కుటుంబ సభ్యుల వీసాల నియమ నిబంధనలను మరింత కఠినతరం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి–మే నెలల మధ్య 1000 మందికి పైగా భారతీయులను 'చట్టవిరుద్ధ వలసకారులు' అనే ఆరోపణతో అరెస్ట్ చేసి వారి చేతులకు సంకెళ్లు, కాళ్లకు గొలుసులు కట్టి సైనిక విమానంలో భారత్‌కు తరలించారు.



పహల్గాం ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ ప్రమేయమున్నదని తెలిసి కూడా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆ దేశానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. అమెరికా మద్దతుతో పాకిస్థాన్ ఐఎమ్ఎఫ్ నుంచి 100 కోట్ల డాలర్లు, ఏడీబీ నుంచి 80 కోట్ల డాలర్లు, ప్రపంచ బ్యాంక్ నుంచి 400 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని పొందింది. పాక్‌కు ఈ ఆర్థిక వితరణను భారత్ వ్యతిరేకించినప్పటికీ అమెరికా పట్టించుకోలేదు. పహల్గాం తరువాత భారత్–పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం ముగిసేందుకు తాను మధ్యవర్తిత్వం చేశానని ట్రంప్ ప్రకటించారు. ఇందులో ఆవగింజంత సత్యం కూడా లేదని భారత్ ఎంతగా ఖండించినప్పటికీ ట్రంప్ ఆ వాదనను పదే పదే పునరుద్ఘాటిస్తున్నారు. మున్నెన్నడూ లేని రీతిలో అమెరికా అధ్యక్షుడు తన అధికార నివాసం శ్వేతసౌధంలో పాకిస్థాన్ సైనిక దళాల ప్రధానాధికారికి గత జూన్ 18న విందు ఇచ్చారు. ఇది భారత్‌ను అవమానించడం కాదా? ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వాధినేత ఒక సైనికాధికారికి ఆతిథ్యమివ్వడమేమిటి? సెప్టెంబర్ 25న పాకిస్థాన్ ప్రధాన మంత్రి, సైనిక దళాల ప్రధానాధికారితో కలిసి విలేఖర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా పాక్ 'మహానాయకులు' ఇరువురూ అమెరికాకు అత్యాధునిక పరిశ్రమలకు అవసరమైన రేర్ ఎర్త్ మినరల్స్‌ను సరఫరా చేసేందుకు పాకిస్థాన్ సుముఖంగా ఉందని ప్రకటించారు. అంతేకాకుండా అరేబియా సముద్ర తీరస్థ ప్రాంతంలో ఒక ఓడ రేవును నిర్మించేందుకు అమెరికాను ఆహ్వానించారు. సెప్టెంబర్ 11 ఉగ్రవాద దాడులు, ఒసామా బిన్ లాడెన్, అబ్బోటాబాద్, పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఒక సురక్షిత స్థావరమై పోయిందని బుష్, ఒబామా ప్రభుత్వాలు పదే పదే చేసిన ప్రకటనలను ట్రంప్ అమెరికా పూర్తిగా విస్మరించింది. ఒకేసారి రెండు గుర్రాల (అమెరికా, చైనా)పై స్వారీ చేసే విద్యలో పాకిస్థాన్ ఆరితేరిపోయింది. జనవరి 2025 నుంచి భారత్‌కు అమెరికా మిత్ర దేశమని చెప్పేందుకు వీలు కల్పించే ఒక్క నిర్ణయాన్ని కూడా ట్రంప్ ప్రభుత్వం తీసుకోలేదు. భారత్–అమెరికా సంబంధాలు సజావుగా లేవు. అవి దిగజారుతున్నాయి. అంతర్జాతీయ పరిస్థితులు భారత్‌కు వ్యతిరేకంగా ఉన్నాయి. ఈ క్లిష్ట పరిస్థితిని అధిగమించేందుకు మరింత పట్టుదలతో బృహత్తర కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

> **జనవరి 2025 నుంచి భారత్‌కు అమెరికా మిత్ర దేశమని చెప్పేందుకు వీలు కల్పించే ఒక్క నిర్ణయాన్ని కూడా ట్రంప్ ప్రభుత్వం తీసుకోలేదు. భారత్–అమెరికా సంబంధాలు సజావుగా లేవు. అవి దిగజారుతున్నాయి. పరిస్థితి ఇదయితే ట్రంప్‌ను ప్రశంసించేందుకు ఇజ్రాయెల్ మద్దతుతో ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికను భారత ప్రధానమంత్రి ఎందుకు ఒక అవకాశంగా తీసుకున్నారు?**

పరిస్థితి ఇదయితే ట్రంప్‌ను ప్రశంసించేందుకు ఇజ్రాయెల్ మద్దతుతో ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికను భారత ప్రధానమంత్రి ఎందుకు ఒక అవకాశంగా తీసుకున్నారు అనేది ఒక ఆసక్తికరమైన ప్రశ్న. ఆ శాంతి ప్రణాళిక పాలస్తీనియన్లకు న్యాయం చేసేదేమీ కాదు. అందులోని 19వ అంశాన్ని చూడండి: గాజా పునర్ నిర్మాణ కార్యక్రమం కొనసాగుతూ, నిర్దేశించిన విధంగా పాలస్తీనా అథారిటీ తనను తాను సంస్కరించుకోవడం జరిగినప్పుడు పాలస్తీనా స్వయం నిర్ణయాధికార హక్కుకు, స్వతంత్ర దేశ ప్రతిపత్తికి అంతిమంగా అనుకూల పరిస్థితులు నెలకొంటాయి'. ఇదేమన్నా పాలస్తీనియన్లకు ఆనందోత్సాహాలు కలిగిస్తుందా?

నేను అభిప్రాయపడుతున్నది ఏమిటంటే యుద్ధం అంతిమంగా నిలిచిపోవచ్చు, త్వరలోనే బందీలు విడుదల కావచ్చు, నిస్సహాయులుగా మిగిలిపోయిన గాజా వాసులకు మానవతాపూరిత సహాయం అందవచ్చు... ఇంతమాత్రాన సమస్య తీరిపోతుందా? డోనాల్డ్ ట్రంప్, టోనీ బ్లెయిర్ (బ్రిటన్ మాజీ ప్రధాని) తదితర ప్రముఖులతో ఏర్పాటయ్యే 'బోర్డ్ ఆఫ్ పీస్' అనే సంస్థ పర్యవేక్షణలో గాజా దాదాపుగా ఒక వలసపాలనా ప్రాంతంగా పరిణమిస్తుంది. తమ మాతృభూమి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించాలన్న పాలస్తీనియన్ల స్వప్నం సంపూర్ణంగా భగ్నమవుతుంది. మళ్లీ అటువంటి స్వప్నానికి ఆస్కారం లేని పరిస్థితులు నెలకొంటాయి. భారత ఆర్థిక వ్యవస్థ పురోగతి గురించి, ప్రపంచ వ్యవహారాలలో భారత్ పోషిస్తున్న పాత్ర గురించి మోదీ చాలా చాలా గొప్పగా మాట్లాడడం కద్దు. ఆ ఘనమైన మాటలు ఎలా ఉన్నా ప్రపంచంలో భారత్‌కు కొద్ది మంది మిత్రులు మాత్రమే ఉన్నారని, భారత ఆర్థిక వ్యవస్థ గడ్డు పరిస్థితులను అధిగమించలేని పరిస్థితిలో ఉందన్న కఠోర వాస్తవాలను ప్రధాని మోదీ గుర్తించారు. చుట్టుముడుతున్న ప్రతికూల పరిస్థితులను అర్థం చేసుకుంటున్నారు. హేతుబద్ధమైన విదేశాంగ విధానం, మంచి వాణిజ్య, పెట్టుబడుల విధానాలకు చిత్తశుద్ధిలేని పొగడ్తలు ఎంత మాత్రం ప్రత్యామ్నాయాలు కావు, కాబోవు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

భారత ప్రజాస్వామ్య ఉద్ధారకుడు

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత రాజకీయాలలో సుప్రసిద్ధ నాయకుడిగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న జయప్రకాశ్ నారాయణ్ శ్రీవాస్తవ 'జనతా పార్టీ'ని స్థాపించి, 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీని ఓడించారు. తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి చరిత్రలోనే చెరగని ముద్ర వేశారు.

జయప్రకాశ్ నారాయణ్ 1902 అక్టోబర్ 11న బిహార్–ఉత్తర ప్రదేశ్ సరిహద్దులలోని ఒక కుగ్రామంలో జన్మించారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్ళి అక్కడ ఓహియో యూనివర్సిటీలో విద్యను పూర్తి చేసుకొని స్వదేశానికి చేరుకునే సమయంలో దేశంలో నడుస్తున్న స్వాతంత్ర్యోద్యమం వైపు ఆకర్షితుడై అందులో పాల్గొని, గాంధేయవాదిగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని స్థాపించారు. క్విట్ ఇండియా మూవ్‌మెంట్‌లో కీలకపాత్ర పోషించారు.

స్వాతంత్ర్యానంతరం భారత రాజకీయాల వైపు దృష్టి కేంద్రీకరించి, పలువురు నాయకులతో చర్చించేవారు. స్వార్థపూరిత రాజకీయాలను సహించేవారు కాదు. సామాన్యులకు సమ న్యాయం జరగాలన్నదే ఆయన ప్రధాన లక్ష్యం. సాధ్యమైనంతవరకు ప్రజలకు నిర్ణయాధికార హక్కులను ఇచ్చి, స్వచ్ఛమైన పరిపాలనను అందించాలన్నదే ఆయన వాదన. తాను ఏనాడూ పదవిని ఆశించలేదు. 1974 మార్చి 18న బిహార్‌లోని విద్యార్థులు ప్రభుత్వ అవినీతి కార్యకలాపాలకు వ్యతిరేకంగా ఒక ఉద్యమాన్ని లేవనెత్తారు. ఆ ఉద్యమానికి నాయకత్వం వహించవలసిందిగా జయప్రకాశ్ నారాయణ్‌ను కోరగా, అంగీకరించి ఆ ఉద్యమాన్ని విజయపథంలో నడిపారు. ఉత్తర భారతంలోని అన్ని రాష్ట్రాలకు ఈ ఉద్యమం విస్తరించి బిహార్ మూవ్‌మెంట్‌గా మారింది. అప్పుడే జయప్రకాశ్ నారాయణ్‌ను 'జె.పి'గా పిలిచారు.



జె.పి– 1975 ప్రారంభంలో 'ఛాత్ర యువ సంఘర్ష వాహిని' అనే ఒక స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. దీని కోసం పాట్నాలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి 'సమగ్ర మార్పుల కోసం – సంపూర్ణ విప్లవం' అన్న నినాదంతో పోరాటాన్ని నడిపించాలని పిలుపునిచ్చారు. అయితే ఇది అహింసాయుతంగా ఉండాలని, ఇందులో సామాజిక న్యాయం, అవినీతి నిరోధం, అసాంఘిక రుగ్మతలను రూపుమాపడం లాంటివి ముఖ్యోద్దేశ్యాలై సాగాలని కోరారు. రోజురోజుకు ప్రజాదరణ పెరిగి 'సంపూర్ణ క్రాంతి జబ్ నారాహై, భావీ ఇతిహాస్ హమారాహై' అంటూ ఉద్యమం ఉధృత రూపు దాల్చింది.

నాటి ప్రధాని ఇందిరాగాంధీ లోక్‌సభ ఎన్నికలలో అవినీతికి, అవకతవకలకు పాల్పడినట్లు నిరూపితమై, ఆమె ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చింది. అందులో ఆమె లోక్‌సభ ఎన్నిక రద్దుతో పాటు, మరో ఆరేళ్ళ వరకు ఎన్నికలలో పోటీకి అనర్హురాలిగా ప్రకటించింది. ఇందిరాగాంధీ సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్ళింది. 1975 జూన్ 25న హైకోర్టు తీర్పును సమర్థిస్తూ, తదుపరి చర్యలు చేపట్టేవరకు తన పదవిలో కొనసాగవచ్చని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఆ తీర్పును తట్టుకోలేని ఇందిరాగాంధీ, అదేరోజు రాత్రి భారత రాజ్యాంగంలోని 352(1) అధికరణాన్ని ఉపయోగించి దేశంలో అంతర్గత అలజడుల వలన హింసాత్మక సంఘటనలు చెలరేగే అవకాశం ఉందన్న సాకుతో నాటి దేశాధ్యక్షులు ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ చేత అత్యయిక పరిస్థితి (ఎమర్జెన్సీ)ని ప్రకటింపజేసింది. వెంటనే పౌరుల హక్కులను తొలగించింది. వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యాలను హరించింది. రాత్రికి రాత్రే ప్రతిపక్ష నాయకులందరినీ అరెస్టు చేయించి, జైళ్ళలో వేయించింది. దాదాపు 21 నెలల పాటు ఈ దేశం నిరంకుశత్వాన్ని చవిచూసింది. ఈ ఎమర్జెన్సీ కాలంలోనే జె.పి. ప్రతిపక్ష పార్టీలను ఏకం చేయాలని నిర్ణయించుకున్నారు. ఫలితంగా జనతా పార్టీ పుట్టింది. 1977లో జరిగిన ఎన్నికలలో కరడుగట్టిన కాంగ్రెస్ పార్టీని ఓడించి, ఆ పార్టీ అధికారాన్ని చేపట్టింది. జె.పి గొప్ప ప్రజాస్వామ్య పోరాట యోధుడుగా గడిపి, కొంతకాలం తర్వాత ఆరోగ్యం క్షీణించి 1979 అక్టోబరు 8న పరమపదించారు.

జయప్రకాశ్ నారాయణ్ సామాజిక సేవలను గుర్తించి 1965లో రామన్ మెగసెసె అవార్డు (ఏసియా నోబుల్ ప్రైజ్) వరించింది. 1980లో ఆయన గౌరవార్థం భారత ప్రభుత్వం పోస్టల్ స్టాంపును రిలీజ్ చేసింది. 1999లో భారత ప్రభుత్వం దేశ ప్రముఖులకు మరణానంతరం అందజేసే అత్యున్నత అవార్డు 'భారతరత్న'ను ప్రకటించింది. జెపి 113వ జయంతిని పురస్కరించుకొని భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని 'ప్రజాస్వామ్య పరిరక్షణ దినం'గా ప్రకటించింది. ప్రజాస్వామ్య పరిరక్షణ సిద్ధాంతకర్తగా ఈ దేశంలో నిరంకుశ పాలనను నిర్మూలించడానికి ప్రయత్నించిన సాధకులుగా జె.పి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. 'లోక్‌నాయక్'గా చిరస్మరణీయులయ్యారు.

○ రేమద్దుల దివాకర్‌రావు
మాజీ కన్వీనర్, ఛాత్ర యువసంఘర్ష వాహిని

(నేడు జెపి జయంతి)

గంటకో రైతు ఎందుకు రాలిపోతున్నాడు?

మన దేశంలో 2023లో 1,71,418 మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వీరిలో వ్యవసాయ రంగానికి చెందిన రైతులు, రైతు కూలీలు కూడా ఉన్నారు. దేశానికి అన్నం పెట్టే చేతులే ఆకలితో, అప్పుల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం మన సమాజానికి ఒక మాయని మచ్చ. దేశవ్యాప్తంగా ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో 66.2శాతం మంది వార్షిక ఆదాయం ఒక లక్ష రూపాయల కంటే తక్కువే.



2023లో దేశవ్యాప్తంగా గంటకు ఒక రైతు తన ప్రాణం తీసుకున్నాడని జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తాజా గణాంకాలు చెబుతున్నాయి. వ్యవసాయ రంగంలో పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందులు, అప్పులు, పంటలు దెబ్బతినడం వంటి కారణాలు మరోసారి ఈ వాస్తవాన్ని మన కళ్లముందు నిలబెట్టాయి. ఆత్మహత్యలకు పాల్పడిన 1,71,418 మందిలో 10,786 మంది వ్యవసాయ రంగానికి చెందినవారు. మొత్తం ఆత్మహత్యల్లో ఇవి 6.3 శాతం. ఈ గణాంకాలను లోతుగా పరిశీలిస్తే ఆత్మహత్యలు చేసుకున్న వారిలో 43శాతం మంది రైతులు (4,690) కాగా, 56శాతం మంది వ్యవసాయ కూలీలు (6,096) ఉన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల్లో 4,553 మంది పురుషులు కాగా, 137 మంది మహిళలు ఉన్నారు. కూలీలలో మాత్రం 5,485 మంది పురుషులు ఉంటే, 611 మంది మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు. దేశంలోనే అత్యధికంగా మహారాష్ట్రలో 38.5శాతం మంది ఉండగా, కర్ణాటకలో 22.5శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 8.6శాతం, మధ్యప్రదేశ్‌లో 7.2శాతం, తమిళనాడులో 5.9శాతం ఉన్నారు.

"రైతు ఆత్మహత్యలు దేశమంతా వ్యాపించిన గ్రామీణ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రైతులు, పేదల కంటే ఎక్కువగా పెట్టుబడిదారుల పక్షానే నిలుస్తోంది. ఫలితంగా గ్రామీణ భారత దేశంలో తీవ్రమైన పేదరికం, కష్టాలు పెరిగాయి. గతంలో భారత ప్రభుత్వ విధానాలు– సానుభూతి, వివిధ వర్గాల మధ్య సమతౌల్యం ఆధారంగా ఉండేవి. గత దశాబ్ద కాలంగా కీలకమైన వ్యవసాయాన్ని కాపాడుకునే విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది. ప్రతి రైతు ఆత్మహత్య పాలనాపరమైన వైఫల్యం, విధానాల లోటుకు సాక్ష్యంగా నిలుస్తోంది" అంటారు జర్నలిస్టు డా. కోట నీలిమ. ఈమె గతంలో రైతుల ఆత్మహత్యలపై అధ్యయనం చేసి, 'విడోస్ ఆఫ్ విదర్భ' పుస్తకాన్ని రాశారు.

ఉత్పత్తి ఖర్చుపై లాభం వచ్చేలా కనీస మద్దతు ధరను అన్ని పంటలకు వర్తింపజేయాలి. మధ్యవర్తుల దోపిడీని తగ్గించేందుకు డైరెక్ట్ మార్కెటింగ్, ఈ–నామ్ వేదికలను బలోపేతం చేయాలి. గిడ్డంగులు ఏర్పాటు చేయడం ద్వారా పంటలు నిల్వ చేసుకునే అవకాశం కల్పించాలి. అనకాపల్లి సమీపంలో 'వికాసవనం' మన్యంలో పండిన అరటి, క్యారెట్, పనసను సోలార్ డ్రయర్ల ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తున్నారు. తద్వారా ఆ ప్రాంతంలో దిగుబడి పెరిగినా పంట వృథా కాకుండా మార్కెట్ చేస్తూ రైతులకు భరోసాగా మారారు.


వర్షాధార ప్రాంతాల్లో చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌లు, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ కార్యక్రమాలు వేగవంతం చేయాలి. 'భూసారం, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే ప్రకృతి వ్యవసాయం మల్టీ–క్రాపింగ్ వంటి పద్ధతులను ప్రోత్సహించాలి. దీనివల్ల రసాయన ఎరువులపై పెట్టుబడులు తగ్గించుకోవచ్చు' అంటారు పార్వతీపురం మన్యం జిల్లాలోని కొండబారిడి గ్రామస్థులు. ఈ ఊరిలో ఒక్క కెమికల్ ఎరువుల షాపు కూడా కనిపించదు! పూర్తిగా ప్రకృతి సేద్యంతో ఇక్కడ పంటలు పండిస్తారు.

చిన్న రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు, పంట ఇన్సూరెన్స్‌లో పారదర్శకత ఉండాలి. ప్రైవేట్ మనీ లెండర్లపై ఆధారపడకుండా కోఆపరేటివ్ సొసైటీలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా రుణాలు ఇవ్వాలి. అలాగే రైతులు పంట నష్టపోతే తక్షణ పరిహారం, ఆరోగ్య బీమా, వృద్ధాప్య పింఛన్, పిల్లల విద్యకు మద్దతు ఇవ్వాలి. గ్రామస్థాయిలో కౌన్సెలింగ్ కేంద్రాలు, రైతు భరోసా వేదికలు వంటివి ఏర్పాటు చేయాలి. దేశానికి అన్నం పెడుతున్న రైతు, అదే పొలంలో తన ప్రాణం వదిలిపెట్టడం సమాజాన్ని కలవరపెట్టే విషయం.

● శ్యాంమోహన్
రూరల్ మీడియా

విస్మృత బౌద్ధ మేధావి

అరుదైన తెలుగు భావోద్యమకారుడు కడలి సత్యనారాయణమూర్తి. తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో బౌద్ధ బహుజన సాంస్కృతిక వికాసానికి ఎనలేని కృషి చేసిన మహావ్యక్తి. ప్రగతిశీల వామపక్ష ఉద్యమం మొదలు హేతువాద, అంబేడ్కర్, ఫూలే ఆలోచనా స్రవంతుల్ని పరిపుష్టం చేసిన మేధావి. ఒకవైపు రచనా వ్యాసంగం, మరోవైపు అలుపెరుగని కార్యాచరణతో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి అసాధారణ క్రియాశీలిగా ఎదిగిన దార్శనికుడు. దశాబ్దాల క్రితమే బౌద్ధాన్ని లోతుగా అధ్యయనం చేసి పీడితుల విముక్తి మార్గంగా గుర్తించి ప్రచారం చేసిన ఆలోచనాపరుడు. దళిత బహుజన స్త్రీల బలమైన గొంతుకగా 'గోదావరి కెరటాలు' పత్రిక స్థాపించినవాడు. గోదావరి జిల్లాల్లో తొలి బుద్ధ విహార వ్యవస్థాపకుడు.



అక్టోబర్ 12, 1938న రాజోలులో సత్యనారాయణమూర్తి జన్మించాడు. అక్కడే పీయూసీ చదివి అనేక పనులు చేశాడు. కొంతకాలం హైదరాబాద్‌లోని ఒక రెసిడెన్షియల్ హాస్టల్లో వార్డెన్‌గా పనిచేశాడు. ముక్కుసూటితనం, అక్రమాలు సహించలేనితనం వల్ల ఎక్కడా ఎక్కువకాలం నిలదొక్కుకోలేదు. చివరికి కాకినాడ సబ్ ట్రెజరీ ఆఫీసులో ఉద్యోగం వచ్చింది. హేతువాద సంఘం బాధ్యునిగా అనేక సభలు సమావేశాలు నిర్వహించాడు. మొట్టమొదటిసారిగా డా. అబ్రహం కోవూర్, బి.ప్రేమానంద్ వంటి ప్రపంచ ప్రఖ్యాత హేతువాదులని తీసుకొచ్చి ఎన్నో విజ్ఞానదాయక కార్యక్రమాలు చేపట్టాడు. మూఢనమ్మకాలు, మహిమల బండారాలు బయటపెట్టాడు.

ఆ క్రమంలోనే వివిధ వామపక్ష సిద్ధాంతాల్ని అధ్యయనం చేశాడు. విశాఖపట్నం వెళ్ళి శ్రీశ్రీని కాకినాడ తీసుకొచ్చాడు. మార్క్సిస్టు సానుభూతిపరుడిగా మారాడు. ఆనాటి పీపుల్స్‌వార్ అగ్రనేతలు కొండపల్లి సీతారామయ్య, కె.ఎస్ సత్యమూర్తి, గద్దర్ వంటి వారితో సంబంధాలు పెంచుకున్నాడు. వాల్ రైటింగ్స్ రాసేవాడు, కరపత్రాలు పంపిణీ చేసేవాడు. భూపతి నారాయణమూర్తి పరిచయంతో దళిత బహుజన సాంస్కృతిక శాస్త్రాలను అధ్యయనం చేశాడు. డా. బి.ఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలేల తాత్వికత మూర్తి దృక్పథాన్ని మలుపు తిప్పింది. దొమ్మేటి సత్యనారాయణ బోధి ప్రభావంతో బౌద్ధం గురించి లోతైన పరిశోధన చేశాడు. అంతిమంగా బౌద్ధ బహుజన ప్రత్యామ్నాయ సిద్ధాంతవేత్తగా రూపొందాడు.

ఇదంతా ఒకెత్తయితే, 90వ దశకంలో బౌద్ధం స్వీకరించిన సత్యనారాయణమూర్తి, దళితులు (ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు), స్త్రీల సమస్యల దర్పణం అని ప్రకటించి 'గోదావరి కెరటాలు' పత్రిక స్థాపించడం ఒక్కటీ ఒకెత్తు. దళిత బహుజన భావజాల సాధనంగా అక్షరాలని తలకెత్తుకున్న సత్యనారాయణ సుమారు 12 ఏళ్ళ సర్వీసుని స్వచ్ఛందంగా వొదులుకుని పత్రిక పెట్టాడు. ప్రసిద్ధ అంబేడ్కరిస్ట్ వి.టి. రాజశేఖర్ బెంగళూరు నుంచి 'దళిత్ వాయిస్' పత్రిక స్థాపించిన సరిగ్గా పదేళ్లకు 1991లో తెలుగులో 'గోదావరి కెరటాలు' ఆరంభించాడు. దానిని ప్రత్యామ్నాయ పీడితుల స్వరంగా నిలిపాడు. బుద్ధుడు, బాబాసాహెబ్ అంబేడ్కర్, జ్యోతిబా పూలేల విశిష్ట భావజాల వాహకంగా పత్రికని మలిచాడు.

గోదావరి కెరటాలు పత్రిక నారాయణ గురు, పెరియార్ వంటి వారి ఆలోచనలకి సైతం అద్దం పట్టేది. వి.టి రాజశేఖర్ రచనల్ని తెలుగులోకి తెచ్చిన మొదటి పత్రిక కూడా ఇదే. అంతకంటే విశేషం దళిత్ వాయిస్ పత్రిక 1991 డిసెంబర్ సంచికలో 'గోదావరి కెరటాలు' అనే తెలుగు పత్రిక మానవ హక్కుల స్వరంగా వృద్ధి చెందుతోందని అభినందిస్తూ విజయరాజ్ రాసిన వ్యాసం ప్రచురించడం.

దళిత్ వాయిస్ వంటి ఒక జాతీయ స్థాయి పత్రిక తన సైద్ధాంతిక సరళికి దగ్గరగా ఉన్న ఒక చిన్న ప్రాంతీయ పత్రిక గురించి ప్రకటించడం చారిత్రక విశేషం. దాన్ని బట్టి గోదావరి కెరటాలు పత్రిక తెలుగు భావోద్యమ రంగంలో ఏ విధంగా కృషి చేసిందో అర్థమవుతుంది. ఊ. సాంబశివరావు, కంచ ఐలయ్య వంటి మేధావులతో ఏర్పడ్డ 'దళిత రచయితలు, మేధావులు, కళాకారుల ఐక్య వేదిక'లో కూడా సత్యనారాయణమూర్తి కీలకపాత్ర పోషించాడు. కె.జి సత్యమూర్తి ఆధ్వర్యంలో నడిచిన ఏకలవ్య పత్రిక సంపాదకవర్గంలో ఉన్నాడు. ఈ క్రమంలోనే గోదావరి జిల్లాల్లో తొలి బుద్ధ విహారాన్ని కాకినాడ ట్రెజరీ కాలనీలో స్థాపించాడు. వివిధ రాష్ట్రాల నుంచి ఎందరో బౌద్ధ భిక్షువులను ఆహ్వానించి, అనేక బృహత్తర కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించాడు.

హేతువాద కార్యకర్తగా, కమ్యూనిస్టు మేధావిగా, పూలే–అంబేడ్కర్ అభిమానిగా, దళిత బహుజన ఉద్యమకారుడిగా, ప్రత్యామ్నాయ రచయితగా, పత్రికా సంపాదకునిగా, జీవితాంతం పీడితుల ఉన్నతి కోసమే వెచ్చించిన కడలి సత్యనారాయణమూర్తి అరవై ఏళ్ల వయసులో జనవరి 23, 1998న మరణించాడు. వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా, దశాబ్దాల పాటు పత్రికను నిరవధికంగా కొనసాగించాడు. ఆయన నిరాడంబరతను గురించి ఇప్పటికీ మిత్రులు కథలుగా చెప్పుకుంటారు. విస్మరించబడ్డ బహుజన మేధావి, తొలి బౌద్ధ ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన కడలి సత్యనారాయణమూర్తి స్ఫూర్తిని పునర్నిర్మించుకోవడమే నేటి దళిత బహుజన ప్రజాతంత్ర శ్రేణుల ముందున్న కర్తవ్యం.

■ గౌరవ్
సామాజిక కార్యకర్త

(అక్టోబర్ 12: కడలి సత్యనారాయణమూర్తి జయంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com


● మానసిక ఆరోగ్యం కోసం..

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో 'అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సంరక్షణ' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 8

నకిలీ మకిలీ

కల్తీ మద్యం తయారీలో ఆ ముగ్గురే ప్రధానం

క్లాసులో ఒకే బెంచ్.. ఒకే వైఖరి ఆ ముగ్గురినీ స్నేహితులుగా మార్చింది. కళాశాల చదువు పూర్తయినా.. కలిసి వ్యాపారులుగా ఎదిగారు. మద్యం వ్యాపారంలోనూ కలిసే అడుగులు వేశారు. ఇంకా ఏదో సాధించేయాలన్న తపన వారిని నకిలీ మద్యం తయారుచేసే స్థాయికి తీసుకెళ్లింది. సిండికేట్లుగా ఏర్పడి అటు అన్నమయ్య జిల్లాలో, ఇటు ఎన్టీఆర్ జిల్లాలో హవా సాగించారు. చివరికి నకిలీ గుట్టురట్టు కావడంతో ఒక స్నేహితుడు శ్రీనివాసరావు రిమాండ్‌లో, ఇంకో స్నేహితుడు జయచంద్రారెడ్డి పరారీలో ఉండగా, ప్రధాన సూత్రధారి జనార్దనరావు శుక్రవారం పోలీసులకు చిక్కాడు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అద్దేపల్లి జనార్దనరావు.. ఇప్పుడు ఈ పేరుకు పెద్దగా పరిచయం అవసరం లేదు. ఆ పేరు చెప్పగానే ఠక్కున నకిలీ మద్యం తయారీ గుర్తొస్తుంది. వైద్యం నిమిత్తం విదేశాల్లో ఉన్నానని చెప్పుకొచ్చిన జనార్దనరావు శుక్రవారం ఎక్సైజ్ పోలీసులకు చిక్కాడు. గన్నవరం విమానాశ్రయంలో దిగిన అతడిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.


గన్నవరం విమానాశ్రయంలో జనార్దనరావును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఇంజనీరింగ్ చదువులో కలిసిన స్నేహబంధం

- ఆ తర్వాత వ్యాపారులుగా.. ఇప్పుడు నిందితులుగా..
- నకిలీ మద్యం తయారుచేసి రూ.కోట్లు గడించాలని ఆశ
- ఒకరు పరారీ.. మరొకరు రిమాండ్‌లో..
- ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన జనార్దనరావు
- రహస్య ప్రదేశంలో విచారణ చేస్తున్న పోలీసులు

నకిలీ ఐడియా జనార్దనరావుదే..

అద్దేపల్లి జనార్దనరావు రెండు కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ములకలచెరువులో వెలుగులోకి వచ్చిన నకిలీ మద్యం తయారీ ప్లాంట్‌కు సంబంధించిన కేసులో ప్రధాన నిందితుడు. ఇటీవల టీడీపీ నుంచి సస్పెండ్ అయిన జయచంద్రారెడ్డి పరారీలో ఉన్నాడు. ఈ ఇద్దరితో పాటు మరో వ్యక్తి కొడాలి శ్రీనివాసరావు రిమాండ్‌లో ఉన్నాడు. నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన ముందుగా జనార్దనరావుకే వచ్చిందని తెలుస్తోంది. ములకలచెరువులో బీజం వేశాక క్రమంగా ఇబ్రహీంపట్నానికి విస్తరించినట్టు సమాచారం. ఓ రహస్య ప్రదేశంలో ఎక్సైజ్ అధికారులు జనార్దనరావును విచారణ చేస్తున్నారు. అతనేం చెబుతాడోనని సర్వత్రా ఉత్కంఠ రేగుతోంది.

నెల్లూరులో కలిసిన స్నేహబంధం

జనార్దనరావు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందినవాడు. జయచంద్రారెడ్డి, కొడాలి శ్రీనివాసరావుది అన్నమయ్య జిల్లా. ఈ ముగ్గురూ నెల్లూరు జిల్లాలో ఇంజనీరింగ్ చదివారు. ఒకే కళాశాల, ఒకే బెంచ్ కావడంతో స్నేహితులయ్యారు. ఇంజనీరింగ్‌లో ఉన్నప్పుడు ఏర్పడిన బంధం పెరుగుతూనే వచ్చింది. కలిసి వ్యాపారాలు, మద్యం వ్యాపారాలు చేయడం మొదలుపెట్టారు. రాజకీయంగా మాత్రం వేర్వేరు మార్గాలను ఎంచుకున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా చేస్తున్న అక్రమ వ్యాపారాలు సజావుగా సాగించడమే దీనికి ప్రధాన కారణం. జయచంద్రారెడ్డి.. వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుచరుడిగా ఎదిగాడు. జనార్దనరావు ఇబ్రహీంపట్నంలో టీడీపీ నాయకుడిగా చెలామణీ అవుతున్నాడు. అతడి సంబంధాలు మాత్రం వైసీపీ నేతలతో కొనసాగేవి.

సిండికేట్లుగా ఏర్పడి..

ములకలచెరువులో నాలుగు నెలల నుంచి, ఇబ్రహీంపట్నంలో మూడు నెలల నుంచి నకిలీ మద్యం తయారు చేస్తున్నట్టు ఎక్సైజ్ అధికారులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. దీనికి ముందు నుంచీ నకిలీ మద్యం తయారీ సాగుతున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. జనార్దనరావు పదేళ్లుగా మద్యం వ్యాపారంలో ఉన్నాడు. ఇబ్రహీంపట్నంలోనే ఏఎన్నార్ బార్‌ను నిర్వహిస్తున్నాడు. బార్‌తో పాటు మరికొన్ని మద్యం దుకాణాలను తమ చేతుల్లో ఉంచుకోవడానికి ఈ ముగ్గురూ కలిసి సిండికేట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో సిండికేట్ బాధ్యతలను జనార్దనరావు, అన్నమయ్య జిల్లాలో సిండికేట్ బాధ్యతలను జయచంద్రారెడ్డి, కొడాలి శ్రీనివాసరావు తీసుకున్నారు. ఒక్కో సిండికేట్‌లో 10-20 మందిని ఏర్పాటు చేసుకున్నాడు. బార్‌లు, మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు, ఆహ్వానించినప్పుడు సిండికేట్‌లో ఉన్న సభ్యులంతా తలోదిక్కున దరఖాస్తు చేసుకునేవారు. బార్ కానీ, మద్యం దుకాణం కానీ ఎవరికి దక్కినా అందరికీ వాటాలు ఉండేలా సిండికేట్ మధ్య ఒప్పందం చేసుకున్నారు. ఇలా సిండికేట్‌లో ఉన్న షాపులకు, బార్‌లకు నకిలీ మద్యం వెళ్లినట్టు తెలుస్తోంది. ఇందులో ఇప్పటి వరకు విద్యాధరపురంలో ఉన్న శ్రీనివాస వైన్స్ పేరు మాత్రమే వెలుగులోకి వచ్చింది.

బూడిద రగడ

మరోసారి కృష్ణానదిలోకి బూడిద నీరు మళ్లింపు

- వివాదాస్పదంగా ఎన్టీటీపీఎస్ అధికారుల తీరు
- 104 గ్రామాలకు నిలిచిపోయిన తాగునీరు
- రాజకీయ నాయకుల ఫిర్యాదుతో సబ్ కలెక్టర్ పరిశీలన
- త్వరలోనే పరిష్కరిస్తానని హామీ


కూలింగ్ కెనాల్‌లో కలుస్తున్న బూడిద నీరు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీటీపీఎస్ అధికారులు తీరు మార్చుకోవట్లేదు. 'బూడిద నీటితో కృష్ణానది కలుషితమవుతోంది బాబోయ్.. నీటిని వదలొద్దు..' అని స్థానికులు, రాజకీయ నాయకులు నెత్తినోరు బాదుకుంటున్నా వినే పరిస్థితిలో లేరు. ప్రజారోగ్యాన్ని పట్టించుకోవట్లేదు. ప్రజాప్రతినిధుల మాటంటే లెక్కేలేదు. విద్యుత్ ఉత్పత్తి అనంతరం వచ్చే బూడిదను కృష్ణానదిలోకి వదలడం ఏమాత్రం ఆపట్లేదు. ఈనెల 5వ తేదీ నుంచి వారి వ్యవహారం ఇలాగే ఉంది. శుక్రవారం మరోసారి పెద్ద ఎత్తున వేడి, చన్నీళ్ల కాల్వల్లోకి బూడిద నీటిని వదిలారు. దీంతో ఇబ్రహీంపట్నంలో ఉన్న కృష్ణాజలాల సరఫరా ఫిల్టర్ బెడ్స్‌లోకి పెద్ద ఎత్తున బూడిద చేరుకోవడంతో నీటిశుద్ధి ఆగిపోయింది. మైలవరం నియోజకవర్గంలో 104 గ్రామాలకు తాగు నీరు మరోసారి నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న కూటమి నాయకులు, ప్రతిపక్ష నేతలు ఎన్టీటీపీఎస్ అధికారుల తీరుపై ఆగ్రహం మిగతా 6లో..

టన్నులకొద్దీ బూడిద

ప్లాంట్‌లో నుంచి డ్రెయినేజీ ద్వారా వస్తున్న బూడిదను టన్నులకొద్దీ ప్లాంట్ సమీపంలోని సెక్యూరిటీ కాలనీలో నిల్వ చేశారు. యంత్రాల సాయంతో ఆ బూడిదను ప్లాంట్‌లోకి తరలించారు. వారం నుంచి పెద్ద ఎత్తున బయటకు రవాణా చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అలాగే, ఈ ప్రాంతంలో గుట్టలుగా బూడిద నిల్వచేసి ఉంచారు. బూడిద కోసమే వ్యాపారులతో కుమ్మక్కవుతున్న ఎన్టీటీపీఎస్ అధికారులు బూడిద చెరువుకు వెళ్లే పైపులైన్‌కు లీకులు పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



14న ముహూర్తం

విజయవాడ మెట్రో టెండర్లు తెరిచేందుకు రంగంసిద్ధం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టు టెండర్లను ఈ నెల 14న తెరిచేందుకు ఏపీఎంఆర్సీ అధికారులు రంగం సిద్ధం చేశారు. భాగస్వామ్య సంస్థలకు కూడా అవకాశం కల్పించిన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లో ఆరోజు టెండర్లను పిలిచేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కాంట్రాక్టు సంస్థల నుంచి మంచి స్పందనే వచ్చింది. ప్రీ బిడ్డింగ్ మీటింగ్‌లో దాదాపు 10 సంస్థలకు పైగా పాలుపంచుకున్నాయి. ఒకేసారి భారీగా రూ.4,500 కోట్ల వ్యయంతో టెండర్లు పిలవటంతో నిర్మాణ పనులకు సంబంధించి బడా కాంట్రాక్టు సంస్థలే ముందుకొచ్చాయి. ఇప్పటి వరకు దేశంలోని మెట్రో ప్రాజెక్టుల నిర్మాణం తలపెట్టిన సందర్భాల్లో ముక్కలు ముక్కలుగా మాత్రమే పనులకు టెండర్లు పిలిచారు. విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు మాత్రం ఏలూరు, బందరు రోడ్డు కారిడార్లు రెండింటికీ కలిపి సింగిల్ టెండర్‌ను పిలిచారు. ఈనెల 14 సాయంత్రం వరకు కాంట్రాక్టు సంస్థలు బిడ్లను సమర్పించే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు ఏ సంస్థ బిడ్లను సమర్పించలేదు. ప్రీ బిడ్డింగ్ మీటింగ్ స్పందనను బట్టి.. జాయింట్ వెంచర్ (జేవీ) విధానంలో రెండు, మూడు సంస్థలు పోటీపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. టెక్నికల్ బిడ్లను ముందుగా తెరుస్తారు. అర్హత సాధించిన దానిని బట్టి ఫైనాన్షియల్ బిడ్లను కూడా తెరుస్తారు. ఎంపిక చేసిన సంస్థ టోపో సర్వే, జియోగ్రాఫికల్ సర్వే, సాయిల్ టెస్ట్ నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకోసం నాలుగైదు నెలలు పట్టే అవకాశం ఉంది. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా అధికారికంగా అనుమతులు వస్తే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించటానికి అవకాశం కలుగుతుంది. ఇప్పటికే ఏపీఎంఆర్సీ అధికారులు ఏలూరు రోడ్డు కారిడార్‌కు సంబంధించి నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్‌రోడ్డు వరకు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను ప్రతిపాదిస్తూ డీపీఆర్ తయారు చేయించి కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖకు అందజేశారు. దీనికి కూడా అనుమతులు వస్తే విజయవాడ మెట్రో పనులకు ఎలాంటి అడ్డంకులు లేనట్టే.

మారని తీరు

ఇంకా అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్న వైసీపీ

మచిలీపట్నంలో మాజీ మంత్రి పేర్ని నాని దుందుడుకు వైఖరి

అధికారం కోల్పోయినా వైసీపీ నాయకుల దుందుడుకు వైఖరి మాత్రం మారలేదు. ఇప్పటికీ తాము అధికారంలోనే ఉన్నట్టుగానే భావిస్తున్న వారు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. మీడియా సమావేశాల్లో అధికారపక్షంపై తనదైనశైలిలో విమర్శలు గుప్పించే మాజీమంత్రి పేర్ని నాని శుక్రవారం మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌కు మందీమార్బలంతో వెళ్లి సీఐతో వాగ్వాదానికి దిగారు. తానేంటో చూపిస్తానని బెదిరింపు ధోరణితో మాట్లాడటం పోలీస్, రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 6

- మచిలీపట్నం పీఎస్‌లో సీఐ ఏసుబాబుతో వాగ్వాదం
- ఓ కేసులో పోలీసుల వద్ద వైసీపీ బందరు అధ్యక్షుడి డ్రామా
- పోలీసులకు సహకరించొద్దని సోషల్ మీడియాలో సందేశాలు
- ఆ నాయకుడిని కాపాడేందుకు పేర్ని నాని విశ్వప్రయత్నం
- కార్యకర్తలు, నాయకులతో వెళ్లి సీఐతో మాటలయుద్ధం


సీఐతో వాదులాడుతున్న మాజీ మంత్రి పేర్నినాని

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించొద్దని వైసీపీ నాయకులు సెప్టెంబరు 19న మచిలీపట్నంలో ఆందోళన చేశారు. అనుమతులు లేకున్నా ఆందోళన చేయడంతో అదేరోజు పోలీసులు 400 మంది వైసీపీ కార్యకర్తలపై 61 (2), 132, 126 (2), 189(2) ఆర్‌డబ్ల్యూ, 190 బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో పేర్లున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలకు పోలీసులు 41 నోటీసులు జారీ చేసేందుకు ఒక్కొక్కరినీ పోలీస్‌స్టేషన్‌కు పిలుస్తున్నారు.

తప్పించుకు తిరుగుతున్న వైసీపీ బందరు అధ్యక్షుడు


మచిలీపట్నం నగర వైసీపీ అధ్యక్షుడిగా ఉన్న మేకల సుధాకర్‌బాబు (సుబ్బన్న)కు పోలీసులు నోటీసు ఇచ్చారు. విచారణకు హాజరుకాకుండా సుబ్బన్న పోలీస్ అధికారులు లేని సమయం చూసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, తరువాత వస్తానని చెప్పి తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతోపాటు ఈ కేసులో పేర్లున్న వారు పోలీసులకు సహకరించవద్దని, వైసీపీకి చెందిన వాట్సాప్ గ్రూపులో మెసేజ్‌లు పెడుతున్నాడు. ఈ సమాచారంతో పోలీసులు శుక్రవారం సుబ్బన్నను మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని పోలీసులు ప్రకటించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీమంత్రి పేర్ని నాని తన అనుచరులతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మచిలీపట్నం ఇన్‌చార్జి సీఐ ఏసుబాబుతో వాగ్వాదానికి మిగతా 6లో..

చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం : ఎస్పీ విద్యాసాగర్

విధినిర్వహణలో ఉన్న పోలీసులను బెదిరిస్తే ఉపేక్షించేది లేదని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. మచిలీపట్నంలోని ఎస్పీ కార్యాలయం సమావేశ హాల్లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మచిలీపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మెడికల్ కళాశాల వద్ద ఆందోళనకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో నిందితులకు 41సీ నోటీసులు ఇచ్చామన్నారు. విచారణకు మేకల సుబ్బన్న హాజరు కాకపోవటం, సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులో మిగతా వారిని కూడా విచారణకు సహకరించవద్దని సంక్షిప్త సమాచారం చేరవేయడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారన్నారు. చట్టాన్ని ఉల్లంఘించడాన్ని తీవ్రంగా పరిగణించిన మచిలీపట్నం పోలీసులు సుబ్బన్నను రిమాండ్‌కు తరలించడానికి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించామన్నారు. ఈ నేపథ్యంలో సుబ్బన్నకు మద్దతుగా మాజీమంత్రి పేర్ని నాని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి స్టేషన్ సీఐ ఏసుబాబుపై దురుసుగా ప్రవర్తించడం, బెదిరించడానికి ప్రయత్నించడాన్ని ఎస్పీ ఖండించారు. విధినిర్వహణలో ఉన్న పోలీసులను అగౌరవపరిచినా, బెదిరింపులకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మెగా ఫుడ్‌పార్కులో సీపీసీకి జీవం

మల్లవల్లి మెగా ఫుడ్‌పార్కులోని సీపీసీ



లులు అనుబంధ ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్‌కు కేటాయింపులు

- 66 ఏళ్లకు లీజు.. కేబినెట్‌లో కీలక నిర్ణయం
- ఏడాదికి రూ.50 లక్షలు.. ఐదేళ్లకు 5 శాతం పెంపు
- వైసీపీ హయాంలో మూలనపడిన సీపీసీ
- ఆహారశుద్ధి పరిశ్రమల అవసరాలను తీర్చే సెంటర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మల్లవల్లి మెగా ఫుడ్‌పార్కులోని కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ)ను లులు గ్రూపునకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లులు గ్రూపులో అంతర్భాగమైన 'ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్'కు రాష్ట్ర ప్రభుత్వం 66 సంవత్సరాలకు లీజుకిచ్చింది. ఏడాదికి రూ.50 లక్షల అద్దె ప్రాతిపదికన కేటాయింపులు జరిగాయి. ప్రతి ఐదేళ్లకు ఐదుశాతం పెంచేలా నిర్ణయం తీసుకున్నారు.

ఇన్నాళ్లకు పునరుద్ధరణ

మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు అనుబంధంగా గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 100 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఫుడ్‌పార్కును ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఆహారశుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించటానికి వీలుగా నాటి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మెగా మిగతా 6లో..

దుర్గగుడిలో చీరల వేలం పాట

- ఏడాదికి రూ.8,15,00,000 + 5శాతం జీఎస్టీ
- కాంట్రాక్టు దక్కించుకున్న గుంటూరు మహిళ

6

ఆయేషా తల్లిదండ్రులకు దర్యాప్తు నివేదిక అందజేయండి!

అధికారులకు సీబీఐ కోర్టు ఆదేశం ● తదుపరి విచారణ 31కి వాయిదా

8



కాస్త తగ్గారు..!

గంగూరు-గుణదల విద్యుత్ లైన్ల ఏర్పాటులో అధికారుల సవరణ

గంగూరు-గుణదల ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటుపై విద్యుత్ శాఖ అధికారులు దిగొచ్చారు. విద్యుత్ లైన్ల ఏర్పాటుకు అయ్యే నిర్వహణ ఖర్చును నాలుగు రెట్లు ఎక్కువగా నిర్దేశించడం, ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు. ఖర్చును సవరించి కొత్త ఎస్ఎస్ఆర్‌ను రూపొందించారు.

- పాత ఎస్ఎస్ఆర్ రద్దుచేసి కొత్త విధానానికి శ్రీకారం
- పాత విధానంలో కిలోమీటరుకు రూ.2.52 లక్షల ఖర్చు
- కొత్త విధానంతో కిలోమీటరుకు రూ.64 వేలే ఖర్చు
- ఆంధ్రజ్యోతి కథనంతో విద్యుత్ అధికారుల దిద్దుబాటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణాజిల్లాలోని గంగూరు నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని గుణదల వరకు 132 కేవీ హైటెన్షన్ కండక్టర్స్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారులు టెండర్లు పిలిచారు. అంతకుముందు ఏర్పాటుచేసిన పాత హైటెన్షన్ కండక్టర్ లైన్స్ (హెచ్‌టీఎల్ఎస్) మార్చి అధునాతన హెచ్‌టీఎల్ఎస్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 60 కిలోమీటర్ల దూరంలో 20 కిలోమీటర్ల వరకు కొత్తలైన్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. లైన్ లాగేందుకు అయ్యే ఖర్చును కిలోమీటరుకు రూ.2.50 లక్షలుగా నిర్దేశించారు. దీనిపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో 'ట్రాన్స్‌కో.. మిగతా 6లో..

ఎంత దుబారో చేశారో?

ఈ లెక్కన చూస్తే.. ఏటా విద్యుత్ శాఖ చేపట్టిన పనుల్లో భారీగానే నిధులు దుర్వినియోగమయ్యాయన్న అనుమానాలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏటా 400 కిలోమీటర్ల మేర ఈ పనులు జరుగుతుంటాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 50 కిలోమీటర్ల పరిధిలో అయినా పనులు జరుగుతాయి. ఈ లెక్కన చూస్తే రూ.2 కోట్ల మేర ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉంది.

మిగిలిన కాంపోనెంట్స్‌తో మరింతగా..

కిలోమీటరుకు హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు విషయంలో బేసిక్ రేటు కాకుండా అలవెన్సులు, పన్నులు కూడా తగ్గిస్తే కిలోమీటరుకు రూ.4 లక్షల చొప్పున ఆదా అవుతుంది. ఈ లెక్కన గంగూరు-గుణదల ప్రాజెక్టుకే రూ.80 లక్షల మేర కలిసొస్తుంది.



మహామండపంలో చీరల వేలంపాట నిర్వహిస్తున్న ఈవో శీనానాయక్, పాల్గొన్న కాంట్రాక్టర్లు

దుర్గగుడిలో చీరల వేలం పాట

- ఏడాదికి రూ.8,15,00,000 + 5శాతం జీఎస్టీ
- కాంట్రాక్టు దక్కించుకున్న గుంటూరు మహిళ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించే పట్టుచీరలు, సాధారణ చీరలు, కాటన్ చీరలు, జాకెట్టు ముక్కలు, ఎర్ర రంగు చీరలు, రవిక ముక్కలు, వివిధ రకాల వస్త్రాలను విక్రయించకొను లైసెన్స్ హక్కుకు శుక్రవారం మహామండపం 6వ అతస్తులో సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించారు. ప్రథమ ధరావత్తు రూ.50,00,000లు చొప్పున డీడీ చెల్లించి బహిరంగ వేలంపాటలో ముగ్గురు పాల్గొన్నారు. గుంటూరుకు చెందిన మెస్సర్స్ శ్రీపావని కలెక్షన్స్ యజమాని నల్లూరి పావని మొదటి సంవత్సరానికి రూ.8,15,00,000లతో పాటు అదనంగా 5శాతం జీఎస్టీ చెల్లించేందుకు, రెండో సంవత్సరానికి మొదటి సంవత్సరపు లైసెన్స్ సొమ్ముపై 10శాతం అదనంగా చెల్లించేలా హెచ్చు పాట పాడుకున్నారు. ఇ-టెండర్ సీల్డ్ టెండర్‌లో ఎవరూ పాల్గొనలేదు. ఈనెల 1న టెండర్ కం వేలంపాటకు ప్రకటన ఇచ్చారు. గత ఏడాది రూ.6,04,24,445లు కంటే ప్రస్తుతం సుమారు 35శాతం అధికంగా శుక్రవారం బహిరంగ వేలంపాటలో వచ్చిన హెచ్చు రేటు రూ.8,15,00,000లకు ఖరారు చేస్తూ దేవదాయ కమిషనర్‌కు నివేదిక పంపినట్టు ఈవో శీనానాయక్ తెలిపారు.

క్రీడారంగంలో యువతకు ప్రోత్సాహం

- నియోజకవర్గంలో పది క్రికెట్ నెట్‌లు
- రాష్ట్రంలో తొలిసారిగా గన్నవరంలో ఏర్పాటు
- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



క్రికెట్ నెట్‌ను ప్రారంభించి ఆడుతున్న యార్లగడ్డ

గన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడారంగంలో యువతను ప్రోత్సహించడంలో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో 10 క్రికెట్ నెట్‌లు ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారి గన్నవరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.13.5 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ బాక్సును శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే ప్రారంభించారు. కొద్దిసేపు క్రికెట్ ఆడిన యువతను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో క్రికెట్ నెట్‌ల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ స్థలాలను కాపాడటంతో పాటు గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరుతుందన్నారు. నియోజకవర్గంలో యువతను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు రాబోయే మూడు నెలల్లో 10 గ్రామాల్లో క్రికెట్ నెట్‌లు ఏర్పాటు చేస్తామని, కొన్నిచోట్ల వాలీబాల్, షటిల్, కబడ్డీ కోర్టుల ఏర్పాటుకు యోచిస్తున్నట్టు చెప్పారు. నామమాత్రపు ఫీజుతో క్రికెట్ బాక్సుల్లో ఆడుకునేందుకు వీలుంటుందని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మైనార్టీ యువతకు ఖతర్‌లో ఉద్యోగావకాశాలు

- కార్పొరేషన్ జిల్లా ఈడీ ఎస్‌కే ఫర్జానా బేగం

కృష్ణలంక : రాష్ట్రంలోని ముస్లిం, క్రైస్తవ, ఇతర మైనార్టీ వర్గాల యువతకు నర్సింగ్, హెల్త్‌కేర్, టెక్నికల్, సేవా రంగాల్లో మంచి అవకాశాలు వున్నాయని, ప్రభుత్వ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా అవసరమైన శిక్షణ అందించి, ఖతార్‌లో ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్టు మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ జిల్లా ఈడీ ఫర్జానా బేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్స్ ఉద్యోగానికి మైనార్టీ (పురుషులు, మహిళలు) అభ్యర్థులు రిజిష్టర్ చేసుకోవచ్చని, బీఎస్సీ/జీఎన్ఎం పూర్తిచేసి 21-40 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.1,20,000 వేతనం వుంటుందని, ఉచిత నివాసం, రవాణా, వైద్యం, వీసా, విమాన చార్జీలు వుంటాయన్నారు. ఈనెల 13న నమోదు, ఇంటర్వ్యూలు వుంటాయని, అభ్యర్థులు వివరాలను జిల్లా కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు 9849901148, 9985306408, 0866-2491148 నెంబర్లలో సంప్రదించాలని ఈడీ ఫర్జానా బేగం తెలిపారు.

పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి

- నలుగురి అరెస్టు

రైల్వేస్టేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పూరీ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి తరలిస్తున్న నలుగురిని ఈగల్ టీమ్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది శుక్రవారం సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 19 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైలులో అనుమానాస్పదంగా ఉన్న కర్నూలు మిలటరీ కాలనీకి చెందిన షేక్ వాజిత్ (20), కర్నూలు అరోరా నగర్‌కు చెందిన చెన్నమల్లై శివ వెంకి (25), ఒడిస్సా, ఛత్రపూర్ అహల్యాబాద్‌కు చెందిన రితేష్ నాయక్ (19), ఒడిస్సా, ఛత్రపూర్ కోరపాడు గ్రామానికి చెందిన రంజిత్ కుమార్ సింగ్ (34) బ్యాగ్‌లలో తనిఖీలు నిర్వహించారు. నిందితుల వద్ద మొత్తం 19 కేజీల గంజాయి లభించింది. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

స్పా, ఐఐటీ తిరుపతి మధ్య సహకార చర్చలు

విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్పా విజయవాడ, ఐఐటీ తిరుపతి మధ్య సహకారం కోసం చర్చలు జరుగుతున్నాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) డైరెక్టర్ డాక్టర్ కె.ఎన్. సత్యనారాయణ తెలిపారు. నగరంలోని ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ స్కూల్ తొమ్మిదవ స్నాతకోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో 276 మంది యూజీ, పీజీ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ స్నాతకోత్సవంలో 2024-25 సంవత్సరానికి గాను 10 మంది గ్రాడ్యుయేట్లు గోల్డ్ మెడల్స్, ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విభాగంలో యూజీ, పీజీ విభాగాల్లో 12 మంది విద్యార్థులు ఉత్తమ థీసిస్ అవార్డులు అందుకున్నారు. స్పా విజయవాడ గవర్నర్ల బోర్డు ఛైర్‌పర్సన్ డాక్టర్ అమోఘ్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ, సంస్థ విద్యార్థుల్లో మేధో వికాసం, సృజనాత్మకత, లోతైన బాధ్యతను ఎలా పెంపొందిస్తుందో తెలిపారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి దేశంలోని 500 మంది ప్రముఖ ఆర్కిటెక్ట్‌లు, ప్లానర్లు హాజరయ్యారు.

హెచ్‌ఐవీ బాధితులకు ఉచితంగా మందులు

విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీతో బాధపడేవారికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా ఏఆర్‌టీ మందులు అందుబాటులో ఉంచామని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణసంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.నీలకంఠ రెడ్డి అన్నారు. యువతలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన పెంచే విధంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ శుక్రవారం 5కె మరథాన్‌ను నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మారథాన్‌లో మహిళలు, పురుషులు, ట్రాన్స్‌జెండర్ విభాగాల్లో పోటీ నిర్వహించి విజేతలకు నగదు బహుమతి ప్రకటించారు. మొదటి బహుమతిగా రూ.35 వేలు, రెండవ బహుమతిగా రూ.25 వేలు, మూడవ బహుమతిగా రూ.10 వేలతో పాటు విజేతలకు నెలరోజులకు అవసరమైన పౌష్టికాహారం, ఫిజికల్ ఎక్సర్‌సైజ్‌కు సరిపడా శిక్షణ కూడా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు.

బుడమేరు - పులివాగు కలిసే ప్రాంతంలో ఉధృతంగా వరద

బుడమేరు మింగేస్తోంది!



- పొలానికి వెళ్లాలంటే హడలిపోతున్న రైతులు
- నీటి ప్రవాహానికి ఎనిమిదిమంది బలి
- బుడమేరు దాటే క్రమంలో అనేక ప్రమాదాలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం
- వంతెన కోసం దశాబ్దాలుగా ఎదురు చూపులు

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

పొలానికి పోయినోళ్ల ప్రాణాలతో ఇంటికి తిరిగొచ్చే వరకు ఇంటిల్లిపాది కళ్లల్లో ఒత్తులు పెటుకుని చూడాల్సిందే! సాయంత్రానికి వస్తే వచ్చినట్లు లేకుంటే బుడమేరు మింగినట్లే! ఇలా ఒకరుకాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఎనిమిది మందిని బుడమేరు ప్రవాహం తనలో కలిపేసుకుంది. 2010లో మొదలైన బుడమేటిలో గల్లంతు మరణాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఏ క్షణం ఎవరింట విషాద వార్త వినాల్సి వస్తుందోనని గ్రామస్థులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బతికేస్తున్నారు. విజయవాడకు కూతవేటు దూరంలో ఉన్న వెలగలేరు మాజీమంత్రి స్వర్గీయ చనమోలు వెంకట్రావ్ స్వగ్రామం. గ్రామ రైతులు, రైతు కూలీలు గ్రామంలో తమ పొలాలకు వెళ్లాలంటే బుడమేరు దాటాల్సిందే. ఈ క్రమంలో ఇప్పటికే ఎనిమిది మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇది చాలదన్నట్టు పోలవరం రాకతో గ్రామానికి మరింత కష్టమొచ్చింది. గ్రామస్థులకు పొంచి ఉన్న నీటి గండం గురించి సమగ్ర కథనం...

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలోని వెలగలేరు గ్రామానికి చెందిన రైతులకు పినపాక శివారు నర్సాయిగూడెం ఏరియాలో సుమారు వెయ్యి ఎకరాలు పంట భూములున్నాయి. వీరు పొలాలకు వెళ్లి వ్యవసాయం చేసుకోవాలంటే బుడమేరు దాటాల్సి ఉంటుంది. బుడమేరు దాటే క్రమంలో వరద ప్రవాహానికి ఇప్పటివరకు ముగ్గురు వ్యవసాయ కూలీలు, ముగ్గురు రైతులు, ఇద్దరు యువకులు ప్రాణాలను పోగొట్టుకున్నారు. గ్రామస్థులు బుడమేరును దాటే ప్రదేశంలోనే జి.కొండూరు వైపు నుంచి ఉధృతంగా పులివాగు వచ్చి కలుస్తుంది. వాగు దాటేవారు వరద ప్రవాహంలో గల్లంతవుతున్నారు. ప్రతి ఖరీఫ్ సీజన్‌లో రైతులు, రైతు కూలీలు బుడమేరులో దిగి అవతలి ఒడ్డున ఉన్న పొలాలకు వెళుతుంటారు. పనులు ముగించుకొని తిరిగి ఇవతల ఒడ్డుకు చేరుకొని ఇళ్లకు వెళుతుంటారు. ఈక్రమంలో ఎగువన వర్షాలు పడటం బుడమేరు, పులివాగు ఉప్పొంగడంతో వరద ఉధృతి పెరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

మృత్యు కుహరం

2010 ఖరీఫ్ సీజన్‌లో రైతు గద్దె శంకర్రావు(రైతు) బుడమేరు దాటుతూ మృత్యువాత పడ్డాడు. అదే ఏడాది నెల తిరక్క ముందే పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తూ వ్యవసాయ కూలీలు కొవ్వల వెంకాయమ్మ,వల్లూరు బుజ్జి, తొమ్మండ్రు రూతులు బుడమేరు దాటుతు వరలో చిక్కుకొని మృత్యువాత పడ్డారు. 2018లో మంచినీళ్ల కృష్ణ మూర్తి, 2020లో నవదీప్ (17), 2022లో ఈశ్వరరావు, కొసరాజు ఫణికుమార్‌లు మృతి చెందారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి

బుడమేటిలో ప్రాణాలు కలిసిపోతున్నా.. అధికారులు ఇక్కడ వంతెన అవసరాన్ని గుర్తించకపోవడం గమనార్హం. రైతు కూలీల ప్రాణాలు పోతున్నా పాలకులకు పట్టడం లేదు.

ఇటీవల పలువురు రైతులు వంతెన నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని ఇరిగేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతులు, రైతు కూలీలు కష్టాల నుంచి గట్టెక్కాలంటే వంతెన నిర్మించాల్సిందే.

ఇతర గ్రామాల మీదుగా పొలాలకు వెళుతున్నాం..

- దూబా నాగేశ్వరరావు (రైతు)



పొలాల్లోకి వెళ్లాలంటే బుడమేరు దాటాల్సిందే.. పొలాల్లో ముమ్మరంగా పనులు చేసుకోవాల్సిన సమయంలో వెళ్లలేకపోతున్నాం. అత్యవసర పరిస్థితుల్లో కవులూరు, పినపాక గ్రామాల మీదుగా వెళ్లాల్సి వస్తున్నది. దూరం పెరగడంతో పాటు రవాణా ఖర్చుల భారం పడుతోంది. కూలీలను తరలించాలంటే అదనపు భారం తప్పడం లేదు. వంతెన నిర్మాణం అవశ్యం.

బుడమేరు కష్టాలకు పోలవరం తోడైంది..

- మారుపెద్ద శంకరరావు (రైతు)



పట్టిసీమ నుంచి గోదావరి నీరు పోలవరం కాలువలో కలుస్తుంది. దీంతో 45 రోజులు పొలాలకు వెళ్లే అవకాశం లేదు. వర్షాకాలం వస్తే నిత్యం బుడమేరు, పులివాగులు పొంగి ప్రవహిస్తుండటంతో ఖరీఫ్ సీజన్ మొత్తం పొలాలకు వెళ్లలేక పోతున్నాం. బుడమేరులో ఇప్పటికే ఎనిమిది మంది చనిపోయారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలి.

వంతెన నిర్మించి గట్టెక్కించండి

- డి.వంశీకృష్ణ (రైతు)



ఇక్కడ వంతెన నిర్మించి రైతులు, రైతు కూలీల ప్రాణాలు కాపాడాలి. ఆ దిశగా అధికారులు తక్షణం స్పందించాలి. కూలీలు, రైతులు ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వాలు స్పందించకపోడం శోచనీయం. తక్షణం వంతెన నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయించాలి.

'స్టాల్ ఇన్ మాల్'తో చేయూత

- జనవరి 9 వరకు గ్రామీణ హస్త కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు
- నాబార్డ్ డీజీఎం బెహ్రా



స్టాల్ ఇన్ మాల్‌లో వస్త్రాలను పరిశీలిస్తున్న నాబార్డ్ డీజీఎం

కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలనే లక్ష్యంతో ప్రైవేట్ షాపింగ్ మాల్స్‌లోనూ 'స్టాల్ ఇన్ మాల్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంఎం బెహ్రా అన్నారు. నాబార్డ్ ఆర్థిక సహాయంతో నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పీవీపీ మాల్‌లో ఏర్పాటు చేసిన 'స్టాల్ ఇన్ మాల్' ప్రదర్శనను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి, వారి జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు కళాత్మక సంపదను భావితరాలకు అందజేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన చేనేత వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు, కలంకారి వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు, ముత్యాల దండలు వంటి ప్రదర్శన, అమ్మకాలు వినియోగదారులను ఎంతగానో ఆకట్టుకోవడంతో మంచి సత్ఫలితాలనిచ్చాయన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన 'స్టాల్ ఇన్ మాల్' ప్రదర్శన జనవరి 9 వరకు వుంటుందని, ఏపీతో పాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి కూడా కళాకారులు తమ ఉత్పత్తులను అందుబాటులో వుంచుతారన్నారు. నేస్తం సంస్థ సీఈవో వి.సురేష్ మాట్లాడుతూ, నాబార్డ్ సహకారంతో విశాఖపట్నం, విజయవాడ పట్టణాలలో స్టాల్ ఇన్ మాల్స్ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని, ఒక్కో ప్రదర్శన 90 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. హస్తకళాకారులు, చేతివృత్తిదారులకు 15 రోజుల పాటు ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్ కల్లేష్, నేస్తం స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, గ్రామీణ హస్తకళాకారులు పాల్గొన్నారు.

సుప్రీం జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం

ప్రజాస్వామిక, లౌకికతత్వాలపై దాడి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న పి.ప్రసాద్

గాంధీనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడియత్నం రాజ్యాంగంలోని ప్రజాస్వామిక, లౌకికతత్వాలపై దాడిగా పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ఈ సంఘటనపై సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారత న్యాయవాదుల సంఘం జాతీయ నేత సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, జస్టిస్ గవాయ్‌పై దాడి వెనుక హిందుత్వ ఫాసిజం దాగుందని ఆరోపించారు. న్యాయస్థానాలు తమకు అనుకూలంగా తీర్పులు ఇవ్వాలని మనువాదుల హెచ్చరికగా ఈ దాడిని గుర్తించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ, మనువాద భావజాల దారిద్ర్యం నుంచి బయట పడవేసేందుకు బలమైన సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సీపీఎం రాష్ట్ర నేత అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ, జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి కేవలం రాజ్యాంగంపై మాత్రమేకాదని కుల వివక్షతకు నిదర్శనమన్నారు. హక్కుల సంఘం (సీఎల్‌సీ) రాష్ట్ర అధ్యక్షుడు చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ, దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు లోబరచుకుంటున్నారని ఆరోపించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రజలపై మనువాద, కార్పొరేట్ దాడులు జరుగుతున్నాయన్నారు. జస్టిస్ గవాయ్ కార్పొరేట్ ఆర్థిక దాడికి వ్యతిరేకంగా మాట్లాడటం ఆర్ఎస్ఎస్ హిందుత్వవాదులకు కంటగింపుగా మారిందన్నారు. ఎంసీపీఐ నేతలు ఎం.వెంకటరెడ్డి, ఖాదర్‌బాషా, ఓపీడీఆర్, విరసం నేతలు సి.భాస్కరరావు, అరసవల్లి కృష్ణ, పీవోడబ్ల్యూ నాయకురాలు గంగాభవానీ, హక్కుల సంఘం నేత పిచ్చుక శ్రీనివాసరావు, పీడీఎస్‌యూ నేత రాజేష్, పలు ప్రజా, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

బూడిద రగడ

(5వ పేజీ తరువాయి)

వ్యక్తంచేస్తూ విషయాన్ని కలెక్టర్ లక్ష్మీశ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సబ్ కలెక్టర్ కావూరి చైతన్యను క్షేత్రస్థాయి పరిశీలనకు పంపారు.

అడ్డంగా దొరికిపోయిన ఎన్టీటీపీఎస్ అధికారులు

కృష్ణానదిలోకి బూడిదను విడుదల చేయడం లేదని బుకాయించిన ఎన్టీటీపీఎస్ అధికారులు జిల్లాస్థాయి అధికారులు, కూటమి, ప్రతిపక్ష నేతల క్షేత్రస్థాయి పరిశీలనలో అడ్డంగా దొరికిపోయారు. పత్రికల్లో, మీడియాల్లో వస్తున్న కథనాలు తప్పు అని చెప్పుకొచ్చిన ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ పి.శివరామాంజనేయులుపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

స్వచ్ఛమైన తాగునీరందేలా చర్యలు

సబ్ కలెక్టర్ కావూరి చైతన్య హామీ

ఎన్టీటీపీఎస్ నుంచి వచ్చే బూడిద నీరు కృష్ణానదిలో కలవకుండా చూస్తామని, మైలవరం నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణాజలాలు అందేలా బాధ్యత తీసుకుంటామని సబ్ కలెక్టర్ కావూరి చైతన్య స్పష్టం చేశారు. ఎన్టీటీపీఎస్ అధికారులు శుక్రవారం మరోసారి పెద్ద ఎత్తున బూడిద నీటిని కృష్ణానదిలోకి, కూలింగ్ కెనాల్‌లోకి వదలడంతో రాజకీయ నాయకులు, స్థానికుల ఫిర్యాదు మేరకు.. సబ్ కలెక్టర్ బూడిద కూలింగ్ కెనాల్‌లో కలిసే ప్రాంతాన్ని, బూడిద చెరువుకు వెళ్లే పైపులైన్ లీకేజీ ప్రాంతాన్ని, ఎన్టీటీపీఎస్ ప్లాంట్‌లో సైలోస్‌ను పరిశీలించారు.

ఈ సందర్భంగా కూటమి నేతలు చెన్నుబోయిన చిట్టిబాబు, చుట్టుకుదురు శ్రీనివాసరావు, చనమోలు నారాయణ, మైలా సైదులు, ప్రతిపక్ష నేతలు గుంజా శ్రీనివాసరావు, మేడపాటి నాగిరెడ్డి మాట్లాడుతూ ఎన్టీటీపీఎస్ అధికారులు కావాలనే శుద్ధి చేయకుండా నేరుగా బూడిద నీటిని చన్నీళ్ల కాల్వలోకి వదిలేయడంతో తాగునీరు కలుషితమవుతుందని, ఫిల్టర్ బెడ్స్ కూడా శుద్ధి చేయలేనంత స్థాయిలో బూడిద కలుస్తోందని, పదేపదే నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోతోందన్నారు. సబ్ కలెక్టర్ స్పందిస్తూ బూడిద కృష్ణానదిలో కలుస్తున్న మాట వాస్తవమేనన్నారు. ఎన్టీటీపీఎస్ నుంచి వచ్చే డ్రెయినేజీని పూర్తిగా ఆపేయడమా లేక తాగునీరు తీసుకునే ప్రదేశాన్ని మరో 50 మీటర్లు జరిపి డ్రెయినేజీ ఎగువ నుంచి తాగునీరు ఫిల్టర్ బెడ్‌లోకి తీసుకునేలా చేయడమా.. అనే అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. ఇందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంచనాలు సిద్ధం చేసి పంపింగ్ స్కీమ్‌ను డ్రెయినేజీ ఎగువకు మార్చే ఏర్పాట్లు చేయాలన్నారు. బూడిద చెరువుకు వెళ్లే పైపులైన్ లీకులు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్టీటీపీఎస్ అధికారులదేనన్నారు.

ప్లాంట్ నుంచి బూడిద చెరువు వరకు 9 కిలోమీటర్ల మేర ఉన్న పైపులైన్ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చూసుకోవాలని, పదేపదే లీకులు ఏర్పడకుండా ఉండేందుకు పాడైన పైపులైన్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసుకోవాలని ఆయన చీఫ్ ఇంజనీర్ పీవీ శివరామాంజనేయులుకు సూచించారు. పది రోజుల్లోపు బూడిద నీటిని శుద్ధిచేసే ప్లాంట్‌ను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ కమిషనర్ బి.రమ్యకీర్తన, తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయండి

- జేసీ ఇలక్కియా

కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లతో శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారులు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, రైస్ మిల్లర్లను బ్యాంక్ గ్యారెంటీలు అక్టోబరు 15వ తేదీలోగా సమర్పించాలని, మూమెంట్ ఆర్డర్ ప్రకారం ఖాళీ గన్నీ బస్తాలను కొనుగోలు కేంద్రాలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే ధాన్యం ట్రక్కులను చేరిన 24 గంటల్లో ఎఫ్ఐఎఫ్‌వో పద్ధతిలో అన్‌లోడ్ చేసి, ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో వెంటనే ట్రక్ షీట్లు అకనాలెడ్జ్ చేయాలని సూచించారు. జిల్లాలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.

విజయవాడకు చెందిన రౌడీషీటర్ హత్య

హంతకుడు విశాఖ వాసి.. ఆలస్యంగా వెలుగులోకి

అనకాపల్లి జిల్లా పోలవరం కాలువ వద్ద మృతదేహం

ఎలమంచిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు రౌడీషీటర్ల మధ్య తలెత్తిన వివాదం అనుకోకుండా ఒకరి మృతికి దారితీసింది. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి విశాఖపట్నంలోని ఎంవీపీ స్టేషన్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ నగరానికి చెందిన ఎన్.గౌరీశంకర్‌పై రౌడీ షీట్ ఉంది. దీంతో పోలీసులు కొంతకాలం క్రితం నగర బహిష్కరణ చేయడంతో ఎలమంచిలి వచ్చి ఉంటున్నాడు. అతనికి గతంలో విజయవాడ సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్ఆర్ పేటకు చెందిన పాత నేరస్థుడు కశింకోట శ్రీధర్‌బాబు(35)తో పరిచయం ఏర్పడింది. ఒక చోరీ కేసులో వీరు నిందితులుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి కోర్టుకు హాజరుకావడానికి ఈ నెల 7వ తేదీన ఇద్దరూ కలిసి కారులో విశాఖ వెళ్లారు. కేసు వాయిదా అనంతరం సీతమ్మధార రైతుబజార్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ మద్యం సేవించిన తరువాత ఒక మహిళ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో గౌరీశంకర్ తన వద్ద ఉన్న కత్తితో శ్రీధర్‌బాబు చేతిపై తీవ్రంగా గాయపరిచాడు. రక్తస్రావం అవుతుండడంతో ఇద్దరూ కలిసి కారులో సమీపంలోని ఆస్పత్రికి వెళ్లారు. శ్రీధర్‌బాబు గాయానికి కుట్లు వేసిన తరువాత ఇద్దరూ కలిసి కారులో ఎలమంచిలి వైపు బయలుదేరారు. అయితే ఎనిమిదో తేదీ తెల్లవారుజామున దారిలోనే శ్రీధర్‌బాబు మృతిచెందాడు. దీంతో గౌరీశకంర్ కారును అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మునిసిపాలిటీలోని మర్రిబంద సమీపంలోని పోలవరం కాలువ వద్దకు తీసుకువెళ్లి, శ్రీధర్‌బాబు మృతదేహాన్ని అక్కడ పడేశాడు. ఇదిలావుండగా విశాఖ ఎంవీపీ పోలీసులు మరో కేసు విషయమై గౌరీశంకర్‌ను తొమ్మిదో తేదీన అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తుండగా...శ్రీధర్‌బాబు మృతి విషయం బయటపడింది. దీనిపై మరింత లోతుగా విచారించగా..మృతదేహాన్ని ఎలమంచిలి సమీపంలో పడేసినట్టు చెప్పాడు. దీంతో గురువారం సాయంత్రం ఎలమంచిలి వెళ్లి, స్థానిక పోలీసుల సహాయంతో మృతదేహం ఉన్న ప్రదేశానికి వెళ్లారు. మృతదేహం బాగా ఉబ్బిపోయి దుర్వాసన వస్తున్నది. శ్రీధర్‌బాబు మృతిగురించి విజయవాడలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం ఉదయం పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు.

మారని తీరు

(5వ పేజీ తరువాయి)

దిగారు. తానెవరో గుర్తు పట్టలేదని అన్నారని, తనను గుర్తుపెట్టుకునే రోజులు వస్తాయని, అప్పుడు తానేంటో చూపిస్తానని సీఐతో వాదులాడారు. దీంతో పేర్ని నానికి, సీఐకు మధ్య వాగ్వాదం జరిగింది. సీఐ మాట్లాడుతూ.. 'ఏం చేస్తారండీ బాబూ.. మమ్మల్ని ఉరివేస్తారా, వేస్తే వేయండి..' అనడంతో 'వైసీపీ కార్యకర్తలను మీరు ఉరివేస్తారా, వేయండి..' అంటూ పేర్ని ఆవేశంతో ఊగిపోయారు. సీఐని బెదిరిస్తూ పేర్ని నాని మాట్లాడిన సంఘటనకు సంబంధించిన వీడియోలు బయటకు రావడంతో ఇది చర్చనీయాంశంగా మారింది. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు శాంతియుతంగా ర్యాలీ చేస్తే పోలీసులతో అడ్డుకున్నారని, మంత్రి కొల్లు రవీంద్ర సూచనతోనే పోలీసులు వైసీపీ కార్యకర్తలను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ ఘటనలో ఒకేసారి 400 మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులపై కేసు పెట్టడం ఏమిటని, ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తామని పేర్ని మీడియాతో అన్నారు. కాగా సుబ్బన్నను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆయనకు బెయిల్ మంజూరు చేశారు. సొంత పూచీకత్తుపై సుబ్బన్న విడుదలయ్యారు.

గతంలోనూ ఇంతే..

సార్వత్రిక ఎన్నికల ముందు మచిలీపట్నం మండలం పోతేపల్లిలో టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు రెండు విడతలుగా దాడి చేశారు. ఒకసారి టీడీపీ కార్యకర్త ఇంటికి వెళ్లి తమ కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి మరీ దాడి చేశారు. అంతటితో ఆగకుండా బాధితుడిని పోలీస్‌స్టేషన్ వద్ద అప్పగించారు. రెండో విడత అదే కార్యకర్తపై దాడి చేయడంతో విసుగుచెందిన మచిలీపట్నం తాలూకా పోలీసులు వైసీపీ కార్యకర్తలను తమదైన శైలిలో మందలించారు. దీంతో ఎమ్మెల్యేగా ఉన్న పేర్ని నాని, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న పేర్ని కిట్టు, మేకల సుబ్బన్న తదితరులు తాలూకా పోలీస్‌స్టేషన్ వద్ద హంగామా సృష్టించారు. సీసీ కెమెరాలను, పోలీసుల వాహనాన్ని ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు.

మెగా ఫుడ్‌పార్కులో సీపీసీకి జీవం

(5వ పేజీ తరువాయి)

ఫుడ్‌పార్కులో పరిశ్రమలకు 'కామన్ సర్వీసెస్' కింద రూ.24 కోట్లతో కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ)ను ఏర్పాటు చేశారు. ఈ సీపీసీని 7.48 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఆహారశుద్ధి పరిశ్రమలకు అవసరమైన పల్పింగ్, ప్యాకింగ్, రిఫైనింగ్, కోల్డ్ స్టోరేజ్, వేర్‌హౌసింగ్ వంటి సదుపాయాలు కల్పించారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో దీని నిర్వహణ అధ్వానంగా మారింది. ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించటం వల్ల నిర్వహణ సక్రమంగా జరగలేదు. దీంతో సీపీసీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో సీపీసీని ఎలాగైనా పునరుద్ధరించాలని ఏపీఐఐసీ భావిస్తోంది. సరిగ్గా ఇదే తరుణంలో లులు గ్రూపు మల్లవల్లి మెగా ఫుడ్‌పార్కులోని సీపీసీపై దృష్టిసారించి ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపింది. ప్రభుత్వ స్థాయిలో లులు అనుబంధ సంస్థకు కేటాయించాలని ఇంతకుముందే నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో దీనిపై సానుకూలంగా స్పందించారు.

కాస్త తగ్గారు..!

(5వ పేజీ తరువాయి)

పెంచుకో శీర్షికన కథనం ప్రచురితమైంది. తెలంగాణాలో లైన్ ఏర్పాటు ఖర్చు కిలోమీటరుకు రూ.50 వేలు ఉంటే, ఉమ్మడి కృష్ణాజిల్లాలోని విద్యుత్ అధికారులు మాత్రం రూ.2.52 లక్షలు నిర్దేశించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో టెండర్‌ను రద్దు చేశారు. తాజాగా విద్యుత్ శాఖ అధికారులు కొత్త ఎస్ఎస్ఆర్‌ను విడుదల చేశారు. ఈ ఎస్ఎస్ఆర్‌లో బేసిక్ రేటును కిలోమీటరుకు రూ.64 వేలుగా నిర్ణయించారు. అదే పాత ఎస్ఎస్ఆర్‌లో కిలోమీటరుకు మూడు పాంథర్ కండక్టర్ల ఏర్పాటుకు రూ.2,52,089ను నిర్ణయించారు. అంటే.. రూ.1,88,089 తగ్గించారు. నాడు ఎందుకు ఇంత ఖర్చు పెంచాల్సి వచ్చిందో విద్యుత్ శాఖ అధికారులకే తెలియాలి. తీరా తప్పు బయటకు వచ్చేసరికి దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

డేటా అనలిటిక్స్ అండ్ ఏఐ షేపింగ్ ద ఫ్యూచర్‌పై వర్క్‌షాప్

లబ్బీపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నలంద డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం ఏఐ డేటా సైన్స్ విద్యార్థులకు డేటా అనలిటిక్స్ అండ్ ఏఐ షేపింగ్ ద ఫ్యూచర్ అనే కాన్సెప్ట్ పై వర్క్‌షాపు జరిగింది. బెంగళూరు చాణిక్య విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్, రిసోర్స్ పర్సన్ డాక్టర్ భరత్ సెత్తురు విద్యార్థులకు ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్ ప్రాముఖ్యతను, బిగ్ డేటాను, పైతాన్ ప్రోగ్రామింగ్‌ను బోధించటమే కాకుండా ఆధునిక యుగంలో ఉద్యోగాలు సాధించడానికి కావలసిన నైపుణ్యాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ, కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ పి. దుర్గా భవాని, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి. చంద్రగిరి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీతో ప్రతి కుటుంబం లబ్ధి పొందాలి

ఆటోనగర్‌లో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె



ఆటోనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ-2.0 సంస్కరణల వల్ల తగ్గిన పన్నుల లబ్ధిని రాష్ట్రంలోని ప్రతికుటుంబం పొందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఈసంస్కరణలపై ప్రజలకు అవగాహన కోసం రాష్ట్ర వ్యాప్తితంగా నెల రోజులు పాటు సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. శుక్రవారం జవహర్ ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని ఆటోనగర్ ఎగ్జిబిషన్ హాలులో ఏర్పాటైన సూపర్ జీఎస్టీ.... సూపర్ సేవింగ్స్ పేరుతో జీఎస్టీ-2.0 సంస్కరణల వల్ల తగ్గిన ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రదర్శన, అమ్మకాల ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల కేంద్రం నుంచి రాష్ట్రానికి రావల్సిన వాటాలో రూ. 8వేల కోట్లు తగ్గుతుందని, అయినా ప్రజల మేలు కోసం సీఎం చంద్రబాబు దీనిని అమలుచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ జీఎస్టీ విజయవాడ జాయింట్ కమిషనర్ ఎస్. ప్రశాంత్‌కుమార్, డీసీలు కె. అపర్ణ, ఎస్‌కే జహీర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు

బాణసంచా విక్రయదారులతో జరిగిన సమావేశంలో జిల్లా అగ్నిమాపక అధికారి మాల్యాద్రి



మాట్లాడుతున్న జిల్లా అగ్నిమాపక అధికారి మాల్యాద్రి

కార్పొరేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేనిదే బాణసంచా విక్రయాలు చేయరాదని, వీధి విక్రయదారులు నిర్దేశిత ప్రదేశాల్లోనే బాణసంచా అమ్ముకోవాలని జిల్లా అగ్నిమాపక అధికారి మాల్యాద్రి తెలిపారు. శుక్రవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం నూతన భవనం సమావేశ హాల్లో బాణసంచా అమ్మకం దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి మాట్లాడుతూ దీపావళి సందర్భంగా బాణసంచా అమ్మకందారులు ఖచ్చితంగా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలన్నారు. అనుమతి లేకుండా విక్రయాలు సాగిస్తే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు మాట్లాడుతూ దీపావళి సామాగ్రి అమ్మేవారు వారి చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలకు ఎటువంటి ఇబ్బందికరమైన, ప్రమాదకరమైన వాతావరణం ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్ మాట్లాడుతూ ఓపెన్ గ్రౌండ్‌లలో మాత్రమే బాణసంచా విక్రయాలకు అనుమతి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటనారాయణ మాట్లాడుతూ వీధి విక్రయదారులు కేవలం నిర్దేశిత ప్రదేశాలలోనే అమ్మకాలు చేయాలని తెలిపారు. అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, నగర పరిధిలోని బాణసంచా దారులు, వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



బాలలు, గ్రాండ్ పేరెంట్స్‌తో అకాడమీ జాయింట్ సెక్రటరీ లలిత్‌ప్రసాద్, ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య తదితరులు

పుస్తక పఠనంతో జ్ఞానం పెంచుకోండి

సిద్ధార్థ అకాడమీ జాయింట్ సెక్రటరీ లలిత్ ప్రసాద్ సూచన

మొగల్రాజపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పుస్తపఠనం ద్వారా జ్ఞానం పెంచుకోవాలని సిద్ధార్థ అకాడమీ జాయింట్ సెక్రటరీ నిమ్మగడ్డ లలిత్ ప్రసాద్ సూచించారు. మొగల్రాజపురం వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ లైబ్రరీలో పిల్లలు ఎక్కువగా గడపడం అలవాటు చేసుకోవాలని సూచించారు. సిద్ధార్థ స్కూల్ జాయింట్ సెక్రటరీ సురెడ్డి విష్ణు మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా పిల్లల అభిరుచులను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలు, దసరా సంబరాలు, తాతయ్య, బామ్మ వేషధారణలతో ఆకట్టుకున్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, హెచ్‌ఎం చల్లా జయలక్ష్మి, టీచర్లు, తల్లిదండ్రులు, గ్రాండ్‌పేరెంట్స్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు

భారతీనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పిల్లల సంక్షేమం కోరుకునే తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి.సుబ్బారావు బాలికలకు సూచించారు. ప్రపంచ మానసిక దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం పటమటలోని కొమ్మాసీతారామయ్య జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జిల్లా సమగ్ర శిక్ష కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక దినోత్సవంపై అవగాహన సదస్సు, అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ పిల్లలు ఎలక్ట్రానిక్ మీడియాకి దూరంగా ఉండాలని తెలిపారు. జిల్లా బాలిక అభివృద్ధి అధికారి బి.విశ్వభారతి మాట్లాడుతూ విద్యను ఆయుధంగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం ఫైనాన్స్ అండ్ అకౌంట్ ఆఫీసర్ హైమా రవితేజ మాట్లాడుతూ దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించే విధంగా విద్యార్థులు ఉండాలని అన్నారు. పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయోల కాలేజీలో..

ఆంధ్ర లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(ఐక్యూఏసీ)ఆధ్వర్యంలో సైన్స్ విభాగం సహకారంతో కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ శివజ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సెక్రటరీ, డైరెక్టర్ ఫాదర్ జోజిరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇమ్మానుయేల్, ప్రిన్సిపాల్ ఒ.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అకడమిక్ ఎక్స్‌పో



జ్యోతి వెలిగించి ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న డాక్టర్ అమిర్త గణేష్ దంపతులు

ప్రసాదంపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటకు వస్తుందని, విద్యార్థి అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని ఎయిమ్స్ గుండె వైద్యనిపుణులు డాక్టర్ అమిర్త గణేష్ తెలిపారు. శుక్రవారం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ అకడమిక్ ఎక్స్‌పోను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పలు వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యక్తిగత నైపుణ్యాన్ని పెంపొందించడానికి పాఠశాల యాజమాన్యం ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. రోల్ ఆఫ్ కలర్స్ ఇన్ లిటరేచర్, హంటిగ్ లైబ్రరీ, రామాయణ ఘట్టాలు, ఆల్జీబ్రా ఫార్ములా, జామెట్రికల్ రిప్రజెంటేషన్, చంద్రయాన్, తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి. నమూనాలను తయారు చేసిన విద్యార్థులను, ప్రోత్సహించిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను వైస్ ఛైర్మన్ పరిమి నరేంద్ర బాబు అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పి.పవన్ చంద్, శ్వేత బిందు, ప్రిన్సిపాల్ , వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

కోతుల బీభత్సం

- ఇళ్లల్లోకి చొరబడి గాయపరుస్తున్న వైనం



కోతి గాట్లు

రామలింగేశ్వరనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రామలింగేశ్వరనగర్, పటమట, లంబాడీపేట, అంబేడ్కర్ నగర్ కాలనీ కాల్వగట్టు ప్రాంతాల్లో కోతుల గుంపు దాడి చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయని ఆయా ప్రాంత వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏడాది నుంచి ఇళ్లల్లోకి చొరబడి సామానులు పాడుచేస్తున్నాయని, గుంపులుగా తిరుగుతూ తమపై దాడి చేసి కరుస్తున్నాయని చెబుతున్నారు. తాము ఏడాదిగా ఇబ్బందులకు గురవుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా వన్యసంరక్షణ అధికారులు స్పందించి వీటిని మళ్లించే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కోతి కరిచి గాయపడ్డాను: లక్ష్మి, లంబాడీపేట



మా ఇంటి వద్దకు కోతుల గుంపు వచ్చింది. నేను వాటిని తరిమే ప్రయత్నం చేస్తే నా మీద దాడి చేశాయి. ఒక్కసారిగా వచ్చి కరిచాయి. దీంతో తీవ్రంగా గాయపడ్డాను. గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కోతులను తరిమారు.

తాగునీటి ఇబ్బందులు తొలగించాలంటూ

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

మొగల్రాజపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోయపాటి మాధవరావు రోడ్డు ప్రాంతంలో మంచినీటి ఇక్కట్లను తొలగించాలని సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో శుక్రవారం ధర్నా చేశారు. ఈ ధర్నాలో సీపీఎం తూర్పు సిటీ కార్యదర్శి పుప్పాల కృష్ణ మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా మంచినీరు సకాలంలో రావడం లేదని, వచ్చినా చిన్న ధార మాత్రం వస్తుందని దీని వల్ల తాగునీటికి ఇబ్బంది ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని వీఎంసీ అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించకపోతే నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. సీపీఎం సీనియర్ నాయకులు మురహరి, వెంకటనాయుడు. నాగరాజు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గుడికి వెళ్లిన బాలుడు అదృశ్యం

వన్‌టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడికి వెళ్లిన కోట శరవణ వీరభద్రశర్మ (15) అదృశ్యమైనట్లు శుక్రవారం కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణలంక మార్వాడీ శివాలయం సమీపంలో వీరభద్ర శర్మ తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఇతను కృష్ణలంకలోని ఓ పాఠశాలలో వేదం చదువుతున్నాడు. అయిదారు నెలల నుంచి వీరభద్రశర్మ ఒంటరిగా చల్లపల్లిలోని సింగరాయపాలెం సుబ్రహ్మణ్యస్వామి గుడికి వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో శర్మ ఈనెల 8న ఉదయం 8 గంటలకు సుబ్రహ్మణ్యస్వామి గుడికి వెళుతున్నానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లాడు. ఆ రోజు రాత్రి వరకు వీరభద్ర శర్మ ఇంటికి రాకపోవటంతో మరుసటి రోజు తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. శర్మ తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



మక్కపేట చౌరాస్తాలో బంధువులతో కలిసి రాస్తారోకో చేస్తున్న అరుణ

పెళ్లికి ప్రేమికుడు నిరాకరణ
బంధువులతో కలిసి యువతి రాస్తారోకో

వత్సవాయి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : యువకుడు నమ్మించి మోసం చేసిన నేపథ్యంలో యువతికి న్యాయం చేయాలంటూ మక్కపేటకు చెందిన ఆమె బంధువులు వత్సవాయి బస్టాండ్ చౌరాస్తాలో శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. బాధితురాలు యండ్రాతి అరుణ మాట్లాడుతూ సందీప్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబర్చుకున్నాడని, పెళ్లి విషయం ఎత్తగానే తప్పించుకొని తిరుగుతున్నాడని వాపోయింది. పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా ఏడాదిన్నర తర్వాత పెళ్లి చేసుకుంటానని హామి పత్రం రాసి ఇచ్చి, ఏడాదిన్నర గడిచినా పెళ్లికి అంగీకరించడం లేదని, పెద్దలు సైతం తనకు న్యాయం చేయడం లేదని ఆమె రోదిస్తూ చెప్పింది. ప్రేమించిన వ్యక్తి పెళ్లి చేసుకోనందునే రోడ్డెక్కాల్సి వచ్చిందని ఆమె తెలిపింది. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు రాస్తారోకో చేయడంతో నాలుగు వైపులా వందల సంఖ్యలో వాహనాలు నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు నానా పాట్లు పడ్డారు. పోలీసులు వచ్చి తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు.



అమరావతిలోని సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ భార్గవ్‌తేజ్

సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభోత్సవం 13న

కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రాజధాని అమరావతిలో ఏపీ సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయం ఈనెల 13న ప్రారంభం కానున్నది. కార్యాలయాన్ని అదనపు కమిషనర్ భార్గవ్‌తేజ్ శుక్రవారం పరిశీలించారు. నిర్మాణం పూర్తి చేసుకొన్న ప్రాజెక్టు కార్యాలయంలోని పలు ఫ్లోర్లు, వివిధ చాంబర్‌లను ఆయన సందర్శించారు. అదనపు కమిషనర్‌కు సీఆర్‌డీఏ హౌసింగ్, బిల్డింగ్స్ విభాగ చీఫ్ ఇంజినీర్ పి.వి.భాస్కర్, డెవలప్‌మెంట్ ప్రమోషన్ జోనల్ జాయింట్ డైరక్టర్ కె.దివ్యలత, కమ్యూనికేషన్స్ విభాగ డిప్యూటీ డైరక్టర్ ఎం.సిద్ధార్థ వర్మ తదితరులు ప్రాజెక్టు కార్యాలయంలో పూర్తికానున్న పనులను వివరించారు. ప్రాజెక్టు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి అదనపు కమిషనర్ పలు సూచనలు చేశారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

అమరావతిలో అత్యాధునిక సెంట్రల్ లైబ్రరీ

వన్‌టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో అత్యాధునిక వసతులతో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. విజయవాడలో శుక్రవారం జరిగిన వర్క్‌షాప్‌లో అయన మాట్లాడారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందేలా ఐదు ఎకరాల స్థలంలో లైబ్రరీ నిర్మాణం ఉంటుందన్నారు. ఈ లైబ్రరీ భవిష్యత్ తరాలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేలా ఉంటుందన్నారు. ఇతర దేశాల్లో కూడా పలు లైబ్రరీలను సందర్శించి వచ్చానన్నారు. నిపుణుల అభిప్రాయాలను తీసుకుని అందరికీ నచ్చేలా, మెచ్చేలా గ్రంథాలయం నిర్మిస్తామన్నారు. ఏ విధంగా రూపకల్పన చేయాలనే అంశాలపై వర్క్ షాపు నిర్వహించామన్నారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలను నిపుణులు వివరించారన్నారు. ఈ గ్రంథాలయం నిర్మాణం కోసం త్వరలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిజైన్ కాంపిటీషన్స్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర మౌలిక వసతులు కల్పన బోర్డు చైర్మన్ రాజశేఖర్, గ్రంథాలయ సంస్థ బోర్డు డైరెక్టర్ డైరెక్టర్ రాసాని పద్మజ, రామ్మూర్తి, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కృష్ణ మోహన్, తదితరులు పాల్గొన్నారు.



ఐడీసీ చైర్మన్ లీలా కృష్ణతో మాట్లాడుతున్న రాటకొండ చంద్రశేఖర్

వేదాద్రి పైప్‌లైన్ పనులకు నిధులివ్వాలి

నందిగామ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వేదాద్రి ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ మరమ్మతులకు నిధులు అందించాలని నందిగామ ఎన్ఎస్‌పీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ కోరారు. ఐడీసీ చైర్మన్ వేగుల్ల లీలా కృష్ణ, ఐడీసీ ఎండీ తిరుమలరావును వారి కార్యాలయంలో శుక్రవారం ఆయన కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ నిధుల నుంచి మంజూరైన రూ.33 లక్షలతో మోటారు మరమ్మతులు పూర్తి చేశామన్నారు. ట్రైల్ రన్ నిర్వహిస్తుండగా పైప్‌లైన్లు పగిలిపోతున్నాయని తెలిపారు. వాటి ఫొటోలను వారికి చూపించారు పైప్‌లైన్ మరమ్మతులకు నిధులను మంజూరు చేయాలని కోరారు. ఐడీసీ చైర్మన్‌లీలా కృష్ణ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరలో అవకాశం మేరకు నిధులు అందిస్తామని, పను లు కొనసాగించాలని సూచించారు. ఎట్టి పరిస్థితులలో వారం రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని ఆయన కోరారు. ఈ లింగాలపాడు టీడీపీ నేత ఉమ్మినేని విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, సభ్యులు

ధన్వంతరి జయంతి వేడుకలకు ఉత్తర్వులివ్వండి

పాయకాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేద వైద్యానికి మూలపురుషుడైన ధన్వంతరి జయంతి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా త్వరితగతిన ఉత్తర్వులు జారీ చేయాలని నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం శుక్రవారం బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవితను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిసిన నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, డైరక్టర్లు వినతిపత్రాన్ని అందజేశారు. ఈనెల 18వ తేదీన విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ధన్వంతరి జయంతి వేడుకలు నిర్వహించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్లు సూరవరపు నాగరాజు, లంకా రత్నారావు, నిడమానూరు రమేష్, మద్దిరాల గంగాధర్, పుల్లేటికుర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దాం

- 'టెలీమానస్' ద్వారా మానసిక ఆరోగ్య సేవలు
- ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో కలెక్టర్ లక్ష్మీశ, మానసిన వ్యాధుల సలహా బోర్డు చైర్మన్ డాక్టర్ రామసుబ్బారెడ్డి తదితరులు

విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తీవ్ర ఒత్తిళ్ల కారణంగా ప్రజల్లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, మానసికంగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం సమష్టిగా కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో 'అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సంరక్షణ' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లతో ప్రజల్లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు. పది ప్రధాన వ్యాధుల్లో మానసిక వ్యాధిని కూడా చేర్చామని చెప్పారు. దీనికి సంబంధించిన అడ్వయిజరీ బోర్డు చైర్మన్‌గా డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డిని నియమిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం ప్రపంచంవ్యాప్తంగా 97 కోట్ల మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని, భారత్‌లో ఆ సంఖ్య 15 కోట్లుగా ఉందని వెల్లడించారు. మానసిక వైద్యులు, క్లినికల్ సైకాలజిస్టుల కొర త తీర్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

రాష్ట్రంలో 'టెలీమానస్' కార్యక్రమం ద్వారా మానసిక ఆరోగ్య సేవలు అందిస్తున్నట్టు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మానసిక సమస్యలతో బాధపడే వారు టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే మానసిక వైద్య నిపుణులు వారికి కౌన్సిలింగ్ ఇస్తారని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలోనూ మానసిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విశాఖపట్నంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అప్‌గ్రేడ్ చేశామన్నారు. ధర్మవరం, కాకినాడలో కొత్తగా ఆయుర్వేద కళాశాలలు మంజూరు అయ్యాన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్ (యూకే) డాక్టర్ కృష్ణా రెడ్డి, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఐఎంఏ చైర్మన్ డాక్టర్ శ్రీహరి రావు తదితరులు పాల్గొన్నారు.

ఆయేషా తల్లిదండ్రులకు దర్యాప్తు నివేదిక అందజేయండి!

- అధికారులకు సీబీఐ కోర్టు ఆదేశం
- తదుపరి విచారణ 31కి వాయిదా

విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసు దర్యాప్తు నివేదికను ఆమె తల్లిదండ్రులకు అందజేయాలని సీబీఐ అధికారులను విజయవాడ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఆయేషా మీరా హత్య కేసులో తిరిగి దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. దర్యాప్తు ముగిసిన అనంతరం నివేదికను కోర్టుకు సమర్పించింది. ఈ నివేదికను తమకు అందజేయాలని కోరు తూ ఆయేషా తల్లిదండ్రులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది విచారణ దశలో ఉంది. ఇదిలా ఉండగా, ఈ కేసులో నిందితుడిగా పేర్కొన్న పిడతల సత్యంబాబుపై నమోదైన అభియోగాలపై అభ్యంతరాలు చెప్పాలని, కోర్టుకు హాజరై వివరించాలని సీబీఐ కోర్టు వారికి నోటీసులు జారీచేసింది. నోటీసులు తీసుకోవడానికి నిరాకరించిన ఆయేషా తల్లిదండ్రులు.. దర్యాప్తు నివేదికను తమకు ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఆయేషా తల్లిదండ్రుల తరఫున న్యా యవాది పిచ్చుక శ్రీనివాస్, సీబీఐ తరఫున గోపీనాథ్ వాదనలు వినిపించారు. దీనిపై న్యాయాధికారి అన్నపూర్ణ శుక్రవారం తీర్పు ఇచ్చారు. దర్యాప్తు నివేదికను అయేషా తల్లిదండ్రులకు అందజేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను ఈనెల 31వ తేదీకి వాయిదా వేశారు.

ఆగ్రోస్ చైర్మన్ సుబ్బానాయుడుకు తీవ్ర అస్వస్థత

- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన మంత్రి లోకేశ్

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆగ్రోస్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రాష్ట్ర సచివాలయంలో సీఎం నిర్వహించిన సమీక్షలో సు బ్బానాయుడు పాల్గొన్నారు. అదే రోజు రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను హుటాహుటిన మణిపాల్‌కు తరలించారు. సీఎం చంద్రబాబు ఆయన ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు. మంత్రి లోకేశ్ ఆసుపత్రికి వెళ్లి, సుబ్బానాయుడి ఆరోగ్య పరిస్థితినిఅడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు

- మహిళల సమస్యల పరిష్కారానికి ఆన్‌లైన్ పోర్టల్
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



స్పాట్‌లైట్‌లో మాట్లాడుతున్న ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, హాజరైన విద్యార్థినులు

వన్‌టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినా, సోషల్ మీడియాలో తప్పుగా పోస్ట్ చేసినా కఠిన చర్యలు తప్పవని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్, ఏపీ మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ కేబీఎన్ కళాశాలలో స్పాట్‌లైట్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. శైలజ మాట్లాడుతూ అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రతి ఏడాది అక్టోబరు 11న జరుపుకుంటున్నామని, బాలికా దినోత్సవాలు అంటూ ఒక్క రోజు జరుపుకోవడం కాదు, ఏడాది మొత్తం అవగాహన సదస్సులు జరుపుకున్నప్పుడే అద్భుత ఫలితాలు సాధించగలమన్నారు. దీంతో సమాజంలో సైతం మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్నారులు, బాలికలు, మహిళలు స్వేచ్ఛగా, సంతోషంగా జీవించే హక్కు కలిగి ఉన్నారని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పని ప్రదేశంలో అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలు ఉంటే మహిళలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మహిళా చట్టాలపై అవగాహన పెంచేలా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, బాలికలు స్వయంగా తమ కార్యాలయానికి రాలేని పరిస్థితులు ఉండటం, వివరాల గోప్యత వంటి విషయాలను గుర్తించి ఆన్‌లైన్ పోర్టల్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. మహిళలపై అఘాయిత్యాయాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా దేశంలోనే మొదటి రాష్ట్రంగా ఏపీని నిలపాలన్న ఆలోచనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. మరోకరు అలాంటి తప్పుడు పనులు చేయకుండా భయపడే విధంగా చట్టాలు ఉండాలని విద్యార్థుల నుంచి విజ్ఞప్తులు రావడం హర్షనీయమన్నారు. ముందుగా మారపు ట్రస్ట్ చైర్మన్ ఆర్. సుయజ్, రాయపాటి శైలజ ముఖాముఖి నిర్వహించారు. మహిళలపై ప్రస్తుతం జరుగుతున్న అఘాయిత్యాలు, సోషల్ మీడియా వేదికగా వేధింపులు తదితర అంశాలపై అడిగిన ప్రశ్నలకు రాయపాటి శైలజ విపులంగా సమాధానాలు చెప్పారు. విద్యార్థినిలు అడిగిన ప్రశ్నలకు కూడా సమాధానాలు చెప్పడంతో పాటు వారిలోని జిజ్ఞాసను ప్రశంసించారు. అనంతరం కేబీఎన్ కళాశాల ఉపాధ్యాయ, అధ్యాపక బృందం శైలజను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి మెమొంటో బహూకరించారు.



ఆంజనేయస్వామి గుడి వద్ద పోలవరం కాల్వ మట్టిని అక్రమంగా తవ్వేసిన ప్రాంతం

పోలవరం కాల్వ మట్టిని తవ్వేస్తున్నారు!

- తీరని వైసీపీ నేతల మట్టిదాహం
- అర్ధరాత్రిళ్లు యథేచ్ఛగా తరలింపు

విజయవాడ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల పాలనలో అక్రమ మైనింగ్‌కు అలవాటు పడిన వైసీపీ నేతల మట్టి దాహం ఇంకా తీరలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిరా వైసీపీ నేతల తీరు మార్చుకోవడం లేదు. ప్రతిపక్షంలో ఉండి కూడా యథేచ్ఛగా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ అధికారులకు, పాలకులకు సవాల్ విసురుతు న్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో గత మూడు రోజులుగా పోలవరం మట్టిని యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. గ్రామ శివారుల్లోని పోలవరం కాల్వ వెంబడి ఆంజనేయ స్వామి ఆలయం, రుద్రవరం ప్రాంతాలతో పాటుగా పలు చోట్ల ఇష్టానుసారం తవ్వకాలు జరుపుతున్నారు. గ్రామానికి చెందిన వైసీపీ నేతలు కొందరు అర్ధరాత్రిళ్లు పోలవరం మట్టిని అక్రమంగా తవ్వి అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఎక్స్‌కవేటర్ల తవ్వకాలు జరిపి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఒకే చోట తవ్వితే అనుమానం వస్తుందనే కారణంతో పోలవరం కాలువ వెంబడి పలు చోట్ల తవ్వకాలు జరుపుతున్నట్లు స్థానికులు తెలిపారు.

రెవెన్యూ, పోలీసుల రాకతో పరార్

గత మూడు రోజులుగా అర్ధరాత్రిళ్లు జరుగుతున్న తవ్వకాలపై కొందరు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఆర్ఐ సాయికృష్ణ, ఎస్సై విమల సిబ్బందితో తవ్వకాలు జరుగుతున ప్రాంతానికి వెళ్లారు. అధికారులు వస్తున్న విషయం తెలుసుకున్న అక్రమార్కులు అక్కడి నుంచి పరారయ్యారు. గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ధన్వంతరి జయంతి తిరుపతిలో 18న

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



ధన్వంతరి జయంతి పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్

వన్‌టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సంజీవని స్వరం పేరిట ఈనెల 18న ధన్వంతరి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ తెలిపారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నాయీబ్రాహ్మణుల ప్రతినిధులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్పొరేటీకరణ కారణంగా తమ వృత్తులను కోల్పోతున్నామని, సమాజంలో రక్షణ కూడా కోల్పోతున్నామని నాయీబ్రాహ్మణులు ఆవేదన వ్యక్తం చేశారు. నాదస్వరం వాద్యకారుల ఉద్యోగాలను ఔట్ సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయటం వల్ల చాలీచాలని జీతాలతో గడపాల్సి వస్తోందన్నారు. దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణుల పోస్టులు భర్తీ చేయాలన్నారు. మాధవ్ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు ధన్వంతరి వారసులని అభివర్ణించారు. నాదస్వరం, డోలు వాయిద్య కారుల పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వంతో మాట్లాడతామన్నారు. వారికి తగిన గౌరవం తీసుకొస్తామన్నారు. బీజేపీ సంఘటనా కార్యదర్శి మధుకర్‌జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి రమేష్ నాయుడు, ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలు అసహ్యించుకుంటున్నా జగన్‌కు సిగ్గు రావటం లేదు : యామిని

వన్‌టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఛీకొట్టి అసహ్యించుకుంటున్నా జగన్‌కు ఏమాత్రం సిగ్గు రావటంలేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామినీ శర్మ అన్నారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు కడితే వచ్చిన ఇబ్బందేమిటని హైకోర్టు అడిగిన ప్రశ్నకు జగన్ వద్ద సమాధానం లేదని, అదొక చెంప పెట్టు వ్యాఖ్య అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలోనే భూమి ఉంటుందని, కాలేజీపై నియంత్రణ, సీట్లు కేటాయింపు, ఫీజులు ఉన్నప్పుడు ఎలా ప్రైవేటీకరణ అవుతుందని ప్రశ్నించారు. సీట్లు పెరగటం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు లాభమేనని, ఫీజుల్లో ఎలాంటి మార్పు ఉండదని, ఉపాధి కూడా పెరుగుతుందన్నారు. జగన్ అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు.

పది వేల స్వయం సహాయక సంఘాలకు లింకేజీ రుణాలు



ఖాతాదారులతో మాట్లాడుతున్న కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పది వేల స్వయం సహాయక సంఘాలకు లింకేజీ రుణాలు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. కేడీసీసీ బ్యాంకు జగ్గయ్యపేట బ్రాంచిలో సొసైటీల చైర్‌పర్సన్లు, అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నెట్టెం మాట్లాడుతూ, కేడీసీసీ బ్యాంకులో డిజిటలైజేషన్ పూర్తి చేశామన్నారు. షెడ్యూల్ బ్యాంకులు తరహాలో అన్ని రకాల సేవలు, రుణాలు అందజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాలు స్థానిక సొసైటీల్లో బ్యాంకు ఖాతాలు ప్రారంభించి, లావాదేవీలు నిర్వహించేందుకు వీలుగా సెర్ప్, కేడీసీసీ బ్యాంకు, సొసైటీ మధ్య అనుసంధానానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అర్బన్ ప్రాంతాల్లో వ్యవసాయం తగ్గిపోవటంతో పంట రుణాల శాతం బాగా పడిపోతున్నదున, ప్రత్యామ్నాయంగా ప్రభు త్వం లక్ష్యాలకు అనుగుణంగా ఎంఎస్ఎంఈ రుణాలు చిరువ్యాపారులకు రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకానికి బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అనంతరం ఆ యన జగ్గయ్యపేట బ్రాంచి పరిధిలోని మల్కాపురం సొసైటీ కార్యాలయాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని నెట్టెం రఘురాం చెప్పారు. జగ్గయ్యపేటలోని కృష్ణా రైతు సేవా సంఘాన్ని, గోపాలకృష్ణ విశాల సహకార పరపతి సం ఘాలను సందర్శించారు. జనఔషధి దుకాణాన్ని, బ్యాంకింగ్ కౌంటర్లను పరిశీలించారు. బండిపాలెం, గౌరవరం సొసైటీల్లో లాకర్ సదుపాయాలు పెంచుతామన్నారు. సమీక్షా సమావేశంలో నందిగామ ఏజీఎం శ్రీదేవి, స్థానిక బ్రాంచ్ చీఫ్ మేనే జర్ రమేష్, సొసైటీల అధ్యక్షులు యానాల గోపీచంద్, కట్టా నరసింహారావు, అప్పారావు, జి.పిచ్చయ్య చౌదరి, ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శులు కనపర్తి నారాయణరావు, మీసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కక్షలుండవు.. అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే కొలికపూడి



తిరువూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యమని, రాజకీయ కక్షల్ని సహించేది లేదని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. చైర్‌పర్సన్ కొలికపోగు నిర్మల అధ్యక్షతన శుక్రవారం జరిగిన ము న్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొలికిపూడి పైవిధంగా స్పందించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలపై స్పందించారు. అర్బన్‌హెల్త్ భవనం పనులు పూర్తికి నిధుల కేటాయింపు అంశంపై వైసీపీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు(బీరువాల బాబు)తంగిరాల వెంకటరెడ్డి మాట్లాడుతూ, భవన నాణ్యతపై విచారణ నిర్వహించాలని, సంబంధిత కాంట్రాక్టర్ నుంచి నష్టపరిహారం వసూలు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు రూ.2.50 కోట్ల నిధులతో పనులకు టెండర్లు పిలిచి, తదుపరి పనులు ఎందుకు రద్దు చేశారని ఎమ్మెల్యే కొలికపూడి అధికారుల్ని ప్రశ్నించారు. డంపింగ్ యార్డు మీదుగా పంపింగ్ స్కీం వరకు రహదారి నిర్మాణ అంశంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతగా ఉపయోగం లేని ప్రాతంలో రోడ్డు నిర్మించేకంటే, ప్రజలకు అవసరం అయిన ప్రాంతంలో రహదారి నిర్మించాలని కొందరు సభ్యులు చేసిన సూచనతో, ఈ అంశాన్ని వాయిదా వేశా రు. మరోమారు అధికారులు పరిశీలించాలని సూచించారు. ఐదు, ఆరు వార్డుల కౌన్సిలర్ల సభ్యత్వం రద్దు అంశం ప్రస్తావించగా, ఎవ్వరి సభ్యత్వం రద్దు కాదని, రాజకీయ కక్ష సాధిం పులు ఉండవన్నారు. కౌన్సిల్‌లో 15 అంశాలక 13 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. వైస్‌చైర్‌పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, గుమ్మ వెంకటేశ్వరమ్మ, కమిషనర్ కె.మనోజ, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష వైసీపీ కౌన్సిలర్లు ఎక్కువ సంఖ్యలో హాజరైనా, అజెండాలోని రెండు అంశాలు మినహా మిగిలిన 13 అంశాలు ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ఆమోదం పొందడ గమనార్హం.

అంతర్గత బదిలీలు

- ఏడుగురు ఆర్ఐలు, ఐదుగురు సీనియర్ అసిస్టెంట్లు
- అధికారులకు నచ్చిన విధంగా బదిలీలు

కార్పొరేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ మూడు సర్కిల్స్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా మూడు సంవత్సరాలు పూర్తి అయిన ఏడుగురితో పాటు సీనియార్టీ ప్రాతిపదికన ఐదుగురు సీనియర్ అసిస్టెంట్లను బదిలీలు చేస్తూ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. మేయర్ పేషీలోని సీనియర్ అసిస్టెంట్ ఐ.జగదీశ్వర ప్రసాద్‌ను సర్కిల్ -1 రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు మేయర్ పేషీలో తన సాధారణ పనికి అదనంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహిస్తారు. కమిషనర్ పేషీ సీనియర్ అసిస్టెంట్ మురళీ కృష్ణను సర్కిల్-3లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-9గా బదిలీ చేసి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కమిషనర్ పేషీలో పని చేసేలా ఆదేశాలు ఇచ్చారు. కమిషనర్ పేషీలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సిహెచ్.వి.మోహన్‌ను సర్కిల్-2లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-6గా బదిలీ చేసి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కమిషనర్ పని చేయటంతోపాటు అదనంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. ఎస్టేట్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ కె.ఎస్తేర్ రాణిని సర్కిల్-3లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-13గా బదిలీ చేశారు. వెహికల్ డిపో సీనియర్ అసిస్టెంట్ ఐ.మధు జగన్ మోహనరావును సర్కిల్-2లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-8గా బదిలీ చేశారు. సర్కిల్-1లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-1గా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ మహబూబ్‌ను ఎస్టాబ్లిష్‌మెంట్‌లో సీ1గా బదిలీ చేశారు. సర్కిల్-1లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-2ను సీనియర్ అసిస్టెంట్ వి.ఐ.లెనిన్‌ను యూసీడీలో యు1గా బదిలీ చేశారు. సర్కిల్-1లో రెవెన్యూ ఇన్ స్పెక్టర్-3గా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె. సురేంద్ర కుమార్‌ను టౌన్ ప్లానింగ్ విభాగంలో జీ1గా బదిలీ చేశారు. కె.వినయ్ కుమార్‌ను సర్కిల్-2 రెవెన్యూ విభాగంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-6ను ఎస్టేట్ విభాగంలో ఎస్1గా బదిలీ చేశారు. సర్కిల్-2లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-8గా పనిచేస్తున్న జేడీవీ ప్రసాద్‌ను వెహికల్ డిపోలో సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. సర్కిల్-3 రెవెన్యూ విభాగం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-13 బి.శ్రీనివాసరావును ఎస్టాబ్లిష్‌మెంట్‌లో సీ5గా బదిలీ చేశారు. సర్కిల్-3లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-9గా పనిచేస్తున్న జె.మారుతీరావును ఎస్టేట్ విభాగంలో ఎస్5కి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజధాని రైతుల వార్షిక కౌలు రూ.6.64 కోట్లు విడుదల

విజయవాడ కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం నుంచి చెల్లించవలసిన వార్షిక కౌలు జమ చేశారు. సమస్యలను పరిష్కరించిన సీఆర్‌డీఏ 495 మందికి అందాల్సిన పెండింగ్ వార్షిక కౌలు నిధులు రూ.6.64 కోట్లు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేసింది.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

తిరువూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పీటీ కొత్తూరు వద్ద రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందారు. చిట్యాల గ్రామానికి చెందిన తేలె వెంకటేశ్వరరావు (60) ద్విచక్రవాహనంపై తిరువూరు వస్తుండగా, తిరువూరు నుంచి ద్విచక్రవాహనంపై పీటీ కొత్తూరు వెళుతున్న నాగేశ్వరరావు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి, ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్వరరావు చికిత్స నిమిత్తం తిరువూరు తరలిస్తుండగా మృతి చెందాడు. ఎస్సై సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా చర్యలు పాటించాలి

విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ సమయంలో ప్రమాదవశాత్తు కలిగే పేలుళ్లు, మంటలను నివారించడానికి కఠినమైన భద్రతా చర్యలు పాటించాలని ఫైర్ డీజీ పి.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాణసంచా ఉత్పత్తి లైసెన్స్ పొందిన పరిశ్రమల నుంచే జరగాలని, ఇవి జనావాసాలకు, హైవేలకు, దూరంలో ఉండాలని డీజీ సూచించారు. రాత్రి వేళ్లల్లో బాణసంచా తయారీ చేపడితే కఠిన చర్యలు తప్పవని డీజీ హెచ్చరించారు.

దుర్గమ్మ సేవలో నటి లయ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మను శుక్రవారం నటి లయ దర్శించుకున్నారు. అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం ఆమెతో ఆలయ సిబ్బంది, భక్తులు ఫోటోలు దిగారు. ఆమె వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు.

టీటీకే ప్రెస్టీజ్ ఎమిరిటస్ చైర్మన్

టీటీ జగన్నాథన్ కన్నుమూత



న్యూఢిల్లీ: కిచెన్ మొఘల్‌గా సుప్రసిద్ధుడైన టీటీకే ప్రెస్టీజ్ ఎమిరిటస్ చైర్మన్ టీటీ జగన్నాథన్ శుక్రవారం బెంగళూరులో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 77 సంవత్సరాలు. ఆయన చెన్నై ఐఐటీ గోల్డ్ మెడలిస్ట్ కావడమే కాకుండా కార్నెల్ యూనివర్శిటీ డాక్టరేట్ కూడా పొందారు. గత 50 సంవత్సరాలుగా ఆయన తన తాత, మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి టీటీ కృష్ణమాచారి స్థాపించిన టీటీకే ప్రెస్టీజ్ కంపెనీ బోర్డులో ఉన్నారు. 1975లో టీటీకే ప్రెస్టీజ్ ఎండీగా బాధ్యతలు చేపట్టిన జగన్నాథన్ 2000 సంవత్సరం వరకు అదే పదవిలో కొనసాగారు. ఆ తర్వాత 2019 వరకు ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఉన్నారు. అనంతరం నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్/చైర్మన్‌గా కొనసాగారు. ఈ ఏడాది మార్చి 25న చైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దివాలా దశలో ఉన్న టీటీకే ప్రెస్టీజ్ కంపెనీని బిలియన్ డాలర్ కంపెనీగా తీర్చిదిద్దటంలో జగన్నాథన్ కీలక పాత్ర పోషించారు. ఆయన సారథ్యంలో కంపెనీ విభిన్న ఉత్పత్తులను మార్కెట్లోకి ప్రవేశపెట్టడం ద్వారా చిన్న గృహోపకరణాల విభాగంలో అగ్రగామిగా నిలిచింది.

ఈక్విటీల కంటే బంగారమే ముద్దు



దేశంలో **34,600** టన్నుల పసిడి

- విలువ రూ.335.69 లక్షల కోట్లు
- ఈక్విటీ పెట్టుబడుల కంటే 3.1 రెట్లు అధికం
- జీడీపీలో పసిడి విలువ 88.8 శాతం

న్యూఢిల్లీ: మన దేశంలో పసిడి నిల్వలు ఏటేటా పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది జూన్ నెలాఖరు నాటికి మన దేశంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), ప్రజల వద్ద 34,600 టన్నుల పసిడి నిల్వలు ఉన్నట్టు అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ ఒక నివేదికలో తెలిపింది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం చూస్తే దీని విలువ 3,78,500 కోట్ల డాలర్లు. రూపాయల్లో చెప్పాలంటే ఇది దాదాపు రూ.335.69 లక్షల కోట్లకు సమానం. ప్రస్తుతం భారత కుటుంబాలు ఈక్విటీ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసిన 1,18,500 కోట్ల డాలర్ల కంటే ఇది 3.1 రెట్లు ఎక్కువ. జీడీపీపరంగా చూసినా పసిడి విలువ ప్రస్తుత జీడీపీలో 88.8 శాతం వరకు ఉంటుందని మోర్గాన్ స్టాన్లీ నివేదిక తెలిపింది.

వినియోగంలో రెండో స్థానం: ప్రస్తుతం ప్రపంచ పసిడి డిమాండ్‌లో చైనా తర్వాత మన దేశం రెండో స్థానంలో ఉంది. గత ఐదేళ్ల డేటాను పరిశీలిస్తే ప్రపంచ వార్షిక పసిడి కొనుగోళ్లలో చైనా 28 శాతం కొనుగోలు చేస్తుంటే, మన దేశం 26 శాతం వరకు కొనుగోలు చేస్తోందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) ఒక నివేదికలో తెలిపింది. మన దేశంలో పసిడి నిల్వలు పెద్దగా లేవు. దీంతో దేశ అవసరాల్లో దాదాపు 99 శాతానికి దిగుమతులే దిక్కు. భారత్ ఎంత లేదన్నా ఏటా 750 నుంచి 840 టన్నుల పసిడిని దిగుమతి చేసుకుంటోంది.

కారణాలు: మన దేశంలో పండగొచ్చినా, పబ్బమొచ్చినా చిన్నమెత్తు బంగారమైనా లేకుండా ఏ కార్యక్రమమూ పూర్తి కాదు. ఇక ధనత్రయోదశి రోజైతే బంగారం షాపులన్నీ కిటకిటలాడుతుంటాయి. ధర ఎంత పెరిగినా, తాహతుకు తగ్గట్టు కొద్దో గొప్పో బంగారం కొని పెట్టుకోవడం మధ్య, సంపన్న వర్గాల సంప్రదాయం. దీనికి తోడు ఇటీవల పెట్టుబడి లాభాల కోసం బంగారం కొని పెట్టుకునే వారి సంఖ్యా పెరిగి పోయింది. ప్రస్తుతం దేశంలో అమ్ముడయ్యే బంగారంలో 30 శాతం బిస్కెట్లు, కడ్డీలు, నాణేల రూపంలో అమ్ముడవుతోంది. వీటిని కొనేవారిలో ఎక్కువ మంది పెట్టుబడి లాభాల కోసం కొనేవారే. ఆర్థిక అనిశ్చితి, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, స్టాక్ మార్కెట్ ఆటుపోట్లు, ద్రవ్యోల్బణం కూడా చాలా మంది ఇన్వెస్టర్లను పసిడి వైపు చూసేలా చేస్తున్నాయి.

బంగారం రుణ మార్కెట్ రూ.15 లక్షల కోట్లు..

దేశంలో పసిడి నిల్వలతో పాటు బంగారాన్ని కుదువ పెట్టుకుని అప్పులిచ్చే మార్కెట్ కూడా పెరిగిపోతోంది. వచ్చే ఏడాది మార్చి నాటికి సంఘటిత రంగంలోని ఈ మార్కెట్ రూ.15 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఇక్రా రేటింగ్ సంస్థ అంచనా. గతంలో అంచనా వేసిన దాని కంటే ఇది ఒక ఏడాది తక్కువ. 2027 మార్చి నాటికి ఇది మరింత విస్తరించి రూ.18 లక్షల కోట్ల స్థాయికి చేరే అవకాశం ఉందని తెలిపింది. రేసు గుర్రంలా పరుగెడుతున్న బంగారం ధరను దృష్టిలో ఉంచుకుని గత ఏడాది సెప్టెంబరులో విడుదల చేసిన తమ అంచనాలను సవరిస్తున్నట్టు ఇక్రా తెలిపింది.

బ్యాంకులదే అగ్రస్థానం: రుణాలివ్వటంలో బ్యాంకింగేతర ఆర్థికేతర సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లతో పోలిస్తే బ్యాంకులు ముందున్నాయి. 2020-25 మధ్య కాలంలో సంఘటిత రంగంలోని ఎన్‌బీఎఫ్‌సీల పసిడి రుణాల మార్కెట్ ఏటా సగటున 20 శాతం చొప్పున పెరిగితే, బ్యాంకుల పసిడి రుణాల వితరణ 26 శాతం చొప్పున పెరిగింది. దీంతో ఈ ఏడాది మార్చి నాటికి పసిడి రుణాల మార్కెట్ రూ.11.8 లక్షల కోట్లు ఉంటే, అందులో బ్యాంకుల వాటా 82 శాతానికి చేరినట్టు ఇక్రా తెలిపింది.

గోల్డ్ ఈటీఎఫ్‌లు జిగేల్

సెప్టెంబరు లో రూ.8,363 కోట్ల పెట్టుబడులు

రూ.90,000 కోట్లకు గోల్డ్ ఈటీఎఫ్‌ల ఏయూఎం

న్యూఢిల్లీ: బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఎగబాకుతున్న నేపథ్యంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్)లోకి భారీగా నిధులు వచ్చాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ ఏడాది సెప్టెంబరులో ఇన్వెస్టర్లు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో కొత్తగా రూ.8,363 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వీటిలోకి వచ్చిన అత్యధిక నెలవారీ పెట్టుబడులివి. ఈ ఆగస్టులో నమోదైన రూ.2,190 కోట్లతో పోలిస్తే గత నెలలో దాదాపు నాలుగు రెట్ల పెట్టుబడులు వచ్చాయి. దీంతో గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం ఆస్తులు విలువ రూ.90,000 కోట్ల మైలురాయిని దాటింది. వీటితో పాటు ఈక్విటీ, బాండ్లు, గోల్డ్ ఇలా భిన్న ఆస్తుల్లో పెట్టుబడులకు వీలుండే మల్టీ అసెట్ ఫండ్లలోకి గత నెలలో రికార్డు స్థాయిలో రూ.5,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

ఇక ప్రైవేట్ రంగం నుంచి పీఎస్‌బీ సారథులు

న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సహా ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల అత్యున్నత శ్రేణి మేనేజ్‌మెంట్ హోదాల్లో ప్రైవేట్ రంగంలోని ప్రతిభావంతులను నియమించుకునేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఇప్పటికే ఎస్‌బీఐలోని నలుగురు మేనేజింగ్ డైరెక్టర్లలో ఒక పోస్టును ప్రైవేట్ రంగానికి కేటాయించారు. ఇప్పటివరకు పీఎస్‌బీల ఎండీ, చైర్మన్ పదవులన్నింటికీ అంతర్గతంగా ఉన్న అర్హులైన అభ్యర్థులనే నియమిస్తూ వచ్చారు. ప్రస్తుతం దేశంలో ఎస్‌బీఐ సహా 11 పీఎస్‌బీలున్నాయి. సవరించిన నియామక మార్గదర్శకాల ప్రకారం ఇక నుంచి ఈ పదవులకు పోటీ చేసేందుకు ప్రైవేట్ రంగంలోని అభ్యర్థులను అనుమతించనున్నారు.

ఇక దేశవ్యాప్తంగా కార్నివాల్స్: శ్రేయాస్ మీడియా

హైదరాబాద్: ఇటీవల దసరా సందర్భంగా విజయవాడ ఉత్సవ్ పేరుతో నిర్వహించిన ఈవెంట్ గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కటమే కాకుండా అంతర్జాతీయంగా అందరి దృష్టిని ఆకర్షించిందని శ్రేయాస్ మీడియా వెల్లడించింది. విజయవాడ కార్నివాల్ విజయవంతం కావటంతో ఇక దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరుపుకునే పండగలకు ఇదే తరహా ఉత్సవాలను నిర్వహించాలని చూస్తున్నట్లు శ్రేయాస్ మీడియా వ్యవస్థాపకుడు గండ్ర శ్రీనివాస్ రావు తెలిపారు. అంతేకాకుండా విజయవాడ ఉత్సవ్ తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక ప్రాంతాలైన అరకు, గండికోట వంటి వాటిల్లో కార్నివాల్స్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. విశాఖపట్నం, తిరుపతి, విజయవాడల్లో నూతన సంవత్సరం, సంక్రాంతి ఉత్సవాలను కూడా నిర్వహించనున్నట్లు తెలిపింది.

15 నుంచి మిడ్‌వెస్ట్ ఐపీఓ

ఇష్యూ ధరల శ్రేణి రూ.1,014-1,065

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణకు చెందిన గ్రానైట్ కంపెనీ మిడ్‌వెస్ట్ లిమిటెడ్ రూ.451 కోట్ల తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 15న ప్రారంభమై 17న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.1,014-1,065గా నిర్ణయించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.250 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతో పాటు రూ.201 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. ఈ నెల 24న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది. తాజా ఈక్విటీ జారీ ద్వారా లభించనున్న నిధుల్లో రూ.130.3 కోట్లను తన అనుబంధ విభాగమైన మిడ్‌వెస్ట్ నియోస్టోన్ క్వార్ట్ రెండో దశ విస్తరణ కోసం ఉపయోగించుకోనున్నట్లు మిడ్‌వెస్ట్ తెలిపింది. మరో రూ.25.7 కోట్లను ఎలక్ట్రిక్ డంప్ ట్రక్కుల కోసం, రూ.3.2 కోట్లను కొన్ని గనుల్లో సోలార్ ఇంధన అనుసంధానం కోసం వినియోగించుకోనుంది. కాగా, రూ.56.2 కోట్లను రుణాల తిరిగి చెల్లింపు కోసం, మిగతా సొమ్మును వ్యాపార అవసరాల కోసం ఉపయోగించుకోనున్నట్లు కంపెనీ పేర్కొంది. మిడ్‌వెస్ట్ తెలంగాణ, ఏపీలో 16 గ్రానైట్ గనులను నిర్వహిస్తోంది. అత్యంత ఖరీదైన బ్లాక్ గెలాక్సీ గ్రానైట్, బ్లాక్ గ్రానైట్‌ను ఉత్పత్తి చేస్తోంది సంస్థ.

సెన్సెక్స్ 329 పాయింట్లు అప్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా రెండో రోజు లాభపడ్డాయి. ఫార్మా, బ్యాంకింగ్ షేర్ల ర్యాలీతో పాటు విదేశీ సంస్థాగత పెట్టుబడులతో సెన్సెక్స్ శుక్రవారం 328.72 పాయింట్ల వృద్ధితో 82,500.82 వద్ద స్థిరపడింది. ఒక దశలో సూచీ 482 పాయింట్లు ఎగబాకి 82,654 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, 103.55 పాయింట్ల లాభంతో 25,285.35 వద్ద ముగిసింది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య సంధి కుదరడంతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కాస్త తగ్గుముఖం పట్టడంతో పాటు అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం విషయంలో కొంత పురోగతి కన్పించడం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచిందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	114
కరీంనగర్	102	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	90
కర్నూలు	102	నెల్లూరు	95
విశాఖపట్నం	127	అనంతపురం	95
గోదావరి	119		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,290 ▼	1,12,100 ▼	1,71,000 ▲
విజయవాడ	1,25,000 ▼	1,19,000 ▼	1,69,500 ▲
విశాఖపట్నం	1,25,000 ▼	1,13,800 ▼	1,84,000 ▲
రాజమండ్రి	1,23,710 ▼	1,13,400 ▼	1,72,000 ▲
ప్రొద్దుటూరు	1,27,500 ▼	1,17,300 ▼	1,68,000 ▲
ముంబై	1,21,525 ▼	1,11,317 ▼	1,64,500 ▲

టాటా సన్స్ లిస్టింగ్ జరగాల్సిందే

అప్పుడే ట్రస్ట్స్ ఇంటి పోరుకు ఫుల్ స్టాప్

ఎస్‌పీ గ్రూప్ చైర్మన్ ఎస్‌పీ మిస్త్రీ

న్యూఢిల్లీ: టాటా ట్రస్ట్స్ బోర్డు మీటింగ్ వాడి వేడిగా జరిగినట్లు సమాచారం. శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో టాటా గ్రూప్ కంపెనీల మాతృ సంస్థ టాటా సన్స్ షేర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాల్సిందేనని షాపూర్జీ పల్లోంజీ (ఎస్‌పీ) గ్రూప్ పట్టుబట్టింది. దీనికి సంబంధించి ఎస్‌పీ గ్రూప్ చైర్మన్ షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ ఒక ప్రకటన విడుదల చేశారు. షేర్లను లిస్ట్ చేస్తేనే టాటా సన్స్ ఈక్విటీలో 66 శాతం వాటా ఉన్న టాటా ట్రస్ట్స్ ట్రస్టీల ఇంటి పోరుకు తెరపడి, కంపెనీ నిర్వహణలో పూర్తి పారదర్శకత ఏర్పడుతుందని ఆయన స్పష్టం చేశారు. టాటా సన్స్ ఈక్విటీలో ఎస్‌పీ గ్రూప్ 18.37 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుగా ఉంది. ఈ నేపథ్యంలో ఎస్‌పీ మిస్త్రీ చేసిన ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్‌బీఐ ఆదేశించినా గత నెలాఖరులోగా టాటా సన్స్ కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయించలేకపోవడంపైనా మిస్త్రీ ఈ సమావేశంలో ట్రస్టీలను నిలదీసినట్టు సమాచారం. ఇప్పటికైనా వీలైనంత త్వరగా టాటా సన్స్ లిస్టింగ్ పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ చర్య టాటా గ్రూప్ లిస్టెడ్ కంపెనీల్లో వాటాలు ఉన్న 1.2 కోట్ల మంది వాటాదారులకూ మేలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. టాటా ట్రస్ట్స్ ట్రస్టీల ఇంటిపోరుతో చైర్మన్ నోయెల్ టాటా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్ కూడా ఇటీవల జరిగిన భేటీలో టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌లను నిలదీసినట్టు సమాచారం. ఈ ఇంటిపోరు ముదిరితే దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానంలో ఉన్న టాటా గ్రూప్ కంపెనీల పనితీరుపైనా ప్రభావం పడుతుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	540
వరంగల్	522	గోదావరి	525
చిత్తూరు	538	విశాఖపట్నం	515
		దజను గుడ్లు రూ.	72

స్పోర్ట్స్


బ్రూక్ (69)

నేటి మ్యాచ్ — శ్రీలంక X ఇంగ్లండ్ — మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో

బోణీ కొట్టిన కివీస్

- బంగ్లాదేశ్‌పై గెలుపు
- మహిళల వరల్డ్‌కప్

గువాహటి: న్యూజిలాండ్ మహిళలు వన్డే ప్రపంచ కప్‌లో ఎట్టకేలకు ప్రపంచ కప్‌లో బోణీ చేశారు. తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయం చవిచూసిన కివీస్.. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 100 పరుగులతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. మొదట న్యూజిలాండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 227 పరుగులు చేసింది. బ్రూక్ (69), కెప్టెన్ సోఫీ డివైన్ (63) హాఫ్ సెంచరీలతో ఆదుకున్నారు. నాలుగో వికెట్‌కు వీరిద్దరు 112 పరుగులు జోడించడంతో న్యూజిలాండ్ తేరుకుంది. ఛేదనలో కివీస్ బౌలర్ల ధాటికి బంగ్లాదేశ్ 39.5 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. ఫహీమా ఖాతూన్ (34) టాప్ స్కోరర్. రబేయా ఖాన్ (25), నహీదా అక్తర్ (17) మోస్తరుగా ఆడారు. బంగ్లా ఇన్నింగ్స్‌లో రెండో అత్యధిక స్కోరు ఎక్స్‌ట్రాల (30)దే కావడం గమనార్హం.

సంక్షిప్తస్కోర్లు: న్యూజిలాండ్: 50 ఓవర్లలో 227/9 (బ్రూక్ హలిడే 69, సోఫీ డివైన్ 63, సుజీ బేట్స్ 29, రబేయా ఖాన్ 3/30); **బంగ్లాదేశ్:** 39.5 ఓవర్లలో 127 ఆలౌట్ (ఫహీమా ఖాతూన్ 34, రబేయా ఖాన్ 25, నహీదా అక్తర్ 17, జెస్ కెర్ 3/21, లియా తహుహు 3/22, రోస్‌మేరీ 2/20).

సింధు మూడోసారి..

బీడబ్ల్యూఎఫ్ అథ్లెట్ల కమిషన్‌లో చోటు



న్యూఢిల్లీ: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) అథ్లెట్ల కమిషన్‌లో మూడోసారి చోటు దక్కించుకుంది. నవంబరు 2025-నవంబరు 2029 కాలానికిగాను బీడబ్ల్యూఎఫ్ శుక్రవారం ప్రకటించిన నూతన సభ్యుల జాబితాలో మరోసారి సింధు పేరును చేర్చారు. తొలిసారిగా 2017లో ఈ కమిషన్‌కు ఎంపికైన సింధు.. ఆ తర్వాత 2021లో రెండోసారి స్థానం దక్కించుకున్న విషయం తెలిసిందే.

హైదరాబాద్ పరాజయం

హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ఆతిథ్య హైదరాబాద్ బ్లాక్‌హాక్స్‌కు ఓటమి ఎదురైంది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ తూఫాన్స్ 15-10, 16-14, 17-15తో హైదరాబాద్‌పై నెగ్గింది. మరో మ్యాచ్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్ 12-15, 15-12, 15-12, 16-14తో డిఫెండింగ్ చాంపియన్స్ కాలికట్ హీరోస్‌కు షాకిచ్చింది.

అక్షిత్ మెరిసె.. ఢిల్లీ గెలిచె

చెన్నై: అక్షిత్ ధుల్ సూపర్ 10తో మెరవడంతో ప్రొ.కబడ్డీ లీగ్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ గెలుపొందింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో ఢిల్లీ 39-33తో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో యు ముంబా 48-29తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

కాంస్యంతో సరి

సెమీస్‌లో భారత్ ఓటమి

జూ. ప్రపంచ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్

గువాహటి: బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ల జైత్రయాత్రకు తెరపడింది. సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఇండోనేసియా చేతిలో ఓటమిపాలై కాంస్యంతో సరిపెట్టుకున్నారు. శుక్రవారం జరిగిన సెమీస్‌లో భారత్ 35-45, 21-45తో పరాజయం పాలైంది. కాంస్యానికి పరిమితమైనా.. ఈ మెగా టోర్నీలో పతకం దక్కడం భారత్‌కు ఇదే తొలిసారి కావడం విశేషం.

గదిలో పెట్టి తాళం వేశాడు

ఆసియా'కప్'పై నఖ్వీ తీరు

దుబాయ్: ఆసియాకప్‌లో విజేతగా నిలిచి రెండు వారాలైనప్పటికీ భారత టీ20 జట్టుకు ఇప్పటిదాకా ట్రోఫీ దక్కలేదు. పాక్‌పై ఫైనల్లో గెలిచాక ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ మొహిసిన్ నఖ్వీ నుంచి తాము ఆ ట్రోఫీ అందుకునేది లేదని కెప్టెన్ సూర్యకుమార్ తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. దీంతో నఖ్వీ వేదికపైనుంచే కప్‌ను తీసుకెళ్లిపోయాడు. తాజా సమాచారం ప్రకారం దాన్ని దుబాయ్‌లోని తన ఏసీసీ ప్రధాన కార్యాలయంలో పెట్టి గదికి తాళం వేశాడట. 'ఇప్పటికీ ట్రోఫీ ఆ ఆఫీస్‌లోనే ఉంది. తన అనుమతి లేకుండా ఆ ట్రోఫీని ఎట్టి పరిస్థితిలో తీయకూడదని, అలాగే ఎవరికీ ఇవ్వకూడదని మాకు ఆదేశాలున్నాయి. ఒకవేళ ఇవ్వాల్సి వస్తే ఎప్పటికైనా దాన్ని స్వయంగా తానే బీసీసీఐకి కానీ భారత జట్టుకు కానీ ఇస్తానని నఖ్వీ తెలిపాడు' అని ఏసీసీ వర్గాలు పేర్కొన్నాయి.

కాస్పరోవ్ ఆధిక్యం మరింత..

ఆనంద్‌తో లెజెండ్స్ క్లచ్ చెస్

సెయింట్ లూయిస్ (అమెరికా): భారత దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్‌తో లెజెండ్స్ క్లచ్ చెస్ టోర్నీలో రష్యా జీఎం గ్యారీ కాస్పరోవ్ తన ఆధిక్యాన్ని మరింత పెంచుకున్నాడు. రెండో రోజు జరిగిన నాలుగు గేమ్‌లలో రెండింటిలో కాస్పరోవ్ విజయం సాధించాడు. మరో రెండు గేమ్‌లు డ్రాగా ముగిశాయి. రెండో రోజు నాలుగు గేమ్‌ల్లో 6-2 ఆధిక్యంతో నిలిచిన గ్యారీ.. మొత్తం ఎనిమిది గేమ్‌ల తర్వాత 8.5-3.5తో ముందంజలో నిలిచాడు. మూడో.. చివరి రోజు మరో నాలుగు గేమ్‌లు జరగనున్నాయి.

శతక జైస్వాల్



రాణించిన సాయి సుదర్శన్

భారత్ తొలి ఇన్నింగ్స్ 318/2

వెస్టిండీస్‌తో రెండో టెస్టు

న్యూఢిల్లీ: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులోనూ భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (173 బ్యాటింగ్) తన అసాధారణ బ్యాటింగ్ నైపుణ్యంతో డబుల్ సెంచరీ వైపు సాగుతుండగా.. అటు సాయి సుదర్శన్ (87) అర్ధసెంచరీతో ఫామ్‌ను అందుకున్నాడు. దీంతో తొలి రోజు శుక్రవారమే భారత్ పూర్తి పట్టు సాధించింది. తద్వారా ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 318/2 భారీ స్కోరుతో నిలిచింది. క్రీజులో యశస్వీకి జతగా గిల్ (20 బ్యాటింగ్) ఉన్నాడు. స్పిన్నర్ జోమెల్ వారికన్‌కు రెండు వికెట్లు దక్కాయి. మరోవైపు విండీస్ బౌలర్లు తొలి రోజు ఆటలో ఒక్క ఎక్స్‌ట్రా రన్ ఇవ్వకపోవడం విశేషం.

ఆరంభంలో ఆచితూచి..: కెప్టెన్‌గా మొదటిసారి టాస్ గెలిచిన గిల్ వెంటనే బ్యాటింగ్‌ను ఎంచుకున్నాడు. అయితే కొత్త బంతిని ఎదుర్కొన్న ఓపెనర్లు జైస్వాల్, రాహుల్ తొలి గంటపాటు నిదానంగా ఆడారు. వారెదుర్కొన్న మొదటి 72 బంతుల్లో 60 డాట్ బాల్స్ ఉండడం గమనార్హం. దీంతో డ్రింక్స్ విరామానికి జట్టు స్కోరు 29/0గానే ఉంది. పేసర్ ఫిలిప్ చక్కటి సీమ్‌తో ఓపెనర్లను ఇబ్బందిపెట్టాడు. కానీ బ్రేక్ తర్వాత స్ట్రయిక్‌ను రొటేట్ చేసుకుంటూ, చెత్త బంతులను ఫోర్లుగా మలుస్తూ చకచకా పరుగులు రాబట్టారు. 17వ ఓవర్లో సిక్సర్‌తో జోరు మీదున్న రాహుల్ (38)ను.. స్పిన్నర్ వారికన్ తన తొలి ఓవర్‌లోనే స్టంపౌట్‌గా పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో మొదటి వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఎదుర్కొన్న మొదటి బంతినే ఫోర్‌గా మలిచిన సాయి సుదర్శన్‌తో కలిసి జైస్వాల్ మరో వికెట్ పడకుండా తొలి సెషన్‌ను 94/1 స్కోరుతో ముగించాడు.

యశస్వీ-సాయి శతక భాగస్వామ్యం: రెండో సెషన్‌లో పూర్తిగా భారత్ ఆధిపత్యం సాగింది. పిచ్ బ్యాటింగ్‌కు సహకరించడంతో ఇద్దరు లెఫ్ట్‌హ్యాండర్లు జైస్వాల్-సుదర్శన్ శతక భాగస్వామ్యాన్ని అందించారు. తొలి గంటపాటు వీరి దూకుడుకు ఓవర్‌కు ఆరు పరుగుల రన్‌రేట్‌తో స్కోరు దూసుకెళ్లింది. లంచ్ విరామం తర్వాత జైస్వాల్ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. విండీస్ బౌలర్లు ఈ జోడీని విడదీసేందుకు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో సాయి కెరీర్‌లో రెండో అర్ధసెంచరీకి చేరుకున్నాడు. అటు తొలి టెస్టులో భారీ స్కోరు అందుకోలేకపోయిన జైస్వాల్ ఈసారి పట్టుదలగా ఆడి కెరీర్‌లో ఏడో శతకం సాధించాడు. అయితే సాయి 58 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను మిడ్ వికెట్‌లో వారికన్ పట్టుకోలేకపోయాడు. రెండో వికెట్‌కు అజేయంగా 162 పరుగులు జోడించాక ఇద్దరూ టీ బ్రేక్‌కు వెళ్లారు.


సాయి సుదర్శన్ (87)

సాయి శతకం మిస్: ఆఖరి సెషన్‌లో బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో భారత్ ఆటలో కాస్త వేగం తగ్గింది. ఇక ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేస్తున్న సాయి సుదర్శన్ కెరీర్‌లో తొలి సెంచరీ చేయడం ఖాయమనిపించింది. కానీ వారికన్ అతడిని దెబ్బతీశాడు. అటు అంపైర్ ఎల్బీ నిర్ణయంపై సాయి రివ్యూ కోరినా ఫలితం లేకపోయింది. రీప్లేలో బంతి లెగ్ స్టంప్‌ను తాకుతున్నట్టుగా తేలడంతో సెంచరీకి 13 రన్స్ దూరంలో సుదర్శన్ పెవిలియన్ చేరాడు. దీంతో రెండో వికెట్‌కు 193 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్లాస్ ఇన్నింగ్స్‌తో జైస్వాల్ ఐదోసారి టెస్టుల్లో 150 రన్స్‌ను పూర్తి చేశాడు. గిల్ కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడడంతో.. తొలిరోజు ఆటను భారత్ మెరుగ్గా ముగించింది.

4 అతి పిన్న వయస్సులోనే (23) టెస్టుల్లో 7 శతకాలు బాదిన నాలుగో ప్లేయర్‌గా జైస్వాల్. బ్రాడ్‌మన్ (12), సచిన్ (8), సోబర్స్ (9) ముందున్నారు. మియాందాద్, గ్రేమ్ స్మిత్, విలియమ్సన్, కుక్ కూడా ఏడు సెంచరీలతో ఉన్నారు. అలాగే జైస్వాల్ శతకాల్లో ఐదు 150+ స్కోర్లు ఉండడం విశేషం. బ్రాడ్‌మన్ మాత్రమే ఈ వయస్సులో ఎక్కువ సార్లు (8) ఈ ఫీట్ సాధించాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వీ జైస్వాల్ (బ్యాటింగ్) 173, రాహుల్ (స్టంప్) ఇమ్లాచ్ (బి) వారికన్ 38, సాయి సుదర్శన్ (ఎల్బీ) వారికన్ 87, గిల్ (బ్యాటింగ్) 20; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 90 ఓవర్లలో 318/2; వికెట్ల పతనం:** 1-58, 2-251; **బౌలింగ్:** సీల్స్ 16-1-59-0; ఫిలిప్ 13-2-44-0; గ్రీవ్స్ 8-1-26-0; పియర్ 20-1-74-0; వారికన్ 20-3-60-2; చేజ్ 13-0-55-0.

తొలి రోజు ఆఖరి సెషన్‌లో కెప్టెన్ గిల్ రెండో పరుగు తీసే క్రమంలో విండీస్ కీపర్ టెవిన్ ఇమ్లాచ్ బలంగా ఢీకొన్నాడు. గిల్ హెల్మెట్ కీపర్ ఛాతీకి బలంగా తాకడంతో ఇద్దరూ కిందపడిపోయారు. దీంతో మైదానంలో కాసేపు ఆందోళన నెలకొంది. వెంటనే ఇరు జట్ల ఫిజియోలు వచ్చి ఆటగాళ్లను పరీక్షించారు. గిల్ హెల్మెట్ తీసి కాసేపు తల పట్టుకుని కూర్చున్నాడు. అతడిని ఫిజియో చెక్ చేశాక జైస్వాల్.. తన రెండు వేళ్లను గిల్‌కు చూపుతూ ఇవెన్ని ఉన్నాయంటూ కంకషన్ టెస్టు చేసినట్టుగా ఆటపట్టించాడు. అటు గిల్ కూడా సరదాగా నవ్వుకోవడం కనిపించింది. మరోవైపు జైస్వాల్ సూపర్ ఇన్నింగ్స్‌తో అరుణ్ జైట్లీ స్టేడియంలోని ప్రేక్షకులు ఫిదా అయ్యారు. దీంతో అప్పటిదాకా 'కోహ్లీ.. కోహ్లీ' అంటూ అరిచిన అభిమానులు.. 'జైస్వాల్.. జైస్వాల్' అనే నామస్మరణతో హోరెత్తించారు.

మోహిత్ మీట్ రికార్డ్

స్వర్ణం కైవసం — జాతీయ జూనియర్ అథ్లెటిక్స్


మోహిత్

భువనేశ్వర్: తెలంగాణకు చెందిన మోహిత్ చౌదరి జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. శుక్రవారం ఇక్కడ ప్రారంభమైన మీట్‌లోని అండర్-20 పురుషుల 5వేల మీటర్ల పరుగులో మోహిత్ 14 నిమిషాల 09.71 సెకన్ల రికార్డ్‌తో గమ్యం చేరి అగ్రస్థానంలో నిలిచాడు. దాంతో 14 ని 12.67సె. గత రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా 11 ఏళ్ల రికార్డును హిమాంశు జాఖర్ బద్దలుగొట్టాడు. హరియాణాకు చెందిన హిమాంశు జావెలిన్ త్రో అండర్-18 విభాగంలో 79.96 మీ. దూరంతో సరికొత్త జాతీయ రికార్డుతో స్వర్ణం నెగ్గాడు. దాంతో 2014లో నీరజ్ 76.50 మీ. దూరంతో నెలకొల్పిన రికార్డు కనుమరుగైంది.

బలమైన ప్రదర్శన చేయాలని..

తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఢీ

జూ. జొహార్ కప్ హాకీ నేటి నుంచి

జొహార్ బహ్రు (మలేసియా): రానున్న జూనియర్ హాకీ ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని.. యువ భారత జట్టు శనివారం నుంచి జరిగే జూనియర్ సుల్తాన్ జొహార్ కప్‌లో బలమైన ప్రదర్శన చేయాలన్న పట్టుదలతో బరిలోకి దిగుతోంది. తొలిరోజు పోటీలో భాగంగా ఇంగ్లండ్‌తో భారత్ తన ఆరంభ మ్యాచ్‌ను ఆడనుంది. ఈ ఈవెంట్‌లో సత్తా చాటి వచ్చేనెల 28 నుంచి చెన్నైలో జరిగే ప్రపంచ కప్‌కు మరింత ఉత్సాహంతో పోటీపడాలనుకుంటోంది. భారత్.. ఈనెల 12న న్యూజిలాండ్‌తో, 14న పాకిస్థాన్‌తో, 15న ఆస్ట్రేలియాతో, 17న ఆతిథ్య మలేసియాతో తలపడనుంది. 18న ఫైనల్ జరగనుంది.

కిలోల్లో బంగారం.. టన్నుల్లో తేనె!

» భోపాల్‌లో మాజీ చీఫ్ ఇంజనీర్ వద్ద భారీ ఆస్తులు

» 2.64 కిలోల పసిడి, 36 లక్షల నగదు స్వాధీనం

భోపాల్, అక్టోబరు 10: సోదాలు నిర్వహించిన అధికారులే నోరెళ్లబెట్టేలా ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగి ఇళ్లలో భారీగా నోట్ల కట్టలు.. కిలోల కొద్దీ బంగారం బయటపడింది. అంతేనా.. బయట అత్యంత విలాసవంతమైన కార్లు పార్క్‌చేసి ఉన్నాయి. ఆయనగారి వ్యవసాయ క్షేత్రంలోకి వెళితే ఏడు కాటేజీలు, నిర్మాణంలో ఉన్న మరో 32 కాటేజీలు కనిపించాయి. భారీ చేపల చెరువు కనిపించింది. టన్నులకొద్దీ నిల్వ చేసిన తేనె లభ్యమైంది. ఇదంతా మధ్యప్రదేశ్‌లో జీపీ మెహ్రా అనే ప్రజా పనుల విభాగం (పీడబ్ల్యూడీ) రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కూడబెట్టిన సంపద! ఇది తమ ఊహకు అందనంత విలువైన సొత్తు అని సోదాలు నిర్వహించిన లోకాయుక్త అధికారులు వెల్లడించారు. నలుగురు డీఎస్పీ ర్యాంకు అధికారుల నేతృత్వంలోని బృందాలు శుక్రవారం తెల్లవారుజామున భోపాల్, నర్మదాపురంలో మెహ్రాకు సంబంధించిన నాలుగు స్థావరాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. మణిపురం కాలనీలోని మెహ్రా నివాసంలో రూ.8.79 లక్షల నగదు, రూ.50 లక్షల విలువైన బంగారు నగలు, రూ.56 లక్షల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లను సీజ్ చేశారు. దనాపానీలో ఆయన లగ్జరీ ఫ్లాట్‌లో రూ.26 లక్షల నగదు, రూ.3.05 కోట్ల విలువైన 2.6 కిలోల బంగారం, 5.5 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. సోహగ్‌పూర్‌లోని ఆయన ఫామ్‌హౌస్‌లో మెహ్రా వైభోగం చూసి అధికారులు ఆశ్చర్యపోయారు. ఆ ఫామ్‌హౌస్‌లో ప్రత్యేకంగా ఓ గోశాల, ఓ ఆలయాన్ని నిర్మించారు. అలాగే మెహ్రా వ్యాపార సంస్థగా భావిస్తున్న గోవిందాపురలోని కేటీ ఇండస్ట్రీస్‌పైనా లోకాయుక్త అధికారులు దాడులు నిర్వహించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా రూ.36.04 లక్షల నగదు, 2.64 కిలోల బంగారం, 5.52 కిలోల వెండి, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఇన్సూరెన్స్‌కు సంబంధించిన పత్రాలు సీజ్ చేశారు.



ఆ ఎమ్మెల్యే లాకర్లలో 40 కిలోల పసిడి!

(మొదటి పేజీ తరువాయి)

భారీగా అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ కుంభకోణం జరిగిందని.. పలు బెట్టింగ్ యాప్‌ల ద్వారా అమాయకులను మోసం చేశారంటూ ఆయనపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ మేరకు బెంగళూరుకు చెందిన ఈడీ బృందం శుక్రవారం చల్లెకెరెలోని ఫెడరల్ బ్యాంకులో వీరేంద్రకు సంబంధించిన రెండు లాకర్లలోంచి 40 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకుంది. ఇప్పటికే ఆయన్నుంచి 21 కిలోల బంగారు బిస్కెట్లు సహా నగదు, డిపాజిట్లు, లగ్జరీ కార్ల రూపంలో రూ.103 కోట్ల సొత్తును అధికారులు సీజ్ చేశారు. తాజా దాడులతో వీరేంద్రకు సంబంధించి రూ.150 కోట్లకు పైగానే సొత్తును సీజ్ చేసినట్లయిందని అధికారులు వెల్లడించారు. వీరేంద్ర కుటుంబసభ్యులు, ఆయన బంధువులు, సన్నిహితులు బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. అక్రమంగా సంపాదించిన సొమ్మును విదేశీ బ్యాంకుల్లో డిపాజిట్ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన తమ్ముడు కేసీ తిప్పేస్వామి, మరో వ్యక్తి పృథ్వీరాజ్ దుబాయ్‌లో పలు కాల్‌సెంటర్ల ద్వారా ఆన్‌లైన్ గేమింగ్ వ్యవహారాలు నడిపినట్లు గుర్తించారు. ఈ కార్యకలాపాలన్నీ ఎమ్మెల్యే వీరేంద్ర నియంత్రణలో జరిగాయని.. ఈ బెట్టింగ్ అప్లికేషన్ల టర్నోవర్ రూ.2వేల కోట్లకు పైగా ఉంటుందని వెల్లడించారు. మరోవైపు.. బిహార్ ఎన్నికల కోసం రూ.300 కోట్లు ఇస్తానని కాంగ్రెస్ అధిష్ఠానానికి ఎమ్మెల్యే వీరేంద్ర ఆఫర్ ఇచ్చారని కర్ణాటకలో విపక్ష నేత అశోక్ ఆరోపించారు. తాను చెల్లించే ఈ డబ్బుకు ప్రతిఫలంగా మంత్రి పదవి ఇవ్వాలని ఆయన కోరినట్లు తెలిసిందని పేర్కొన్నారు.

బిహార్‌లో ఎన్‌డీఏకు కాస్త ఆధిక్యం

» సీఎం అభ్యర్థిగా తేజస్వీ వైపు మొగ్గు: సీ-ఓటర్ సర్వే

న్యూఢిల్లీ, అక్టోబరు 10: బిహార్ అసెంబ్లీ ఎన్నికలపై నిర్వహించిన ఒపీనియన్ పోల్ ఫలితాలను సీ-ఓటర్ సంస్థ శుక్రవారం వెల్లడించింది. బీజేపీ-జేడీ(యూ)ల ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ కూటమికి కాస్త ఆధిక్యం లభించగా, సీఎం అభ్యర్థిగా మాత్రం ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ వైపు అత్యధికులు మొగ్గు చూపుతున్నట్టు ప్రకటించింది. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాన్ని నిలుపుకొనే అవకాశాలు 40శాతం ఉండగా, ఆర్జేడీ ఆధ్వర్యంలోని మహాగట్‌బంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు 38.3 శాతం మేర ఉన్నాయి. కొత్తగా ఏర్పాటయిన ప్రశాంత్ కిశోర్ ఆధ్వర్యంలోని జన్ సురాజ్ పార్టీ పట్ల కేవలం 13.3 శాతం మందే ఇష్టత ప్రదర్శించారు. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరయితే బాగుంటుందన్న ప్రశ్నకు భిన్నమైన సమాధానం వచ్చింది. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ పట్ల 36.5% మంది మొగ్గు చూపారు. ప్రశాంత్ కిషోర్‌కు 23.2% మంది, ప్రస్తుత ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు 15.9% మంది, చిరాగ్ పాసవాన్‌కు 8.8% మంది మద్దతు తెలిపారు.

ఒకేరోజు, ఒకే అంశంపై.. రెండు చోట్ల విచారణ చేపట్టడమా?

రెండు బెంచ్‌ల నుంచి విరుద్ధ ఆదేశాలా?

మద్రాస్ హైకోర్టుకు సుప్రీం ప్రశ్నలు

చెన్నై, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్ ప్రచారం సందర్భంగా ఇటీవల కరూర్‌లో జరిగిన తొక్కిసలాట వ్యవహారంపై మద్రాస్ హైకోర్టు రెండు బెంచ్‌లు చేపట్టిన విచారణల పట్ల సుప్రీంకోర్టు శుక్రవారం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఒకే అంశంపై, ఒకేరోజు హైకోర్టు రెండు చోట్ల ఎలా విచారణ చేపట్టిందని ప్రశ్నించింది. ఘటన కరూర్‌లో జరిగినందున హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ విచారణ చేపడుతుండగా, అదే అంశంపై మద్రాస్ హైకోర్టు సింగిల్ జడ్జి ఎలా విచారణ చేపట్టారని అడిగింది. రాజకీయ పార్టీలు ప్రచార సభ నిర్వహించేందుకు ప్రామాణిక నిబంధనలు రూపొందించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తే.. సింగిల్ జడ్జి ఆ అభ్యర్థనను దాటి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించింది.

మైక్రోసాఫ్ట్ సలహాదారుగా బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్

లండన్, అక్టోబరు 10: బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్.. అమెరికాకు చెందిన టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్, ఏఐ సంస్థ ఆంత్రోపిక్‌లకు సీనియర్ సలహాదారుగా వ్యవహరించనున్నారు. రిషి ఈ బాధ్యతలు చేపట్టేందుకు బ్రిటన్‌లో మాజీ మంత్రులకు సంబంధించి బిజినెస్ నియామకాలను పర్యవేక్షించే అడ్వైజరీ కమిటీ ఆన్ బిజినెస్ అపాయింట్‌మెంట్స్ (ఏసీవోబీఏ) గురువారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సందర్భంగా కొన్ని షరతులు విధించింది.



కొందరు నియంతృత్వానికి లొంగుతారు. మరి కొందరు ఎదురుతిరుగుతారు. ఆంక్షలు పెరుగుతున్న కొలది వారి పోరాటం మరింత బలపడుతుంది. అలాంటి వ్యక్తే **మరియా కొరీనా మచాడో**. వెనెజువెలాలో ప్రజాస్వామ హక్కుల కోసం పోరాడుతున్న యోధురాలు. వెనెజువెల నాయకుడు నికలోస్ మాడ్యూరో నియంతృత్వానికి వ్యతిరేకంగా ఆమె చేస్తున్న పోరాటానికి బహుమానంగా నోబెల్ శాంతి బహుమతి ఆమెను వరించింది.

అజ్ఞాతవాసికి శాంతి బహుమతి!

58 ఏళ్ల మచాడో గత 15 నెలలుగా ఎక్కడ ఉందో.. ఏ ప్రాంతంలో తలదాచుకుంటుందో ఎవరికీ తెలియదు. ఆమె ప్రజలను నేరుగా కలిసింది కూడా లేదు. కానీ ఆమె వెనెజువెలలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటానికి ప్రపంచవ్యాప్తంగా ప్రజల దగ్గర నుంచి మద్దతు లభిస్తోంది. వృత్తిపరంగా ఇండస్ట్రియల్ ఇంజనీర్ అయిన మచాడోపై ప్రభుత్వం అనేక రకాలుగా ఒత్తిడి పెట్టింది. ఆ ఒత్తిడిని తట్టుకోలేక ఆమె భర్త, ఇద్దరు పిల్లలు, తల్లి అందరూ విదేశాలలో తలదాచుకోవాల్సి వచ్చింది. కానీ మచాడో మాత్రం వెనెజువెలలోనే ఉన్నానంటారు. తన కుటుంబానికి ప్రభుత్వం హాని చేస్తుందనే ఆలోచన మచాడోను ముందు నుంచి వేధిస్తూనే వచ్చింది. "2012లో నేను ఒక ఎంపీని. నేషనల్ అసెంబ్లీలో అప్పటి నియంత హ్యూగో చెవిజ్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నా. హఠాత్తుగా 'మా అమ్మాయి అన్నా ఎక్కడుందనే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన రాగానే నాలో భయం మొదలయింది. మాట్లాడటం అయిపోయిన వెంటనే ఇంటికి వెళ్లిపోయా. అన్నాతో- 'నువ్వు ఇక్కడ ఉండద్దు. వేరే దేశానికి వెళ్లిపో!' అని చెప్పా. ప్రజా పోరాటాలలో ఉండాలంటే మంచి అమ్మగా నా బాధ్యతలు నిర్వర్తించలేనని ఆ రోజే గుర్తించాను" అంటారు మాచాడో.



అందమైన బాల్యం

మాచాడో తల్లి మానసిక వైద్యురాలు. తండ్రి ఒక పెద్ద వాణిజ్యవేత్త. "నాకు మా నాన్న అంటే చాలా ఇష్టం. ఆయన బిజినెస్‌లు చూసుకోవటానికి కొడుకులే అక్కర లేదు అని నిరూపించాలని చిన్నప్పటి నుంచి ఉండేది. అందుకే నేను ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ చదివాను" అంటారు మాచాడో. చిన్నప్పుడు ఎప్పుడూ రాజకీయాలలోకి రావాలని ఆమె అనుకోలేదు. "బాగా బిజినెస్ చేసి.. ఎక్కువ మందికి ఉద్యోగాలు ఇవ్వాలని అనుకొనేదాన్ని" అంటారామె! కాలేజీలో చదువుతున్న సమయంలో సమాజంలో ఉన్న అసమానతలను ఆమె ప్రత్యక్షంగా చూశారు. "నేను ఒక మురికివాడలో పిల్లలకు పాఠాలు చెప్పటానికి వెళ్లేదాన్ని. వాళ్లను చూసిన తర్వాత నాకు గిల్టీ కలిగింది. వాళ్ల గురించి నేను ఏమి చేయటం లేదనే ఆలోచన కలచివేయటం మొదలెట్టింది" అంటారు మాచాడో. చదువు పూర్తయిపోయిన తర్వాత తండ్రి స్టీలు ఫ్యాక్టరీలో చేరారు. అయితే అక్కడ ఆమెకు వెనెజువెలాలో ఉన్న రాజకీయ అస్థిరత గురించి తెలిసింది. "రాజకీయాల గురించి.. రాజకీయనాయకుల గురించి ఫిర్యాదులు చేయటం కాదు. రాజకీయాల్లో చేరి వాటిని ఎలా మార్చాలో ఆలోచించాలి" అనే ఉద్దేశంతో సుమేట్ అనే ఒక సంస్థను ప్రారంభించారు. 2010లో జరిగిన ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేశారు.

తొలి అడుగులు

ఆ సమయంలో మచాడో ఎవరికీ తెలియదు. ఆమె గెలుస్తుందని కూడా ఎవరూ అనుకోలేదు. "లాటిన్ అమెరికా దేశాల్లో పితృస్వామ్య వ్యవస్థ చాలా బలంగా ఉంటుంది. నువ్వు అమ్మాయివి.. నువ్వు ఇంజినీర్‌వి.. నీకు డబ్బులు ఉన్నాయి.. నువ్వు ఎన్నికల్లో ఎలా గెలుస్తావు?" అని చాలా మంది ఆమెపై విమర్శల వర్షం కురిపించేవారు. కానీ అందరిని ఆశ్చర్యపరుస్తూ ఆమె భారీ మెజారిటీతో గెలిచారు. చెవెజ్‌కు వ్యతిరేకంగా ఆమె చేసిన ఉపన్యాసాలు ప్రజలందరినీ ఆకట్టుకొనేవి. 2013లో చెవెజ్ మరణించిన తర్వాత మెద్యూరో అధికారంలోకి వచ్చారు. ఆయన పాలనలో ప్రజలపై ఆంక్షలు మరింత పెరిగాయి. తన రాజకీయ ప్రత్యర్థులను మెద్యూరో విపరీతంగా వేధించటం మొదలుపెట్టాడు. ఆయనకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న మాచాడోను అణిచివేయటానికి ప్రయత్నం అనేక ప్రయత్నాలు చేసింది. ఈ నేపథ్యంలో గత ఏడాది (2024) జూలైలో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించటానికి మెద్యూరో నిర్ణయించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని మాచాడో ప్రయత్నించారు. కానీ కోర్టుల ద్వారా ప్రభుత్వం ఆమె అభ్యర్థిత్వాన్ని అడ్డుకుంది. దీనితో గోన్‌జాలిజ్‌కు మచాడో మద్దతు ఇచ్చారు. ప్రజాస్వామికంగా జరిగి ఉంటే ఆయనే ఎన్నికల్లో గెలిచేవారు. కానీ తానే ఎన్నికయ్యానని మెద్యూరో ప్రకటించుకున్నారు. దీనితో వెజెజువెలాలోని ప్రజలు రోడ్ల మీదకు వచ్చి ప్రదర్శనలు మొదలుపెట్టారు. ప్రభుత్వం ప్రజలను అణిచివేయటానికి ప్రయత్నించింది. "నన్ను చంపేస్తారని అనుమానం వచ్చింది. నన్ను నేను రక్షించుకుంటేనే.. ప్రజాస్వామ్యాన్ని రక్షించగలనని అనిపించింది. అందుకే అజ్ఞాతవాసానికి వెళ్లిపోయాను" అంటారు మచాడో.

అజ్ఞాత వాసం..

ప్రభుత్వ వేగుల నుంచి.. సైన్యం నుంచి తప్పించుకోవటం అంత సులభం కాదు. అందుకే మచాడో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొనేది. "నా జుట్టును నేనే కత్తిరించుకొనేదాన్ని. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం- నాకు పోరాడే శక్తిని ఇవ్వమని భగవంతుడిని ప్రార్థించేదాన్ని.." అంటారామె! అప్పటి నుంచి ఇప్పటి దాకా ఆమె అజ్ఞాతంలో ఉండే పోరాడుతున్నారు. "ఇది మంచి.. చెడుల మధ్య జరుగుతున్న పోరాటం. ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న పోరాటం. దీనిని గెలవటం అంత సులభం కాదని తెలుసు. కానీ చివరకు మంచే గెలుస్తుందని నాకు తెలుసు. ఆ క్షణం వచ్చే దాకా పోరాడాల్సిందే" అని అంటారు మచాడో. ఆమె ప్రజాస్వామ్యం కోసం చేస్తున్న పోరాటంలో విజయం సాధించాలని ఆశిద్దాం.

ఇక డిస్కమ్‌ల పోటీ

ఒకే ప్రాంతంలో బహుళ డిస్కమ్‌ల విద్యుత్ సరఫరా

» ప్రస్తుత నెట్‌వర్క్‌ను వాడుకొని వ్యాపారం చేసుకునే చాన్స్

» ముసాయిదా విద్యుత్ సవరణ బిల్లు-2025 తెచ్చిన కేంద్రం


హైదరాబాద్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఒకే ప్రాంతంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ డిస్కమ్‌లు రావొచ్చు. వినియోగదారుడు తనకు నచ్చిన డిస్కమ్ నుంచి కరెంట్ కొనుగోలు చేయవచ్చు. ఒక ప్రాంతంలో ఉన్న డిస్కమ్‌ల లైన్లు, నెట్‌వర్క్‌ను వాడుకొని వేరే డిస్కమ్‌లు వ్యాపారం చేసుకునే వెసులుబాటు. విద్యుత్ నియంత్రణ మండళ్ల(ఈఆర్‌సీ) సుమోటోగా చార్జీలు ఖరారు చేసే అధికారం. క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీ రద్దు. ఇవీ.. విద్యుత్ పంపిణీ రంగంలో కీలక సంస్కరణలను ప్రతిపాదిస్తూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ తెచ్చిన ముసాయిదా బిల్లు (విద్యుత్(సవరణ) బిల్లు-2025)లోని ముఖ్యాంశాలు. దీన్ని రాష్ట్రాలకు పంపిన కేంద్రం, నెల రోజుల్లోగా అభిప్రాయం తెలియజేయాలని కోరింది. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే.. టెలికం రంగంలాగే విద్యుత్ పంపిణీ వ్యవస్థలోనూ విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయి. మరీ ముఖ్యంగా.. ఒక ప్రాంతంలో ఒకే నెట్‌వర్క్‌ను బహుళ విద్యుత్ పంపిణీ వ్యవస్థలు వాడుకునే వీలు కల్పించే ప్రతిపాదన అమల్లోకి వస్తే.. బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జియో, ఐడియా, వోడాఫోన్ కంపెనీలు పోటీ పడ్డట్టుగా.. డిస్కమ్‌లు ఇంటింటికీ తిరిగి తమ కనెక్షనే తీసుకోవాలంటూ నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకే ఆఫర్ చేసే అవకాశాలున్నాయి. ఇంగ్లండ్‌లాంటి దేశాల్లో ఈ విధానం ఇప్పటికే అమల్లో ఉంది. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే డిస్కమ్‌ల మధ్య పోటీ పెరిగి.. సిబ్బంది మన ఇంటికే వచ్చి తక్కువ ధరకే కనెక్షన్ ఇస్తామని ఆఫర్ చేసే అవకాశాలున్నాయి. అలాగే.. ముసాయిదా బిల్లు ప్రకారం ఒక యూనిట్‌కు అయ్యే వ్యయాన్ని పూర్తి స్థాయిలో డిస్కమ్‌లు వసూలు చేసుకోవాల్సి ఉంటుంది. సబ్సిడీ ఇవ్వదలుచుకుంటే నేరుగా ప్రభుత్వం వినియోగదారుడి ఖాతాలో జమచేయాలి. లేదంటే ప్రత్యేకంగా ఒక ఖాతాను తెరిచి.. డిస్కమ్‌ల అకౌంట్‌లో జమచేయాల్సి ఉంటుంది. ముసాయిదాలోని మరో ముఖ్యమైన ప్రతిపాదన.. తయారీ రంగం, రైల్వే, మెట్రోలను క్రాస్ సబ్సిడీ భారం నుంచి ఐదేళ్లలోగా మినహాయించడం. క్రాస్ సబ్సిడీలంటే.. పరిశ్రమల వంటివాటికి సరఫరా చేసే విద్యుత్‌కు ఎక్కువ చార్జీలు వసూలు చేసి, ఆ ఆదాయంతో పేదలకు, రైతులకు రాయితీ ధరలకు విద్యుత్ సరఫరా చేయడం. ఈ క్రాస్ సబ్సిడీల భారం నుంచి తయారీ రంగాన్ని, రైల్వే, మెట్రోలను మినహాయించడం అంటే.. అవి విద్యుత్‌కు అధిక చార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదు.

మారిన లెక్కలు..

ప్రస్తుతం విద్యుత్ చౌర్యం కేసులో ఒక వినియోగదారుడిని పట్టుకుంటే.. గరిష్ఠ వినియోగం ఆధారంగా రెండేళ్లు, మూడేళ్లు, నాలుగేళ్లు.. ఇలా ఇష్టం వచ్చిన కాలానికి డిస్కమ్ లు జరిమానాలు వేస్తున్నాయి. ఇక ముందు అలా కుదరదు. ఆ వినియోగదారుడు ఎన్నేళ్లుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నా.. గరిష్ఠంగా ఏడాది కాలానికి మాత్రమే జరిమానాలు వేయాల్సి ఉంటుంది. ఈఆర్‌సీలు ఏ కేసునైనా నిర్దిష్టంగా నాలుగు నెలల్లోపు తేల్చాలి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



విదేశాల్లో చిత్రీకరణ

రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో 'ఆర్‌టీ76' వర్కింగ్ టైటిల్ పేరుతో ఓ సినిమా రూపుదిద్దుకుంటోన్న విషయం తెలిసిందే. ఎస్ఎల్‌వీ సినిమా బేనర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర బృందం విదేశాల్లో కీలక సన్నివేశాల చిత్రీకరణలో నిమగ్నమై ఉంది. స్పెయిన్‌లోని వాలెన్షియా, ఆ సమీప దీవుల్లో కొన్ని రోజులుగా సాగుతున్న చిత్రీకరణ పనులు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి జెనీవా, ఫ్రాన్స్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభించారు. ఈ 25 రోజుల షెడ్యూల్‌లో టాకీ పార్ట్‌తోపాటు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో రెండు పాటల చిత్రీకరణను పూర్తి చేయనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

మిత్రమండలి వినోదం మెప్పిస్తుంది



"జంగ్లీ అనే కాల్పనిక పట్టణం నేపథ్యంలో రూపుదిద్దుకున్న పూర్తి వినోదాత్మక చిత్రం 'మిత్ర మండలి'. అవుట్ అండ్ అవుట్ కామెడీ ప్రేక్షకులను అలరిస్తుంది. కథ మీద నమ్మకంతో సినిమా నిర్మాణంలో భాగస్వాములమయ్యాం" అని నిర్మాతలు భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల అన్నారు. ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం జంటగా విజయేందర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 16న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు మీడియాతో ముచ్చటించారు.

- బన్నీ వాస్ మాకు మంచి మిత్రుడు. గీతా ఆర్ట్స్‌లో ఆయనతో కలసి కొన్ని సినిమాలు చేశాం. మేం నిర్మాణసంస్థను ప్రారంభించాలని అనుకున్నప్పుడు బన్నీవాస్ సూచన మేరకు 'మిత్ర మండలి' కథ విన్నాం. వినోదం, వ్యంగ్యం కలబోతగా రూపొందిన చిత్రమిది.
- దర్శకుడిగా విజయేందర్‌కు మంచి స్పష్టత ఉంది. కథను ఎంత అద్భుతంగా రాసుకున్నాడో అంతే అద్భుతంగా తెరకెక్కించాడు. మేకింగ్‌లో ఎక్కడా తడబడలేదు. ఒక కొత్త దర్శకుడిలా అనిపించలేదు. 'మిత్రమండలి' చిత్రంలో బ్రహ్మానందం గారి పాత్ర చాలా ఆసక్తికరంగా ఉండబోతోంది. సినిమా పూర్తయ్యాక ఏదో వెలితిగా అనిపించింది. అప్పుడు బ్రహ్మానందం గారి మీద ఒక పాటను చిత్రీకరించాం. ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. 'జాతిరత్నాలు' చిత్రంతో 'మిత్రమండలి'కి పోలిక తెస్తున్నారు. కానీ మాది పూర్తిగా వేరే కథ. ప్రేక్షకులు సినిమాను ఆద్యంతం ఆస్వాదిస్తారు.



ముగ్గురు స్నేహితుల కథ

ఎంసీ హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రధారులుగా రమణరెడ్డి సోమ తెరకెక్కిస్తోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'అమీర్ లోగ్'. అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ బేనర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని కథానాయకుడు శ్రీవిష్ణు ఆవిష్కరించారు. పోస్టర్‌లో చార్మినార్, ఇరానీ ఛాయ్ అని రాసి ఉన్న బోర్డుని చూస్తుంటే హైదరాబాద్ నేపథ్యంలో సాగే కథ అని అర్థమవుతోంది. కాగా, ఇది ముగ్గురు స్నేహితుల చుట్టూ తిరిగే ఓ వినోదాత్మక చిత్రమని, పూర్తి వివరాలను త్వరలో ప్రకటిస్తామని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి డీఓపీ: ఎస్‌వీకే, సంగీతం: స్మరన్ సాయి.

బైసన్ వస్తున్నాడు



తమిళ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'బైసన్'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. మారి సెల్వరాజన్ దర్శకుడు. సమీర్ నాయర్ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమా నుంచి తొలి గీతాన్ని విడుదల చేసి, చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'తీరేనా తీరేనా గుండెల్లోన మండుతున్న ఎద వేదన' అంటూ సాగే ఈ గీతానికి మారి సెల్వరాజ్ సాహిత్యం అందించగా, నివాస్ కే ప్రసన్న స్వరపరిచారు. మనువర్ధన్ ఆలపించారు. ఈ చిత్రాన్ని జగదంబె ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత బాలాజీ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రంలో ధృవ్ నటన తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు' అని చెప్పారు.



కళాకారుల కథతో...

చాణక్య ప్రధాన పాత్రధారునిగా స్వీయ నిర్మాణంలో కళా శ్రీనివాస్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'దక్కన్ సర్కార్'. తాజాగా ఈ చిత్రం పోస్టర్‌ని నటి విజయశాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ప్రజా ఉద్యమాలతో సంబంధం ఉన్న రచయిత, ప్రజా కళాకారుడు కళా శ్రీనివాస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, చిత్ర విజయానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కళా కారుల జేఏసీ అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే మాట్లాడుతూ తెలంగాణ సినిమాలను, కళాకారులను ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు. చిత్ర దర్శకనిర్మాత కళా శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఇది ప్రజల జీవన స్థితిగతుల కథ, నిజ జీవిత ఘటనల ఆధారంగా నిర్మించాం' అని చెప్పారు.

నేటి నుంచి 'ధనధాన్య కృషి యోజన'

» ప్రారంభించనున్న ప్రధాని మోదీ

» రాష్ట్రంలో ఎంపికయిన నాలుగు జిల్లాలు

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న 'ధన-ధాన్య కృషి యోజన' పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కృషి విజ్ఞాన కేంద్రాలు, మార్కెట్ కమిటీల్లో ఈ పథకంపై అవగాహన సదస్సులు నిర్వహించి, వర్చువల్‌గా ప్రధాని సందేశాన్ని ఎల్‌ఈడీ స్ర్కీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఆరేళ్ల పాటు కొనసాగే ఈ పథకంలో దేశంలో పంటల ఉత్పాదన, సాంద్రత, రుణపరపతి తక్కువగా ఉన్న జిల్లాలను ఎంపిక చేశారు. 2025-26లో దేశవ్యాప్తంగా 100 జిల్లాలు ఎంపికవ్వగా, రాష్ట్రంలోని అల్లూరి, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాలను ఎంపిక చేశారు. ధన-ధాన్య కృషి పథకం ప్రణాళిక, అమలు, నిర్వహణ, పర్యవేక్షణ కోసం రాష్ట్రస్థాయి సమితి ఛైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సభ్య కార్యదర్శిగా వ్యవసాయ-సహకారశాఖ కార్యదర్శి ఉండనున్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలనే దృష్టితో ఈ పథకాన్ని చేపట్టినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు.

పదోన్నతులపై జీవో విడుదల చేయాలి: ఈయూ

విజయవాడ (బస్‌స్టేషన్), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులపై దీపావళిలోపు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య అల్టిమేటం జారీ చేశారు. విజయనగరం జోన్ ఆర్టీసీ ఈయూ జోనల్‌స్థాయి కౌన్సిల్ సమావేశం జిల్లా పరిషత్‌లో శుక్రవారం జరిగింది. వారు మాట్లాడుతూ, పదోన్నతుల కోసం ఆరు వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు ఎదురుచూస్తున్నారన్నారు. 3వేల కొత్త బస్సుల కొనుగోలు, 10వేల ఉద్యోగ నియామకాలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

దుర్భిక్ష ప్రాంతాల్లో 65% నీటి సంబంధిత పనులు

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధుల కేటాయింపు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త మార్గదర్శకాలు జారీచేశాయి. కరువు ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలిచ్చారు. నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న అతి దుర్భిక్ష, క్లిష్టమైన మండలాల్లో 65 శాతం, మధ్యస్థాయి క్లిష్టమైన మండలాల్లో 40 శాతం, సురక్షిత మండలాల్లో 30 శాతం నీటి సంబంధిత పనులు చేపట్టాలని సూచించారు.

10 మంది ఇంజనీర్లపై ఆర్‌అండ్‌బీ చర్యలు

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాల ఆరోపణలపై విజిలెన్స్ నివేదిక ఆధారంగా రోడ్లు భవనాల శాఖ 10 మంది ఇంజనీర్లపై క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. తొలుత వారికి నోటీసులు జారీచేసి.. ఆపై శాఖాపరమైన చర్యలు తీసుకోనుంది. ఆ పది మందిలో ఎ.నాగేశ్వరరావు- డీఈఈ, టి.రవీంద్రబాబు- డీఈఈ(రిటైర్డ్), వై.మురళికృష్ణ- ఈఈ, ఎస్.జీవమణి-ఏఈ, ఎస్.అరుణకుమారి-ఏఈ, ఎం.వి.ఎన్.సురేశ్-ఏఈ, హిమబిందు-ఏఈ, వీరన్నబాబు- ఏఈ, వివేకానంద్-డీఈ(రిటైర్డ్), ఎం.ఆనంద్-ఈఈ(రిటైర్డ్) ఉన్నారు.

13 నుంచి బడులకు కొత్త టీచర్లు

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన కొత్త ఉపాధ్యాయులు ఈ నెల 13 నుంచి పాఠశాలల్లో విధులకు హాజరవుతారని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. శుక్రవారం ఆర్జేడీలు, డీఈవోలు, ఇతర అధికారులతో వెబెక్స్ నిర్వహించారు. లీప్ యాప్‌లోనే వారికి పోస్టింగ్ ఆర్డర్లు ఇస్తామన్నారు.

ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పెంపు

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లింపు గడువును ఇంటర్ విద్యామండలి పొడిగించింది. ఈనెల 22 వరకు అపరాధ రుసుము లేకుండా, ఆ తర్వాత 30 వరకు రూ.వెయ్యి అపరాధ రుసుముతో ఫీజు చెల్లించవచ్చని ఓ ప్రకటనలో తెలిపింది.

పరిశ్రమల శాఖలో ముగ్గురికి అదనపు డైరెక్టర్లుగా పదోన్నతి

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమల శాఖలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ముగ్గురు అధికారులకు ప్రభుత్వం అదనపు డైరెక్టర్లుగా పదోన్నతి కల్పించింది. ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా సేవలందిస్తున్న ఎన్ఎస్ఆర్‌సీఎం ప్రసాద్, కె.సోమశేఖరరెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఫెసిలిటేషన్ సెల్‌లో పనిచేస్తున్న ఎం.రాజశేఖర్‌లకు తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు కల్పించింది.

నేడు, రేపు వర్షాలు.. ఉత్తరాంధ్రలో భారీగా!

విశాఖపట్నం, అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తా, ఉత్తర తమిళనాడు పరిసరాల్లో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు ఏర్పడ్డాయి. వీటి ప్రభావంతో శుక్రవారం కోస్తా, సీమల్లో పలుచోట్ల ఉరుములు, పిడుగులతో వర్షాలు కురిశాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు అక్కడక్కడా భారీవర్షాలు కురవనున్నాయి. శని, ఆదివారాలు కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, బంగ్లాదేశ్, దానికి ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దాని ప్రభావంతో గాలుల దిశ మారుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. శనివారం అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం సాయంత్రం వరకు కోనసీమ జిల్లా నగరంలో 46, మలికిపురంలో 36, ప్రకాశం జిల్లా నర్సింగోలులో 27, కాకినాడజిల్లా డీ-పోలవరంలో 25.2 మిల్లీమీటర్ల వాన పడింది.

తప్పుడు కథనం రాసిన జగన్ పత్రికపై కేసు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సరైన ఆధారాలు లేకుండా తప్పుడు కథనం ప్రచురించినందుకు జగన్ పత్రికపై కేసు నమోదు చేసినట్లు పల్నాడు జిల్లా నరసరావుపేట రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ హరిబాబు తెలిపారు. నరసరావుపేట బరంపేటలోని చాకిరాలమిట్టకు చెందిన పి.కోటేశ్వరరావు(50) సోమవారం అర్ధరాత్రి అతిగా మద్యం సేవించి గొంతు ఎండిపోయి మృతి చెందాడు. ఈ మేరకు రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఈ అంశంపై జగన్(సాక్షి) పత్రికలో నకిలీ మద్యం తాగి చనిపోయినట్లు కథనం ప్రచురితమైంది. దీనిపై మృతుడి భార్య అలివేలు గురువారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నెట్‌వర్క్ ఆస్పత్రుల సమ్మె పాక్షికం!

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ శుక్రవారం చేపట్టిన నెట్‌వర్క్ ఆస్పత్రుల వైద్య సేవల బంద్ పాక్షికంగా జరిగింది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ తమకు రూ.2700 కోట్ల బకాయిలు పెట్టిందని, బిల్లులు చెల్లించే వరకూ సేవలు కొనసాగించలేమంటూ శుక్రవారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చింది. అయితే సమ్మె ప్రభావం పెద్దగా కనిపించలేదు. నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి శస్త్ర చికిత్సల కోసం ప్రతిరోజూ అనుమతులు కోరుతూ ట్రస్ట్‌కు దాదాపు 6 వేల నుంచి 6500 వరకు ప్రి-ఆథరైజేషన్లు వస్తాయి. వీటికి ట్రస్ట్ అనుమతులిస్తుంది. శుక్రవారం కూడా 6 వేల ప్రి-ఆథరైజేషన్లు ఆసుపత్రుల నుంచి వచ్చాయి.


సెంట్రల్ లైబ్రరీ నిర్మాణంపై వర్క్‌షాప్

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్మించతలపెట్టిన సెంట్రల్ లైబ్రరీ నిర్మాణంపై పాఠశాల విద్యాశాఖ శుక్రవారం విజయవాడలో వర్క్‌షాప్ నిర్వహించింది. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఇందులో పాల్గొని మాట్లాడారు. అమరావతి సెంట్రల్ లైబ్రరీ దేశంలోనే అత్యాధునికంగా ఉంటుందన్నారు. ఇందుకోసం త్వరలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి నమూనా పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రముఖ ఆర్కిటెక్చర్లు ఇందులో పాల్గొని నిర్మాణ ఆకృతులు అందించే అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు కోన శశిధర్, వి.విజయరామరాజు, దీవన్ రెడ్డి పాల్గొన్నారు.

'ప్లీజ్ సేవ్ గర్ల్ చైల్డ్'

అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం (ఈ నెల 11న) సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రంగంపేటకు చెందిన దేవిన సోహిత, ధన్యత (దేవిన సిస్టర్స్) శుక్రవారం 'ప్లీజ్ సేవ్ గర్ల్ చైల్డ్.. మాపై అకృత్యాలకు అంతం లేదా? అన్న నినాదాలతో సైకత శిల్పం రూపొందించారు. భయంతో ముడుచుకుపోయిన బాలికను అబార్షన్లు, అత్యాచారాలు, లింగవివక్ష, బాల్య వివాహాలు చుట్టుముట్టినట్టు రూపొందించిన ఈ సైకత శిల్పం చూపరులను ఆలోచింపజేస్తోంది.

\- రంగంపేట, ఆంధ్రజ్యోతి



'కందిపప్పు'లోనూ కుమ్ముడు

గత ప్రభుత్వంలోని లీలలు తాజాగా వెలుగులోకి

» నాడు గుంటూరు వ్యాపారి వెంకటేశ్వరరావుకు సహకరించిన వైసీపీ నాయకులు

» ధరలు పెంచి క్యాష్ చేసుకున్న వైనం

» ఎన్నికల ముందు వైసీపీ నేతలకు ముడుపులు

» తాజాగా ఐటీ దాడుల్లో కుట్ర బయటకు

» 150 బంగారం బిస్కెట్లు, 40 కోట్ల నగదు సీజ్

» త్వరలో ఈడీ రంగంలోకి దిగే అవకాశం

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో కంది పప్పు ధర పెరగడం వెనుక ఉన్న కుట్ర ఇప్పుడు బయటపడింది. ఓ ప్రైవేటు వ్యాపారితో ఆ పార్టీ నేతలకు ఉన్న లింకులు వెలుగు చూశాయి. గుంటూరు నగరానికి చెందిన కందిపప్పు కమీషన్ వ్యాపారి సకల వెంకటేశ్వరరావు గత వైసీపీ పాలనలో విచ్చలవిడిగా తన జీరో వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నారు. ఏపీ, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటకలోనూ కందిపప్పు, పచ్చిపప్పు ధర ఎంత ఉండాలో నిర్ణయించే స్థాయికి చేరారు. ఫలితంగా వైసీపీ పాలనలో కేజీ కందిపప్పు ధర ఒకానొక దశలో రూ.200కు చేరింది. విదేశాల నుంచి దిగుమతులు సరిగా లేవని సాకులు చెప్పారు. రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరా నిలిపేసి రిటైల్ మార్కెట్‌లో ధర పెరగడానికి నాటి వైసీపీ పాలకులు పరోక్షంగా వెంకటేశ్వరరావుకు సహకరించారన్న ఆరోపణలున్నాయి. ప్రతిఫలంగా తెనాలిలోని ఒక దాల్‌మిల్లు యజమాని ద్వారా వైసీపీ నేతలకు ఎన్నికలకు ముందు పెద్ద మొత్తంలో నగదు ముట్టజెప్పారు. తాజాగా ఆదాయ పన్ను శాఖ చేస్తున్న దాడుల్లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఐటీ దాడులలో ఇప్పటివరకు వెంకటేశ్వరరావుతో పాటు ఆయనతో సంబంధం ఉన్న వ్యాపారుల నుంచి 150 బంగారం బిస్కెట్లు, రూ.40 కోట్లకు పైగా నగదు, రూ.కోటి చిట్టీలు, రూ.50 లక్షల చిట్టీల జాబితాలను సీజ్ చేసినట్లు సమాచారం.

హైదరాబాద్‌లో సోదాలు చేస్తే..

గత వైసీపీ పాలనలో కందిపప్పు సరఫరా కాంట్రాక్టు కూడా వెంకటేశ్వరరావుకే దక్కేలా ఆ పార్టీ నేతలు చూసుకొన్నారు. ఇందుకు భారీగానే ప్రతిఫలం పొందారు. వెంకటేశ్వరరావు మూడు దశాబ్దాలుగా కమీషన్ వ్యాపారంతో పాటు బంగారం, చిట్టీలు, రియల్‌ఎస్టేట్ తదితర వ్యాపారాలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇన్ని వ్యాపారాలు చేస్తూ ఆదాయ పన్ను చెల్లించకుండా ఇన్నేళ్లు తప్పించుకొన్నారు. ఐటీ అధికారులు ఇటీవల హైదరాబాద్‌లోని ఒక నగల దుకాణంలో సోదాలు నిర్వహించగా గుంటూరు, విశాఖపట్నంలోని వ్యాపారులకు పెద్ద ఎత్తున బంగారం బిస్కెట్లు అమ్మినట్లు తేలింది. దీంతో ఐటీ అధికారులు బృందాలుగా విడిపోయి గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, వినుకొండ, పిడుగురాళ్ల తదితర ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జీఎస్టీ అధికారులు కూడా రంగంలోకి దిగి వెంకటేశ్వరరావుతో వ్యాపార లావాదేవీలున్న వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నారు. మనీ లాండరింగ్‌పైనా అనుమానాలు ఉండటంతో ఈడీ రంగంలోకి దిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

వైసీపీ నేతలకు బిగుస్తున్న ఉచ్చు!

ఎన్నికలకు ముందు వెంకటేశ్వరరావు సూచనల మేరకు దాల్‌మిల్లు యజమాని నుంచి ఇద్దరు వైసీపీ నేతలు రూ.కోట్ల నగదును అందుకొన్నారు. ఆ యజమాని ఐటీ అధికారులకు ఈ విషయాన్ని చెప్పినట్లు సమాచారం. దీంతో ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో నగదు తీసుకున్న వైసీపీ నేతలను కూడా ఐటీ అధికారులు విచారించే అవకాశం ఉంది. అదే జరిగితే ఆ నగదు వాళ్లిద్దరి నుంచి అంతిమంగా ఎక్కడికి చేరిందనేది తెలుస్తుంది. కాగా గుంటూరు నగరంలో పెద్ద వ్యాపారులు, రాజకీయ నాయకుల లావాదేవీలను చూసే ఆడిటర్ ఒకరు సకల వెంకటేశ్వరరావుతో పాటు ఈ కేసులో ముడిపడి ఉన్న వాళ్లను రక్షించేందుకు రంగంలోకి దిగారు. 'మీరేం భయపడొద్దు.. అన్ని నేను చూసుకొంటా' అంటూ అభయం ఇచ్చినట్లు తెలిసింది.



వినుకొండలో ఏనుగుపాలెం రోడ్డులో ఐటీ అధికారులు తనిఖీలు చేసిన కందిపప్పు మిల్లు

వినుకొండలో ఐటీ సోదాలు

వినుకొండటౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వినుకొండలో నాలుగో రోజు శుక్రవారం కూడా ఐటీ సోదాలు కొనసాగాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శనగల కొనుగోలులో భారీ కుంభకోణానికి సంబంధించి ఐటీ అధికారులు కందిపప్పు మిల్లులతో పాటు యజమానుల ఇళ్లల్లో సోదాలు చేస్తున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఐటీ అధికారులు వినుకొండలో మకాం వేసి తనిఖీలు చేస్తున్నారు. కందిపప్పు మిల్లుల్లోని కంప్యూటర్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. తాజాగా ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. ఏనుగుపాలెం రోడ్డులోని ఓ మిల్లులో, ఎస్‌బీఐ బజారులోని వ్యాపారుల ఇళ్లల్లో సోదాలు చేస్తున్నారు. వినుకొండ పట్టణానికి చెందిన ఓ వ్యాపారిని అధికారులు విచారణ నిమిత్తం పిలిపించారు. ఆయన వ్యాపార లావాదేవీలు, ఖాతా పుస్తకాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ప్రధానంగా నలుగురు వ్యాపారుల పాత్రపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆ దిశగా తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నారా భువనేశ్వరికి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు



అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిని ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ భువనేశ్వరికి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు-2025ను ప్రకటించింది. ప్రజాసేవ, సామాజికంగా ప్రభావితం చేసే అంశాల్లో కీలకంగా పనిచేసినందుకు గాను ఆమెకు ఈ అవార్డును ప్రకటించారు. లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్‌లో నవంబరు 4న జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందజేస్తారు. గతంలో ఈ అవార్డును దక్కించుకున్న వారిలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, హిందుజా గ్రూప్ కో-ఛైర్మన్ గోపీచంద్ తదితరులు ఉన్నారు.

ఆత్మనిర్భర భారత్ కోసం అవిశ్రాంతంగా కృషి చేయండి

» వ్యాపారవేత్తలకు కేంద్ర మంత్రి పెమ్మసాని పిలుపు



న్యూఢిల్లీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భర భారత్ కోసం అవిశ్రాంతంగా కృషి చేయాలని వ్యాపారవేత్తలకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఢిల్లీలో ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ అవార్డుల ప్రదానోత్సవంలో మాట్లాడారు. 'దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోంది. సాంకేతికతలో అద్భుత ప్రగతిని సాధించింది. నిరంతర తపనతో ఆత్మనిర్భర భారత్ నిర్మాణంలో వ్యాపారవేత్తలు పాలుపంచుకోవాలి. పరిశోధనల్లో పెట్టుబడులు పెట్టాలి' అని పెమ్మసాని కోరారు.

నేడు లండన్‌కు జగన్ దంపతులు

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. భార్య భారతితో శనివారం లండన్‌కు వెళ్లనున్నారు. పెద్ద కుమార్తె వర్షారెడ్డి వద్దకు వెళ్తున్న వారిరువురూ తిరిగి ఈ నెల 19న తాడేపల్లికి చేరుకుంటారు. ఈపర్యటనకు జగన్ కోర్టు అనుమతి తీసుకున్నారు.

జగన్ మొసలి కన్నీరు: పట్టాభి

ప్రైవేటీకరణకు ఆద్యుడు జగన్ రెడ్డి అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలు జీవోలిచ్చి పేద విద్యార్థులకు వైద్య సీట్లు దక్కకుండా చేసిన జగన్, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు.

2 లక్షల టీచర్ పోస్టులు టీడీపీ ఘనత: బ్రహ్మం

ఉమ్మడి రాష్ట్రం సహా ప్రస్తుత ఏపీలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 2 లక్షల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిందని, దేశంలో ఏ పార్టీ కూడా ఇంత పెద్ద సంఖ్యలో టీచర్ పోస్టులు భర్తీ చేసిన దాఖలాల్లేవని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం అన్నారు. 2019 ఎన్నికలకు ముందు వైసీపీ అధినేత జగన్ అధికారంలోకి వస్తే 2 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి చేయలేదన్నారు.

వైసీపీ మద్యం స్కాం కనీవినీ ఎరుగనిది!

» నేనెప్పుడూ ఇలాంటి కుంభకోణం చూడలేదు

» మోహిత్ తన కారులో సొమ్ము తరలించారు

» సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయవాది ముకుల్ రోహత్గి

» సర్కారుకు నోటీసు.. చెవిరెడ్డికి మధ్యంతర రక్షణ

న్యూఢిల్లీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో జరిగిన మద్యం కుంభకోణం కనీవినీ ఎరుగనిదని, తన వృత్తి జీవితంలో ఇప్పటి వరకు ఇలాంటి స్కాంను చూడలేదని ప్రముఖ న్యాయవాది ముకుల్ రోహత్గి సుప్రీంకోర్టు ధర్మాసనానికి వివరించారు. వైసీపీ ప్రభుత్వం మద్యం విధానంలో మార్పులు చేసి, దేశంలో ప్రముఖ కంపెనీలుగా చెలామణిలో ఉన్న బ్రాండ్స్‌ను తీసేసి.. అనామక బ్రాండ్లను ప్రోత్సహించిందని తెలిపారు. ఏపీలో జరిగిన లిక్కర్ కుంభకోణం విలువ రూ.3500 కోట్లని వివరించారు. వైసీపీ లిక్కర్ స్కాంలో నిందితుడిగా ఉన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. వాస్తవానికి మోహిత్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు ఇటీవల కొట్టివేసింది. దీంతో ఆయన హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాదులు ముకుల్ రోహత్గి, సిదార్థ లూథ్రా, సిదార్థ్ అగర్వాల్ హాజరయ్యారు. ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. "మోహిత్‌రెడ్డి తన కారులో భారీ మొత్తంలో డబ్బులు తరలించారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ముడుపుల రూపంలో తీసుకున్న సొమ్మును ఎన్నికల్లో ఖర్చు చేయడానికి తరలించారు. నాసిరకం మద్యాన్ని విక్రయించి జనాన్ని మోసం చేశారు. రూ.వంద కోట్ల నిధులు సమకూర్చుకున్నారు. వాటినే ఎన్నికల్లో ఖర్చు చేశారు." అని రోహత్గి వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అప్పటివరకు మోహిత్‌రెడ్డికి మధ్యంతర రక్షణ కల్పించింది.

టీడీపీ నేతల జంట హత్య కేసు.. మరోసారి విచారణకు పిన్నెల్లి సోదరులు



మాచర్ల సర్కిల్ కార్యాలయం వద్ద పోలీసుల విచారణకు హాజరైన పిన్నెల్లి సోదరులు

మాచర్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(ఏ6), ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి (ఏ7) శుక్రవారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడు టీడీపీ నేతలు జవిశెట్టి సోదరులు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు హత్య కేసులో వీరిద్దరూ నిందితులు. గతంలో విచారణకు హాజరైన వీరు మరోసారి విచారణకు మాచర్ల సర్కిల్ కార్యాలయానికి హాజరయ్యారు. గురజాల డీఎస్పీ జగదీశ్ పర్యవేక్షణలో మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా విచారించారు. ఈ కేసులో తాత్కాలిక బెయిలుపై ఉన్న పిన్నెల్లి సోదరులు 2 వారాల క్రితం విచారణకు హాజరయ్యారు. ఆ సందర్భంగా తెలీదు, గుర్తు లేదు, సంబంధం లేదు అంటూ సమాధానాలు చెప్పారు. శుక్రవారం రెండోసారి విచారణలో కూడా అవే సమాధానాలు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, వెంకట్రామిరెడ్డిని మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6:30 వరకు విచారించారు. ఇరువురుకీ సుమారు 70 నుంచి 80 ప్రశ్నలు సంధించారు. మరోసారి విచారణకు రావాలని పోలీసులు తెలిపారు.

వైసీపీ కార్యాలయం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం హైకోర్టులో పిటిషన్

» ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం వైసీపీ కార్యాలయానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసేలా మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపుల వాదనలు పూర్తి కావడంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ తీర్పును రిజర్వ్ చేశారు. పురపాలకశాఖ అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం వ్యాజ్యం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది వై. నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ.. అధికారులు లేవనెత్తిన అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించామని తెలిపారు. రాజకీయ కారణాలతో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు మున్సిపాలిటీ కాలువపై వేసిన ర్యాంప్‌ను తొలగించారని పేర్కొన్నారు. కార్పొరేషన్ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ ఏసీఎస్ బోస్ వాదనలు వినిపిస్తూ.. కార్యాలయం నిర్మాణానికి 2024, జూన్ 21న అప్లికేషన్ పెట్టారన్నారు. బిల్డింగ్ ప్లాన్‌లో లోపాలు ఉన్నాయని గుర్తించి, నోటీసులు ఇచ్చినప్పటికీ వాటిని సరిచేయకుండా నిర్మాణం పూర్తి చేశారని తెలిపారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 18 మీటర్ల రోడ్డు ఉండాల్సిన చోట 12 మీటర్లు మాత్రమే వదిలారని వివరించారు. ప్లాన్ ప్రకారం సెట్ బ్యాక్స్ వదలలేదన్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ప్లాన్ ప్రకారమే నిర్మాణం పూర్తి చేసినట్లు అధికారులకు నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని, కానీ పిటిషనర్ ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని వెల్లడించారు. చట్టనిబంధనలు పాటించనప్పుడు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు.

ఆరోగ్యశ్రీని చంపేస్తున్న రాక్షసుడు బాబు: షర్మిల

విజయవాడ(వన్‌టౌన్), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చి పేదలకు వైఎస్ఆర్ దేవుడైతే.. పథకాన్ని నిర్వీర్యం చేస్తూ సీఎం చంద్రబాబు రాక్షసుడు అవుతున్నాడని పీసీసీ చీఫ్ షర్మిల శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శలు గుప్పించారు. ప్రైవేటు ఆరోగ్య బీమా ముసుగులో.. సంజీవని లాంటి ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా చంపేస్తున్నారని పేర్కొన్నారు. 'రూ.2,700 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టడం ఆరోగ్యశ్రీని పూర్తిగా ఎత్తివేసే కుట్రలో భాగం. నెట్‌వర్క్ ఆస్పత్రులు నెల రోజులుగా ఓపీ సేవలు నిలిపివేసినా దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం దారుణం. ఎన్నికల్లో చంద్రబాబు ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల ఆరోగ్య బీమా అన్నారు. ఇప్పుడు 10 శాతానికి కుదించి రూ.2.5 లక్షల ప్రయివేటు బీమాతో సరిపెట్టారు.' అని విమర్శించారు.

పార్వతీపురం వైద్య కళాశాలకు భూ సేకరణే చేయలేదు!

» పట్టపగలు అబద్ధాలు చెప్పడం జగన్‌కే సాధ్యం

» ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలకు సంబంధించి మాజీ సీఎం జగన్ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి విఫలయత్నం చేశారని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ మండిపడ్డారు. పార్వతీపురం మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నట్లు, అందుకు సంబంధించిన ఫొటోలను పరిశీలిస్తే వెల్లడవుతుందని జగన్ వ్యాఖ్యానించడాన్ని ఖండించారు. అధికారం నుంచి వైదొలగే వరకూ పార్వతీపురం కాలేజీకి జగన్ భూసేకరణ కూడా చేయలేదని ధ్వజమెత్తారు. బహిరంగంగా అబద్ధాలు చెప్పడం జగన్‌కే సాధ్యమని ఎద్దేవా చేశారు. ఇందులో వాస్తవాలను వెలుగులోకి తేవడానికి తనకు ఇష్టమైన వారితో మాజీ సీఎం నిజనిర్ధారణ కమిటీ వేయాలని సవాల్ విసిరారు. అక్కడ భూసేకరణ పూర్తయి, నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆ కమిటీ నిర్ధారిస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని, లేకుంటే జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆయుష్‌కు రూ.210 కోట్లు

రాష్ట్రంలో ఆయుష్ వైద్యసేవల విస్తరణ, మెరుగు కోసం రూ.166 కోట్లు మంజూరుకు కేంద్రం ఆమోదించిందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. విజయవాడ హెల్త్ వర్సిటీలో శుక్రవారం ఆయుష్ వైద్య విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్మవరం, కాకినాడల్లో కొత్తగా ఆయుర్వేద వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో రూ.210 కోట్లతో కొత్తగా రెండు ఆయుర్వేద, ఒక యునాని వైద్య కళాశాల రానుందని పేర్కొన్నారు. శ్రీకాకుళం, ప్రకాశం, అల్లూరి, ఎన్టీఆర్, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటుకు కేంద్రం రూ.52.35 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆయుర్వేద ఆరోగ్య మందిరాల అభివృద్ధికి కూడా నిధులు కేటాయించిందని తెలిపారు. రెండేళ్ల వ్యవధిలో రూ.248.89 కోట్లు మంజూరు కావడం రాష్ట్ర ఆయుష్ శాఖ చరిత్రలో ఇదే తొలిసారి అని మంత్రి తెలిపారు.

నేనేంటో చూపిస్తా!

» మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో మాజీ మంత్రి పేర్ని నాని రచ్చ

» చట్టపరంగా చర్యలు తప్పవు: ఎస్పీ



మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఏసుబాబుతో వాగ్వాదానికి దిగిన పేర్ని నాని

మచిలీపట్నం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో రెచ్చిపోయారు. "నేనేంటో చూపిస్తా. మీ ఇష్టం వచ్చినట్లు వైసీపీ నేతలను, కార్యకర్తలను అరెస్టు చేస్తారా?." అంటూ సీఐ ఏసుబాబుతో వాగ్వాదానికి దిగారు. ఈ వ్యవహారంపై స్పందించిన జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు.. పేర్ని నాని పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడాన్ని వ్యతిరేకిస్తున్న వైసీపీ నేతలు.. మచిలీపట్నం మెడికల్ కళాశాల వద్ద గత నెల 19న ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు 400 మందిపై కేసు నమోదు చేశారు. వీరికి 41-ఏ ప్రకారం నోటీసులు ఇచ్చేందుకు ఒక్కొక్కరినీ స్టేషన్‌కు పిలుస్తున్నారు. అయితే, మచిలీపట్నం నగర వైసీపీ అధ్యక్షుడు మేకల సుధాకర్‌బాబు(సుబ్బన్న) నోటీసులు తీసుకోకుండా ఎస్ఐ, సీఐ లేని సమయంలో వచ్చి, వారు లేరుకాబట్టి తర్వాత వస్తానని చెప్పి వెళ్లిపోతున్నారు. అదేవిధంగా 41-ఏ నోటీసులు ఎవరూ తీసుకోవద్దని, పోలీసులకు ఆధార్, ఇతర పత్రాలు ఇవ్వవద్దని వైసీపీ వాట్సాప్ గ్రూపులో పోస్టులు పెట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సుబ్బన్నను శుక్రవారం స్టేషన్‌కు పిలిచి ప్రశ్నించారు. అనంతరం అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న పేర్ని నాని.. వైసీపీ కార్యకర్తలు, నేతలతో కలిసి స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సమయంలో పేర్ని నాని సీఐతో వాగ్వాదానికి దిగారు. "నేను ఎవరో తెలియదని, గుర్తులేదని సీఐ అంటున్నారు. గుర్తుకువచ్చే రోజు వస్తుంది. ఏం చేస్తారు. మీచేతనైంది చేయండి. మహా అయితే సుబ్బన్నను సబ్ జైలులో పెడతారు. ఉరేస్తారా, వేస్తే వేయండి." అని పేర్ని నాని బిగ్గరగా కేకలు వేశారు. ఈ సమయంలో సీఐ మాట్లాడుతూ.. "ఎవరో చెప్పిన మాటలు నమ్మొద్దు. వాస్తవాలు గ్రహించాలి. ఏం చేస్తారండీ బాబు. మహా అయితే మమ్మల్ని ఉరేస్తారా?." అని అనడంతో.. "సుబ్బన్నను మీరు ఉరేస్తారా?." అని పేర్ని నాని వాదించారు. కాగా, ఈ వ్యవహారంపై ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ.. 41-ఏ నోటీసుపై సుబ్బన్న సరైన సమాధానం చెప్పలేదన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని పోలీసులతో అమర్యాదగా, బెదిరింపు ధోరణితో మాట్లాడారని తెలిపారు. పోలీసులు విధి నిర్వహణలో ఉన్నప్పుడు బెదిరింపు ధోరణితో మాట్లాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

'రైడెన్'కు రైట్‌రైట్!

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో తొలిసారిగా భారీ ఎఫ్‌డీఐతో వస్తున్న ఈ సంస్థకు 25 శాతం రాయితీకి భూములివ్వాలని.. వాటికి పూర్తిగా స్టాంపు డ్యూటీ మినహాయింపు ఇవ్వాలని, 100 శాతం ఎస్‌జీఎస్‌టీ రాయితీ ఇవ్వాలని ప్రతిపాదించారు. వీటితో పాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీ పూర్తి మినహాయింపు, పది శాతం క్యాపిటల్ సబ్సిడీ ఇవ్వాలన్న ప్రతిపాదనను కూడా క్యాబినెట్ ఆమోదించింది. మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనలు వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు స్పందించారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిపై కొత్త విశ్వాసం కనిపిస్తోందని.. టీసీఎస్, కాగ్నిజెంట్ సహా.. ప్రపంచ ప్రఖ్యాత గూగుల్, ఐబీఎం వంటి సంస్థలు రాష్ట్రంలో వ్యాపార కార్యకలాపాలు చేపట్టేందుకు ముందుకొచ్చాయన్నారు. విశాఖ నగరం భవిష్యత్‌లో ఐటీ రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకుంటుందన్న ధీమా వ్యక్తంచేశారు. కాగా.. రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి 14న ఢిల్లీలో ఎంవోయూ కుదుర్చుకోనున్నారు. ఇందుకోసం చంద్రబాబు, లోకేశ్ 13న ఢిల్లీ వెళ్లనున్నారు. వీరితోపాటు కేంద్ర ఐటీ-ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వనీ వైష్ణవ్ సమక్షంలో డేటా సెంటర్ ఏర్పాటు ఒప్పందంపై గూగుల్, రైడెన్ సంస్థల ఉన్నతాధికారులు సంతకాలు చేసి అధికారిక ప్రకటన చేస్తారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం ప్రధాని మోదీని కూడా కలిసే అవకాశం ఉంది.

78,771 ఉద్యోగాలు

రూ.1.27 లక్షల కోట్ల పెట్టుబడులు

- ఎస్‌ఐపీబీ నిర్ణయాలకు మంత్రిమండలి ఆమోదం
- దొనకొండలో బీడీఎల్ ఫ్యాక్టరీకి 1,400 ఎకరాలు
- రాజధానిలో రూ.212 కోట్లతో రాజ్‌భవన్ నిర్మాణం
- క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కొలుసు

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.1,27,181 కోట్ల విలువైన పెట్టుబడులకు, తద్వారా 78,771 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం వెలగపూడి సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను రాష్ట్ర సమాచార-పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు వివరించారు. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేయడానికి గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతిచ్చినట్లు తెలిపారు. రూ.87,500 కోట్ల పెట్టుబడితో తర్లువాడ, అడవివరం, రాంబిల్లిల్లోని 480 ఎకరాల్లో మూడు క్యాంపస్‌లలో ఈ డేటా సెంటర్‌ను అభివృద్ధి చేస్తారని చెప్పారు. బుధవారం సీఎం సారథ్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో తీసుకున్న పెట్టుబడుల నిర్ణయాలన్నిటినీ మంత్రివర్గం ఆమోదించిందన్నారు. అనకాపల్లి జిల్లాలో అధునాతన కార్బన్ కాంప్లెక్స్ తయారీ, పల్నాడుల్లో శ్రీసిమెంట్ ప్లాంటు విస్తరణ, అనంతపురం జిల్లాలో ఏరోస్పేస్, ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమలు, ప్రకాశం జిల్లాలో బీడీఎల్ ప్లాంట్, కర్నూలు జిల్లాలో పారిశ్రామిక ఎస్టేట్ అభివృద్ధి, విశాఖపట్నంలో పారిశ్రామిక, లాజిస్టిక్ హబ్, కర్నూలు జిల్లాలో ఇన్నోవేషన్ సెంటర్, విజయనగరం జిల్లాలో ప్రైవేట్ మెగా పార్కుకు భూముల కేటాయింపులు.. మొత్తంగా 34 అంశాలకు అంగీకారం తెలిపింది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు సమర్థంగా సేవలు అందించేందుకు 13,351 పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజించేందుకు ఆమోదం తెలిపింది.



క్యాబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్న, అనిత, లోకేశ్, కొల్లు రవీంద్ర, నారాయణ తదితరులు

మరిన్ని నిర్ణయాలు..



- రాజధాని అమరావతిలో రాజ్‌భవన్ అంటే.. గవర్నర్ నివాసం, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ ఆఫీస్, అధికారుల స్టాఫ్ క్వార్టర్స్ మొదలైన వాటితో కూడిన నిర్మాణ పనులకు రూ.212.22 కోట్లతో పరిపాలనా ఆమోదం.
- అమరావతిలో క్వాలిటీ బేస్డ్ సెలెక్షన్ విధానం ద్వారా నాలుగు ప్రదేశాల్లో (ప్రతి దానికీ 2.5 ఎకరాలు) కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటు.
- రాష్ట్రంలో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సహా నాలుగు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు.
- అమరావతిలో దస్పల్లా అమరావతి హోటల్స్ ఆధ్వర్యంలో 4 స్టార్ హోటల్ నిర్మాణానికి అనుమతి. అరకు వ్యాలీలో 55కోట్ల పెట్టుబడితో వీఎస్కే హోల్స్ రిసార్ట్స్ ఏర్పాటుకు ఆమోదం. శ్రీశైలంలో రూ. 83 కోట్ల పెట్టుబడితో శ్రీవెంకటేశ్వరా లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్ త్రీ స్టార్ హోటల్ నిర్మాణానికి ఆమోదం. అమరావతిలో రూ. సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ -4 స్టార్ హోటళ్లకు రూ. 117 కోట్ల పెట్టుబడితో హోటల్స్ నిర్మాణానికి ఆమోదం.
- పల్నాడు జిల్లాలో రూ.2,260 కోట్లతో శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణకు ఆమోదం.
- విశాఖ బీచ్ రోడ్‌లో 13.74 ఎకరాల్లో మెగా షాపింగ్ మాల్ ప్రాజెక్టు చేపడుతున్న లులు లిమిటెడ్‌కు లీజు అద్దె నిబంధనలకు క్యాబినెట్ ఆమోదం. వార్షిక లీజు అద్దె రూ.78.08 కోట్లుగా నిర్ణయం. ఏటా పది శాతం పెంపుదల.
- విజయవాడ మల్లవల్లిలో లులూ గ్రూపులో భాగమైన ఫెయిర్ ఎక్స్ పోర్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా ఫుడ్ పార్కు. కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌కు 7.48ఎకరాలు లీజు ప్రాతిపదికన కేటాయింపు. ఏటా రూ.50 లక్షల చొప్పున 66 ఏళ్లకు కేటాయింపు.
- విజయనగరం జిల్లాలో 1166.43 ఎకరాల్లో జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో మెగా పారిశ్రామిక పార్కు అభివృద్ధికి ఆమోదం. రూ.531 కోట్ల పెట్టుబడితో 45,000 మందికి ఉద్యోగావకాశాలు.
- అనకాపల్లిలో రూ.55 వేల కోట్లతో నిర్మించతలపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు భూముల కోసం ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ దశలవారీగా చేసినచెల్లింపులకు రూ.12.58 కోట్ల వడ్డీ మినహాయింపు.
- రాష్ట్రంలో ఏడు పర్యాటక ప్రాజెక్టులకు ఆమోదం. వీటితో రూ.1,628.8 కోట్ల పెట్టుబడులు.. 4,398 ఉద్యోగాలకు అవకాశం.
- విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు రాష్ట్రప్రభుత్వ మద్దతు చర్యగా గతంలోని విద్యుత్ చార్జీల బకాయిలను, రాబోయే కాలంలో కరెంటు చార్జీల బకాయిలను రెండేళ్లలో విశాఖలోని ఏపీఈపీడీసీఎల్‌కు బదలాయించడానికి మంత్రిమండలి ఆమోదం. ఈ మొత్తం రూ.2,400 కోట్లు.
- 2025-26 సంవత్సరానికి మేజర్, మీడియం, మైనర్ నీటి పారుదల వనరుల నిర్వహణకు సంబంధించిన 7,197 పనులకు రూ.344.39 కోట్లతో పరిపాలనా ఆమోదం.

లులూ... అతి షరతులు!

ప్రభుత్వ భూములు తీసుకుంటూ... ప్రభుత్వానికే కండిషన్లా?

- రాష్ట్రానికే తన అవసరమున్నట్లుగా సంస్థ తీరు
- క్యాబినెట్ భేటీలో పవన్ కల్యాణ్ వరుస ప్రశ్నలు
- లులూ అతి షరతులపై చంద్రబాబు అసహనం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



లులూ గ్రూప్‌కు భూకేటాయింపుపై మంత్రివర్గ సమావేశంలో ఆసక్తికరమైన చర్చ జరిగింది! ఆ సంస్థ షరతులు మరీ అతిగా ఉన్నాయని... రాష్ట్రానికే తన అవసరం ఉన్నదన్నట్లుగా వ్యవహరిస్తోందనే అభిప్రాయం వ్యక్తమైంది. లులూ ప్రతిపాదిత కార్యకలాపాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వరుస ప్రశ్నలు సంధించారు. సందేహాలు లేవనెత్తారు. దీనిపై అధికారులతోపాటు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. సీఎం చంద్రబాబు సైతం లులూ గ్రూప్ షరతుల విషయంలో ఒకింత అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం మంత్రిమండలి సమావేశం అయింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... కృష్ణాజిల్లా మల్లవల్లి మెగా ఫుడ్ పార్కులో లులూగ్రూప్‌లో భాగమైన మెస్సర్స్ ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్‌కు 7.48ఎకరాలను కోర్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు లీజుకు ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చింది. ఆ సమయంలో... ఆహారశుద్ధి పేరిట అక్కడ ఏం చేస్తారో సమాచారం ఉందా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఆహారాన్నే శుద్ధి చేస్తారని అధికారులు బదులిచ్చారు. "ఆహారశుద్ధి అని ఊరికే అంటే కుదరదు. అక్కడ అసలు ఏం పని చేస్తారు? కూరగాయలు, పండ్లు సాగుచేస్తారా? ఉద్యానవన పంటలు సాగుచేస్తారా? లేక కబేళాను నిర్వహించి గోవధ చేసి ఆ మాంసాన్ని ఎగుమతి చేస్తారా?" అని పవన్ సూటిగా ప్రశ్నించారు. గోవధ జరగడానికి వీల్లేదని, ఇందుకు తాము పూర్తి వ్యతిరేకమని స్పష్టం చేశారు. దీంతో అధికారులు నీళ్లు నమిలారు. ఫుడ్ ప్రాసెసింగ్ అంటూనే పొంతనలేని సమాధానాలు చెబుతుండటంతో చంద్రబాబు జోక్యం చేసుకున్నారు. రాష్ట్ర పరిధిలో ఎక్కడా గోవధ జరగడానికి వీల్లేదని, అలాంటి వాటిని అనుమతించబోమని స్పష్టంచేశారు. అక్కడ ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. మామిడి, బొప్పాయి వంటి పండ్లు మాత్రమే ప్రాసెస్ చేస్తారని చెప్పారు. ఆ తర్వాత లులూ గ్రూప్ వ్యవహారశైలి, దానికి భూ కేటాయింపులు, స్థానికంగా ఉద్యోగాల కల్పన, రెంటల్ అగ్రిమెంట్లు వంటి పలు కీలక అంశాలను పవన్ ప్రస్తావించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా ఇవే అంశాలను లేవనెత్తారు.


ప్రాతిపదిక ఏమిటి?

లీజు మొత్తాన్ని 5 సంవత్సరాలకు 5 శాతం మాత్రమే పెంచడం గురించి మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. నిబంధనల ప్రకారం 3 ఏళ్లకు 10 శాతం పెంచాలి కదా అని ప్రశ్నించారు. దీనికి సంబంధిత అధికారులు స్పందిస్తూ.. 'లులూ యాజమాన్యం పదే పదే కోరడంతో పాటు పెద్ద పరిశ్రమ, ఉపాధి కల్పనను దృష్టిలో పెట్టుకుని సడలింపు ఇచ్చాం' అని తెలిపారు. లులూ గ్రూప్ చాలా అతిగా కండీషన్లు పెడుతోందని, ప్రభుత్వానికే తన అవసరం ఉందన్నట్లుగా వ్యవహరిస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నట్లు తెలిసింది. విశాఖపట్నం, విజయవాడల్లో ఆ సంస్థకు ఏ ప్రాతిపదికన భూములు కేటాయిస్తున్నారు? ఇందుకు అనుసరిస్తున్న విధానాలు, మార్గదర్శకాలు ఏమిటి? అని ప్రశ్నించారు. "లులూ గ్రూప్‌కు ప్రభుత్వం భూములు ఇచ్చి మాల్స్ ఏర్పాటు చేయమంటోంది. ప్రభుత్వమే భూములు ఇస్తోంది. కానీ... షరతులు ఆ కంపెనీ పెడుతోంది. ఇదెక్కడి చోద్యం? మూడు సంవత్సరాలకోసారి లీజు పెంచాలని ప్రభుత్వ రెంటల్ అగ్రిమెంట్స్‌లో ఉంటోంది. కానీ, ఆ కంపెనీ పదేళ్లకోసారి పెంచాలని కండీషన్ పెడుతోంది? వీటిపై మీరేం చెబుతున్నారు? మాల్స్ నిర్మించాక, ఆ కంపెనీ షాప్‌ల రెంట్ ఎలా పెంచుతుంది? మూడేళ్లకోసారి అద్దెలు పెంచుతారా? లేక పదేళ్లకోసారి పెంచుతామని చెబుతారా? కచ్చితంగా ఏటేటా అద్దె పెంచుకుంటారు కదా! వారికో న్యాయం? ప్రభుత్వానికో న్యాయం! ఇలా ఎక్కడైనా ఉంటుందా? దీనిపై మీరేమంటారు?" అని పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది.

ఉద్యోగాలు ఎవరికి ఇస్తారు?

లులూ ఏర్పాటు చేసే మాల్స్, సంస్థల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడంపైనా పవన్ కల్యాణ్ పలు ప్రశ్నలు సంధించారు. "విశాఖ, విజయవాడలో లులూ గ్రూప్ ఏర్పాటు చేసే మాల్స్‌లో, సంస్థల్లో ఉద్యోగాలు ఎవరికి ఇస్తారు? స్థానికులకు ఏ మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు? సహజంగా ఆ కంపెనీ తన సొంత మనుషులనే సిబ్బందిగా నియమించుకుంటుందని విన్నాం. ఇక్కడా అలాగే జరుగుతుందా? అదే జరిగితే ఇక్కడ భూములు ఇచ్చి ఏం లాభం? కచ్చితంగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో మీరు ఎలాంటి విధానం అనుసరించబోతున్నారు?" అని పవన్ సూటిగా ప్రశ్నించినట్లు తెలిసింది. స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చే విషయంలో కచ్చితమైన నిబంధనలు చేర్చుతున్నామని అధికారులు నివేదించారు. లులూ గ్రూప్ కొన్ని అతి షరతులు పెడుతున్న మాట వాస్తవమేనని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నట్లు తెలిసింది. "జగన్ ప్రభుత్వం ఆ కంపెనీని రాష్ట్రం నుంచి తరిమివేసింది. కూటమి ప్రభుత్వం ఆ కంపెనీని తిరిగి ఏపీకి తీసుకురావాలనుకుంటోంది. అయితే.. ఆ కంపెనీ అనేక షరతులు విధిస్తోంది. వాటిని పరిశీలిస్తున్నాం. ప్రజలకూ, రాష్ట్రానికీ మేలుచేసే విధంగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది" అని మంత్రి అనగాని బదులిచ్చినట్లు తెలిసింది. లులూ గ్రూప్ షరతుల విషయంలో ముఖ్యమంత్రి కూడా ఒకింత అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఉత్తరాంధ్రకు ఎంతో చేస్తున్నాం



అయినా చెప్పుకోవడంలో విఫలమవుతున్నాం: సీఎం

- ఇవన్నీ మంత్రులు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- క్యాబినెట్ భేటీలో చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా విశాఖకు, ఉత్తరాంధ్రకు చాలా చేస్తున్నామని.. అయినా వాటిని చెప్పుకోవడంలో విఫలమవుతున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చాలా చేశామని, మన ప్రయత్నాల వల్లే అది ప్రైవేటీకరణ కాకుండా.. మూత పడకుండా కాపాడగలిగామన్నారు. శుక్రవారం క్యాబినెట్ భేటీలో ఎజెండా అంశాలపై చర్చ అనంతరం మంత్రివర్గ సహచరులనుద్దేశించి ఆయన మాట్లాడారు. విశాఖకు రైల్వే జోన్, ఐటీ సంస్థలు, త్వరలోనే గూగుల్ డేటా సెంటర్ వంటివి వస్తున్నాయని.. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు త్వరలో శంకుస్థాపన కూడా చేయబోతున్నామని.. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రులను కోరారు. పర్యాటక ప్రాజెక్టులు తీసుకున్న వారెవరూ తనను కలవడం లేదని.. కార్యదర్శులను కలిసి మాట్లాడుకుని వెళ్లిపోతున్నారని మంత్రి కందుల దుర్గేశ్ సీఎం దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించారు. శాఖల నిర్వహణలో కార్యదర్శుల పాత్ర కీలకమే అయినా ముందుండి నడిపించాల్సింది మంత్రులేనని స్పష్టం చేశారు. ఎవరైనా పనిచేయకపోతే పిలిచి మందలించాలని, అధికారులతో మంచిగా పనిచేయించుకోవలసిన బాధ్యత మంత్రులదేనని స్పష్టం చేశారు. 'మీ శాఖలో జరిగే మంచిని ప్రచారం చేసుకోకపోతే నష్టపోయేది మీరే. రేపు ఎన్నికల్లో పోటీ చేయాల్సింది మీరే గానీ కార్యదర్శులు కాదు. ఇది గుర్తు పెట్టుకుని మీ శాఖల పనితీరును మెరుగుపరచడంలో కీలకంగా వ్యవహరించండి ఆ క్రెడిట్ కూడా తీసుకోండి' అని దిశానిర్దేశం చేశారు.

ఇన్ని పెట్టుబడులు నా 15 ఏళ్లలో తీసుకురాలేదు

తాను సీఎంగా 15 ఏళ్ల పూర్తి చేసుకున్నానని, తన మొత్తం పదవీకాలంలో ఈ ఏడాదిన్నరలో తీసుకొచ్చినన్ని పెట్టుబడులు తీసుకురాలేదని సీఎం చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. గూగుల్ డేటా సెంటర్ మనకు రావడం చాలా మంచి పరిణామమన్నారు. పారిశుధ్య కార్మికులను స్కావెంజర్స్ వంటి పదాలతో పిలవడమనే సంస్కృతిని మార్చాల్సిన అవసరం ఉందని ప్రస్తావించగా.. సీఎం ఏకీభవించారు. రాజధాని ప్రాంతంలో ప్రభుత్వ సమావేశాలకు కాన్ఫరెన్స్ హాలు కట్టడం మంచిదన్న మంత్రి లోకేశ్ సూచనతో మంత్రులంతా ఏకీభవించారు. పశ్చిమ తీరంలో ముంబై నగరం ఏ స్థాయిలో అభివృద్ధి చెందిందో.. తూర్పుతీరంలో విశాఖ కూడా అదే స్థాయిలో అభివృద్ధి చెందుతుందని సీఎం చెప్పారు.

కులమతాల చిచ్చు వైసీపీ ఎజెండా: లోకేశ్

క్యాబినెట్ భేటీకి ముందు మంత్రి లోకేశ్ వద్ద మంత్రుల అల్పాహార సమావేశం జరిగింది. పలు చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహాన్ని వైసీపీ సర్పంచ్ దహనం చేసి ప్రభుత్వంపై నిందలు వేశారని, నిందితులపై కేసు పెడితే సిగ్గు లేకుండా వైసీపీ వాళ్లు ఆందోళన చేస్తున్నారని లోకేశ్ మండిపడ్డారు. కులాలు, మతాలు మధ్య చిచ్చు పెట్టడమే వైసీపీ వారి ఎజెండా అని ధ్వజమెత్తారు. ఘటనాస్థలానికి వెళ్లాలని హోం మంత్రి అనితకు సూచించారు.

క్యాబినెట్ ముందుకురాని క్వాంటమ్ పాలసీ

ఆర్థికశాఖ జాప్యం చేయడంతో క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ క్యాబినెట్ ముందుకు రాలేదు. దీనిపై ఐటీశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌ను సీఎం ఆరా తీశారు. ఆర్థిక శాఖ శుక్రవారం ఉదయమే ఈ ఫైలును పంపిందని.. న్యాయశాఖ, సీఎం, మంత్రి లోకేశ్, సీఎస్ ఆమోదించిన తర్వాతే క్యాబినెట్ ముందు పెట్టాల్సి ఉన్నందున.. ఈ ప్రతిపాదనను వచ్చే మంత్రివర్గ భేటీకి వాయిదా వేసినట్లు ఐటీ శాఖ వివరించింది.

'పంచాయతీ' ప్రక్షాళన

4 గ్రేడ్లుగా 13,351 గ్రామ పంచాయతీల విభజన.. అధిక జనాభా ఉన్న 359 రూర్బన్ పంచాయతీలు

- మిగిలినవి గ్రేడ్-1, 2, 3గా గుర్తింపు
- మరో సంస్కరణకు మంత్రివర్గం ఆమోదం

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి సర్కారు వచ్చిన తర్వాత పంచాయతీరాజ్ శాఖ ప్రక్షాళనలో వేగం పుంజుకుంది. ఉద్యోగుల పదోన్నతుల సమస్య పరిష్కారానికి ఆ శాఖ చేసిన మొదటి ప్రతిపాదనకు ఈ ఏడాది ఏప్రిల్‌లో రాజముద్ర పడగా, తాజాగా రెండో విడత సంస్కరణలకు శుక్రవారం క్యాబినెట్ ఆమోదం తెలిపింది. క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర గ్రామ పంచాయతీలుగా మార్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. గతంలో పంచాయతీలను 7,244 క్లస్టర్లుగా గుర్తించారు. ఇకనుంచి ప్రతి పంచాయతీ స్వతంత్ర పంచాయతీగా కొనసాగనుంది. ఇప్పటికే పంచాయతీల పునర్విభజన కోసం నియమించిన కమిటీ 13,351 పంచాయతీలను నాలుగు గ్రేడ్‌లుగా విభజించింది. రూర్బన్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలుగా గుర్తిస్తారు. అధిక జనాభా, ఆదాయం కలిగిన 359 గ్రామ పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా గుర్తించి, వాటికి అధికారులుగా గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించి నియమిస్తారు. ఇకనుంచి పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారులు(పీడీఓ)గా పిలవనున్నారు. రూర్బన్ పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీఓ క్యాడర్ అధికారులను నియమిస్తారు. ఆ 359 పంచాయతీల్లో ఉన్న 1097 మంది జూనియర్ అసిస్టెంట్/జూనియర్ అసిస్టెంట్ కమ్ బిల్లు కలెక్టర్లలో సీనియారిటీ బట్టి 359 మందికి పదోన్నతులు కల్పిస్తారు. వారిని రూర్బన్ పంచాయతీల్లోనే సీనియర్ అసిస్టెంట్‌లుగా నియమించి పాలనను మరింత మెరుగుపరచనున్నారు. పంచాయతీల విభజనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

మున్సిపాలిటీల తరహాల్లో విభాగాలు

పంచాయతీరాజ్ ప్రక్షాళనలో భాగంగా మంత్రిమండలి ఆమోదించిన మేరకు మున్సిపాలిటీ తరహాలో గ్రామ పంచాయతీల్లోనూ పలు విభాగాలు ఏర్పాటు చేస్తారు. మున్సిపాలిటీల్లో ఆయా విభాగాల ద్వారా సేవలందించినట్లే.. గ్రామ పంచాయతీల్లోనూ పలు విభాగాల ద్వారా విస్తృతమైన సేవలు అందుబాటులోకి తెస్తారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, గ్రామీణ ప్రణాళిక విభాగం, వీధిలైట్లు విభాగం, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలుగా విభజించనున్నారు. ఈ విభాగాల ద్వారా సేవలందించేందుకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించుకోవచ్చు. వారికి గ్రామ పంచాయతీల సాధారణ నిధుల నుంచి జీతాలు చెల్లిస్తారు. అదనంగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లను ఇక గ్రామ పంచాయతీల్లో గ్రామీణ ప్లానింగ్ అసిస్టెంట్లుగా గుర్తించి వారి సేవలను వినియోగించుకుంటారు. వారి ఆధ్వర్యంలో గ్రామాల్లో భవనాలు, లేఅవుట్ రూల్స్ అమలు చేస్తారు. మినిస్టీరియల్, ఎగ్జిక్యూటివ్ సిబ్బందికి సమానంగా పదోన్నతుల చానల్‌ను కూడా రూపొందిస్తారు. పంచాయతీరాజ్‌లో ప్రత్యేకమైన ఐటీ విభాగాన్ని ఏర్పాటు చేసి అదనంగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బందిని ఉపయోగించి గ్రామ పంచాయతీల్లో డిజిటల్ విభాగాన్ని అభివృద్ధి చేస్తారు. గ్రామ పంచాయతీల్లో రికార్డులు డిజిటలైజ్ చేసి రియల్‌టైమ్‌లో గ్రామ పంచాయతీల ద్వారా సర్వీసులు అందించేందుకు యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని నిర్ణయిస్తూ కేబినెట్‌లో ఆమోదం తెలిపారు. పంచాయతీరాజ్ ప్రక్షాళనలో భాగంగా ఇప్పటికే 2 రకాల సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం మరో 10 రకాల సంస్కరణలకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పంచాయతీరాజ్ వ్యవస్థలో మార్పులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు రూపొందించిన సంస్కరణ ప్రక్రియను సానుకూలంగా స్వాగతించిన ముఖ్యమంత్రి.. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, అధికారులకు సూచించినట్లు సమాచారం. కాగా, పంచాయతీరాజ్ ప్రక్షాళనలో మొదట ఉద్యోగుల పదోన్నతుల సమస్యలను ఒక కొలిక్కి తెచ్చిన తర్వాత మిగిలిన సంస్కరణలు తీసుకురావాలని ప్రభుత్వం భావించింది. అందుకే మొదట ఉద్యోగుల క్యాడర్ విషయంలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా చేయాలని నిర్ణయించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రక్షాళనలో అతి ముఖ్యమైన సర్వీసు విషయాలపై ముందు దృష్టి సారించారు.

ట్రేడింగ్‌లో నష్టపోయి

సొంతింటికే కన్నం

- స్నేహితుల సాయంతో దొంగతనం
- నలుగురిని అరెస్టు చేసిన విశాఖ పోలీసులు

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పంతొమ్మిదేళ్ల కుర్రాడు స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేసి డబ్బులు పోగొట్టుకుని, అప్పులు పాలయ్యాడు. వాటిని తీర్చేందుకు సొంత ఇంటికే కన్నం వేయడానికి స్నేహితులతో కలసి ప్లాన్ వేశాడు. దొంగతనం విజయవంతంగా పూర్తయ్యాక ఏమీ తెలియనట్లు, గుర్తు తెలియని వ్యక్తులు నానమ్మను, తనను కొట్టి రూ. 3 లక్షల నగదు, 12 తులాల బంగారం అపహరించినట్లు అందర్నీ నమ్మించబోయాడు. కానీ పోలీసుల విచారణలో గుట్టు బయటపడింది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఈ దొంగతనం కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఆ వివరాలను శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపీ శంఖబ్రతబాగ్చి వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. విశాఖపట్నంలోని రెడ్డికంచరపాలెం ఇందిరానగర్-5లో జీవీఎంసీ కాంట్రాక్టర్ ధర్మాల ఆనందకుమార్‌రెడ్డి తన తల్లి యల్లయ్యమ్మ, భార్య కోమలి, కుమారుడు కృష్ణకాంత్ రెడ్డి, కుమార్తెతో కలిసి రెండంతస్తుల భవనంలో నివసిస్తున్నారు. ఓ కార్పొరేట్ కాలేజీలో బీబీఎం రెండో సంవత్సరం చదువుతున్న కృష్ణకాంత్‌రెడ్డి స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేసి డబ్బులు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చే మార్గం లేక తమ ఇంట్లో దోపిడీకి స్నేహితులతో కలసి ప్రణాళిక రూపొందించాడు. ఇంజనీరింగ్ చదువుతున్న షేక్ అభిషేక్, అవసరాల సత్యసూర్యకుమార్, పరపతి ప్రమోద్‌కుమార్‌తో కలసి దోపిడీకి సిద్ధపడ్డాడు. కృష్ణకాంత్‌రెడ్డి తండ్రి ఓ శుభకార్యానికి హాజరుకావడానికి ఈనెల నాలుగున హైదరాబాద్‌కు వెళ్లారు. ఐదో తేదీ అర్ధరాత్రి దోపిడీకి స్కెచ్ వేశారు. దీనికోసం ముందుగానే కృష్ణకాంత్‌రెడ్డి తన ఇంట్లో సీసీ కెమెరాలను పనిచేయకుండా చేశాడు. కింది పోర్షన్‌లో తాను, నానమ్మ ఉంటామని, పై పోర్షన్‌లో తల్లి, చెల్లి ఉంటారని ముందే ఫ్రెండ్స్‌కు చెప్పాడు. కింది పోర్షన్‌లో వెనుక వైపు తలుపునకు గడియ పెట్టకుండా వదిలేశాడు. లోపలికి వచ్చిన వెంటనే తనతోపాటు తన నానమ్మ నోటికి ప్లాస్టర్ వేసి, కాళ్లు, చేతులు ప్లాస్టర్లతో బంధించాలని, హిందీలోనే మాట్లాడాలని ఫ్రెండ్స్‌కు సూచించాడు. ఆ ప్లాన్ ప్రకారమే స్నేహితులు ఇంట్లోకి చొరబడి ముందుగా అతడి నానమ్మను బంధించి మెడలోని ఆభరణాలను లాక్కున్నారు. ఆ తర్వాత బెడ్‌రూమ్‌లోని బీరువాలో బంగారం, నగదుని తస్కరించారు. దోపిడీ తర్వాత ఇంటి ముందు ఉన్న కారును తీసుకుని సీసీ కెమెరాలు పెద్దగా లేని ఎన్ఏడీ, సింహాచలం, హనుమంతవాక మీదుగా మారికవలస వెళ్లి అక్కడ నిర్మానుష్యంగా ఉన్నచోట కారు వదిలేశారు. అక్కడి నుంచి ఆటోలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుని విజయవాడ, హైదరాబాద్‌లకు వెళ్లారు. అయితే పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సెల్‌ఫోన్ డేటా ద్వారా కృష్ణకాంత్‌రెడ్డే సూత్రధారి అని గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా, నేరాన్ని అంగీకరించాడు. నిందితులను పోలీసులు చోరీసొత్తుతో సహా అరెస్టు చేశారు. మూడు రోజుల్లో దోపిడీ కేసును ఛేదించిన కంచరపాలెం క్రైమ్ పోలీసులు, సీసీఎస్ పోలీసులను సీపీ అభినందించారు. ఈ సమావేశంలో క్రైమ్ ఏడీసీపీ లతామాధురి, ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి పాల్గొన్నారు.

ఆ కంపెనీలకు

4 ఎకరాలే!

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): టాప్-100 ఫార్చ్యూన్ కంపెనీల జాబితాలో లేని ద్వితీయ శ్రేణి కంపెనీలకు భూ కేటాయింపులకు సంబంధించి 'రాష్ట్ర భూ ప్రోత్సాహక విధానం'లో సవరణ తెచ్చిన ఐటీ శాఖ దాన్ని క్యాబినెట్ ముందుంచింది. కనీసం రూ.50 కోట్ల పెట్టుబడి పెట్టగలిగి.. కనిష్ఠంగా 250మందికి ఉద్యోగాలిచ్చి.. ఏడాదిలోగా వాణిజ్య కార్యక్రమాలను చేపడతామంటూ కంపెనీలు లిఖితపూర్వక హామీ ఇవ్వాలి. అప్పుడే ఎకరా రూ.5 కోట్ల వంతున నాలుగెకరాలు కేటాయిస్తామని ప్రతిపాదించింది. భూ కేటాయింపులు జరిగిన ఏడాదిలోగా వ్యాపార కార్యకలాపాలు మొదలుపెట్టకపోయినా.. 250 మందికి ఉద్యోగాలివ్వకపోయినా కేటాయించిన భూమికి మార్కెట్ విలువను వసూలు చేస్తామని ఐటీ శాఖ స్పష్టం చేసింది.

12 పంపులు.. 3,850 క్యూసెక్కులు

- హంద్రీ నీవా నుంచి కృష్ణా జలాల ఎత్తిపోత
- ట్రయల్ రన్ విజయవంతం



హంద్రీ నీవా ప్రాజెక్టు బ్రాహ్మణకొట్కూరు పంపింగ్ స్టేషన్-2 నుంచి 12 పంపుల ద్వారా కృష్ణా జలాలను ఎత్తిపోస్తున్న దృశ్యం

కర్నూలు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జీవనాడి హంద్రీ నీవా ప్రాజెక్టు చరిత్రలో తొలిసారిగా నంద్యాల జిల్లా బ్రాహ్మణకొట్కూరు పంపింగ్ స్టేషన్-2 నుంచి 12 పంపుల ట్రయల్ రన్‌ను విజయవంతం చేసిన ఇంజనీర్లు రికార్డు నెలకొల్పారు. దీంతో సీఎం చంద్రబాబు సంకల్పం సాకారమైంది. ఇక్కడి నుంచి పూర్తిస్థాయి సామర్థ్యంతో 3,850 క్యూసెక్కులు ఎత్తిపోసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ ఎస్ఈ పాండురంగయ్య, ఈఈ ప్రసాద్‌రావు తెలిపారు. ప్రస్తుతం అవసరాన్ని బట్టి 9నుంచి 10 పంపుల ద్వారా 3,150 నుంచి 3,500 క్యూసెక్కుల కృష్ణా జలాలను ఎత్తిపోస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం హంద్రీ-నీవా ప్రధాన కాలువ విస్తరణపై దృష్టి సారించింది. రూ.3,900 కోట్లతో ఈ ఏడాది మార్చి 15న విస్తరణ పనులు మొదలు పెట్టి జూలై 15 నాటికి 120 రోజుల్లో దాదాపు పూర్తి చేశారు. అదేనెల 17న సీఎం చంద్రబాబు కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి పంపులు ఆన్ చేశారు. నాటి నుంచి అవసరం మేరకు 7 నుంచి 9 పంపులు రన్ చేస్తూ కృష్ణా వరద జలాలు కరువు పల్లెసీమలకు ఎత్తిపోశారు. రబీ సీజన్ ప్రారంభం కావడంతో రైతుల నుంచి సాగునీటికి డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. దీంతో ఏకకాలంలో ట్రయల్ రన్ కింద 12 పంపులు ఆన్ చేసి విజయవంతంగా 3,850 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు.



కనెక్టింగ్ సిఫీ

- అమెరికా నుంచి విశాఖకు డేటా కేబుళ్లు
- గూగుల్, మెటా సంస్థలతో భాగస్వామ్యం
- సిఫీకి రేపు లోకేశ్ చేతుల మీదుగా భూమి పూజ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆసియాలోనే అతి పెద్ద డేటా కేంద్రంగా అవతరిస్తున్న విశాఖపట్నం.. అమెరికాతో అనుసంధానం కాబోతోంది. అమిత వేగంతో డేటా బదిలీ చేయడానికి అవసరమైన సముద్రగర్భ (సబ్‌మెరైన్) కేబుల్ పనులు ఊపందుకుంటున్నాయి. ఇక్కడ ఏర్పాటవుతున్న డేటా సెంటర్లతో ఆ కేబుళ్లను అనుసంధానించడానికి సిఫీ టెక్నాలజీస్ సిద్ధమైంది. గూగుల్ సంస్థ బ్లూరామన్ పేరుతో సబ్‌మెరైన్ కేబుళ్లను విశాఖపట్నం తీసుకువస్తోంది. వీటిని డేటా సెంటర్‌తో అనుసంధానం చేయడానికి సిఫీ ఒప్పందం చేసుకుంది. అదేవిధంగా మెటా సంస్థ కూడా అమెరికా నుంచి బ్రెజిల్, భారత్, దక్షిణాఫ్రికా తదితర దేశాలకు 50 వేల కి.మీ. పొడవున సబ్‌మెరైన్ కేబుల్ వేయడానికి ఒప్పందాలు చేసుకుంది. భారత్‌లో ముంబై, విశాఖ నగరాలను ల్యాండింగ్ సెంటర్లుగా ఎంపిక చేసింది. మెటా సంస్థ విశాఖకు తీసుకువచ్చే సబ్‌మెరైన్ కేబుల్‌ను డేటా సెంటర్లకు అనుసంధానం చేసే బాధ్యతను కూడా సిఫీనే తీసుకుంది. విశాఖలో అతి పెద్ద డేటా సెంటర్లను కేబుల్‌తో అనుసంధానం చేసే సిఫీ టెక్నాలజీస్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖకు సమీపాన ఓజోన్ వ్యాలీలో 25 ఎకరాలు కేటాయించింది. అందులో ఆదివారం భూమి పూజ చేయడానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్ విశాఖకు వస్తున్నారు.

ఆ మూడూ అత్యంత ప్రధానం

డేటా సెంటర్ల నిర్వహణలో విద్యుత్, నీరు, కేబుళ్లు కీలకపాత్ర వహిస్తాయి. వీటికి వేల మెగావాట్ల విద్యుత్ అవసరం. విశాఖలో ఏర్పాటయ్యే ఒక్క గూగుల్ డేటా సెంటర్‌కే 2,500 మెగావాట్ల విద్యుత్ అవసరమని అధికారులు అంచనాకు వచ్చారు. దీనికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా డేటా సెంటర్ల కూలింగ్‌కు మిలియన్ గ్యాలన్ల నీరు కావాలి. అవసరమైన నీటిని పోలవరం ఎడమ కాలువ నుంచి వచ్చే 24 టీఎంసీల నుంచి ఉపయోగించుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇక మూడో ముఖ్యమైన అంశమైన సముద్రగర్భ (అండర్ సీ) కేబుల్‌ను అమెరికా నుంచి వేసుకుంటూ రావడానికి అడుగులు పడ్డాయి.

డేటా సెంటర్ల సిటీగా విశాఖ

విశాఖలో డేటాసెంటర్లు ఏర్పాటుకు దిగ్గజ సంస్థలు ముందుకొస్తున్నాయి. వాటికి భూములను రాష్ట్రప్రభుత్వం సమకూర్చుతోంది. డేటా సెంటర్ ఏర్పాటుకు విశాఖలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌కు ప్రభుత్వం భూమి కేటాయించింది. విశాఖలో అదానీ డేటాసెంటర్ ఏర్పాటుకు గతంలోనే అనుమతులు లభించాయి. కాగా, పెద్ద మొత్తంలో ఉన్న సమాచారాన్ని క్షణాల్లో తెలుసుకోవడానికి డేటా సెంటర్లకు ఏఐని అనుసంధానం చేస్తారు. ఒక్క కమాండ్ ఇవ్వగానే డేటాను ఏఐ మైనింగ్ చేసి, దాన్ని విశ్లేషించి అందిస్తుంది. ఇదంతా సూపర్‌ఫాస్ట్ కంప్యూటర్ల ద్వారా క్షణాల్లో జరిగిపోతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న డేటాను శోధించి, సమాచారం ఇవ్వాలంటే అత్యంత వేగవంతమైన నెట్‌వర్క్ కావాలి. దాని కోసమే సబ్‌మెరైన్ కేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు.



నెల్లూరు జిల్లా ఈదగాలిలో నంద గోకులం లైఫ్ స్కూలులో విద్యార్థుల కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఆసక్తిగా పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన ఫౌండేషన్ చైర్మన్ చింతా శశిధర్, వేమిరెడ్డి, సోమిరెడ్డి

2047కల్లా ఏపీ నంబర్ వన్

- గేమ్ చేంజర్ పాత్రలో రాష్ట్రం: చంద్రబాబు
- 88 వేల కోట్లతో విశాఖలో మూడేళ్లలో ఏఐ ఇన్ఫర్మేషన్ సెంటర్
- నెల్లూరు జిల్లా ఈదగాలిలో విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్ ప్రారంభం

> రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులు, సంపన్నులను నేను కోరేదొక్కటే. సమాజం మీకెంతో ఇచ్చింది. ఇప్పుడు మీరు సమాజానికి ఇవ్వాల్సిన రోజు వచ్చింది. గివ్ బ్యాక్ టు ది సొసైటీ. 'పీ-4' ద్వారా పేదలకు చేయూతనివ్వండి.
>
> \- సీఎం చంద్రబాబు

నెల్లూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): భారత్ 2047కల్లా ప్రబల ఆర్థికశక్తిగా ఆవిర్భవిస్తుందని.. ప్రపంచంలో నంబర్‌వన్ స్థానంలో ఉంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. అప్పటికి ఆంధ్రప్రదేశ్ కూడా దేశంలో నంబర్‌వన్ స్థానంలో ఉంటుందని చెప్పారు. పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో రాష్ట్రం గేమ్ చేంజర్ పాత్ర పోషిస్తుందన్నారు. ప్రపంచంలో తెలుగుజాతి నంబర్‌వన్ స్థానంలో ఉంటుందని తెలిపారు. విశాఖలో రూ.88 వేల కోట్లతో ఏఐ సెంటర్ రాబోతోందని.. ఇది రాష్ట్ర భవిష్యత్‌కు గేమ్ చేంజర్ కానుందని వెల్లడించారు. శుక్రవారం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్‌ను, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శశిధర్ పేరుతో నెలకొల్పిన చింతా శశిధర్ ఫౌండేషన్ నిర్మించిన 'నందగోకులం లైఫ్ స్కూల్', 'నంది పవర్ ట్రెడ్‌మిల్ మిషన్', 'నందగోకులం సేవ్ ది బుల్' ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, జేసీ పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. మన ముందు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. మనతోపాటు పేద వర్గాలకూ గొప్ప భవిష్యత్ అందించే ఉద్దేశంతోనే పీ-4 కార్యక్రమం ప్రవేశపెట్టానని చెప్పారు. దాని స్ఫూర్తిని కొనసాగించే విషయంలో విశ్వసముద్ర సంస్థ, చింతా శశిధర్ ఫౌండేషన్ సేవలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. ఇంకా ఏమన్నారంటే..

మూడో తరగతి విద్యార్థులకు ఏఐలో తర్ఫీదు..

'ఈ రోజు ఇక్కడ చింతా శశిధర్ ఫౌండేషన్ స్థాపించిన స్కూలును చూశాను. మూడో తరగతి విద్యార్థులు మిషన్ మెకనైజేషన్, ఏఐలో తర్ఫీదు పొందుతున్నారు. భవిష్యత్‌పై నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం చూసి నాకు ధైర్యం వచ్చింది. రాబోయే తెలుగు తరాల పిల్లలు ప్రపంచ సాంకేతిక రంగాన్ని శాసిస్తారు. ఇందులో ఎలాంటి అనుమానమూ లేదు.

ఆర్థిక ఫలాలు పేదలు అందుకోవాలి

ఆర్థిక ఫలాలు పేదలు అందుకోవాలనేదే నా తపన. అందుకే పీ-4 ప్రవేశపెట్టాను. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు... ఇంత కాలం సమాజం నుంచి తీసుకున్నారు. ఇప్పుడు సమాజానికి ఎంతోకొంత తిరిగిచ్చే సమయం వచ్చింది. మీరు సంపాదించినదానిలో కొంత పేదలకు ఇవ్వండి. పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు మారడానికి చేయూతనివ్వండి. శశిధర్ ఫౌండేషన్ చేసిన సేవలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. నందిని లైఫ్ స్కూల్ ఒక అద్భుత పాఠశాల. పేద విద్యార్థులను దత్తత తీసుకుని వారికి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందిస్తున్నారు. ఇలాంటి స్ఫూర్తి కావాలి. ఫౌండేషన్ సేవలు మరింత మందికి ఆదర్శం కావాలి. అప్పుడే పేదరికం లేని సమాజం సాకారం అవుతుంది. విశ్వసముద్ర సంస్థ, శశిధర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం. బయో ఇథనాల్ ప్లాంట్ ద్వారా వాతావరణ సమతుల్యతతోపాటు రైతులకు మేలు జరుగుతుంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బయో ఇథనాల్‌ను వినియోగించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను అందిపుచ్చుకుని ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం. ఇక 'నందిని సేవ్ ది బుల్' ప్రాజెక్టు ఇప్పటి వరకు ఎప్పుడూ, ఎక్కడా చేయని సరికొత్త ఆవిష్కరణ. వారసత్వ సంపదగా మానవ నాగరికతతో బలమైన అనుబంధం కలిగిన ఎడ్ల జాతి అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నప్పుడు వాటి ద్వారా సరికొత్త ఆదాయ మార్గాలను ఈ ప్రాజెక్టు చూపింది. ఎద్దులను ట్రెడ్‌మిల్‌పై నడిపించడం ద్వారా విద్యుదుత్పత్తి చేసే విధానం అద్భుతం. బహుశా ఇలాంటి ప్రయోగం ఇప్పటి వరకు ఎక్కడా జరిగి ఉండదు. ఒకవైపు పర్యావరణ పరిరక్షణ.. మరోవైపు పశుజాతి సంరక్షణ.. ఇంకోవైపు పేద విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందిస్తున్న చింతా శశిధర్ ఫౌండేషన్‌ను ప్రభుత్వం తరపున అభినందిస్తున్నా.

సీఎంకు గవర్నర్ అభినందనలు

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సీఎం చంద్రబాబుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ 'ఎక్స్' వేదికగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. 'సీఎం చంద్రబాబు విజనరీ లీడర్. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిపథంలో నడుస్తుందన్న నమ్మకం ఉంది. ఆయన ఆయురారోగ్యాలతో ప్రజా సేవలో ముందుకు సాగాలి' అని ఆకాంక్షిస్తూ ట్వీట్ చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి స్వామి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొద్ది రోజులుగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు నిరసనలు చేస్తున్నారు. ఈ క్రమంలో సచివాలయ ఉద్యోగులు మంత్రిని కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పసివాడిని బలిగొన్న వేడి తేనీరు

- తెలియక తాగేయడంతో గొంతు కాలి దుర్మరణం

యాడికి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్లాస్క్‌లో పోసి పెట్టిన వేడి టీ తాగి. నాలుగేళ్ల పసివాడు ప్రాణాలు కోల్పోయాడు. రెండేళ్ల అతడి చెల్లెలు తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిపాలైంది. అనంతపురం జిల్లా యాడికి పట్టణంలో ఈ విషాదం చోటుచేసుకుంది. పట్టణంలోని చెన్నకేశవ కాలనీకి చెందిన రామస్వామి, చాముండేశ్వరి దంపతులకు కుమారుడు రుత్విక్ (4), కూతురు యశస్విని ఉన్నారు. ఈ నెల 8న తల్లిదండ్రులు పనులకు వెళ్లేటప్పుడు ఎప్పటిలానే వేడి వేడి టీ ప్లాస్క్‌లో పోసుకుని పక్కన పెట్టారు. ఆ వేడి వేడి టీని పిల్లలిద్దరూ గ్లాస్‌లలోకి ఒంపుకుని తాగారు. దీన్ని కుటుంబ సభ్యులు గమనించలేదు. టీ వేడికి పసివారి గొంతు లోపలిభాగంలో గాయాలయ్యాయి. నొప్పి భరించలేక ఇద్దరూ ఏడుస్తుండటంతో తల్లిదండ్రులు వారిని తాడిపత్రిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఒక రోజు చికిత్స చేసిన వైద్యులు, మరుసటి రోజు అనంతపురం వెళ్లాలని సూచించారు. దీంతో చిన్నారులిద్దరినీ గురువారం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రుత్విక్ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. యశస్వినికి చికిత్స కొనసాగుతోంది.

14 ఏళ్ల బాలుడికి..

28 ఏళ్ల వ్యక్తి గుండె



ఆస్పత్రిలోకి గుండెను తీసుకువెళ్తున్న వైద్య సిబ్బంది

తిరుపతి (వైద్యం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురైన 28 ఏళ్ల యువకుడి గుండె.. తిరుపతికి చెందిన 14 ఏళ్ల బాలుడికి పునర్జన్మనిచ్చింది. గుంటూరుకు చెందిన పి.విజయకృష్ణ (28) రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కుటుంబసభ్యులు ఆయనను గుంటూరులోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించిన వైద్యులు ఆ విషయాన్ని కుటుంబసభ్యులకు వివరించి అవయవదానంపై అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులు అంగీకరించారు. తిరుపతి జిల్లా సత్యవేడు ప్రాంతానికి చెందిన బాలుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గుండె మార్పిడి శస్త్రచికిత్స నిమిత్తం జీవన్‌దాన్ పోర్టల్‌లో ఈ బాలుడి పేరు నమోదు చేశారు. ఈ క్రమంలో గుంటూరులో ఓ వ్యక్తి బ్రెయిన్ డెడ్‌కు గురై అవయవదానానికి సిద్ధంగా ఉన్నారనే విషయం తెలుసుకున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి వారితో సంప్రదించి.. తన బృందంతో గుంటూరు చేరుకున్నారు. కిమ్స్ ఆస్పత్రి నిర్వాహకుల సూచనమేరకు ప్రభుత్వం ప్రత్యేక అంబులెన్సులు, ప్రత్యేక విమానం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో విజయకృష్ణ నుంచి గుండె సేకరించి గ్రీన్‌చానల్ ద్వారా ప్రత్యేక విమానంలో శుక్రవారం మధ్యాహ్నం విజయవాడ నుంచి తిరుపతికి తరలించారు. దాదాపు 6 గంటలు శ్రమించిన వైద్యులు గుండెమార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు.

ఏఐ కాల్స్‌తో బురిడీ!

- సీఎం చంద్రబాబు, దేవినేని ఉమా గొంతులతో టీడీపీ నేతలకు టోకరా



ఏఐతో వీడియో కాల్‌లో సీఎం చంద్రబాబు మాట్లాడుతున్నట్టుగా ఉన్న చిత్రం

విజయవాడ/ సత్తుపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ టికెట్ పేరిట డబ్బులు దండుకోవడానికి ఓ మోసగాడు మాజీ మంత్రి దేవినేని ఉమా అవతారం ఎత్తాడు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామానికి చెందిన మోరకొండ ఏడుకొండలు త్వరలో జరిగే ఎన్నికల్లో జడ్పీటీసీగా పోటీకి అవకాశం ఇవ్వాలని ఉమాను కోరారు. ఈ క్రమంలో ఉమా డీపీ ఉన్న నంబరు నుంచి 8న ఏడుకొండలికి వీడియోకాల్ వచ్చింది. అందులో ఉమాలాగే ఉన్న వ్యక్తి వాట్సాప్ కాల్ చేస్తానని చెప్పాడు. కాసేపటికి మామూలు కాల్ చేసి 'అన్న (చంద్రబాబు) మాట్లాడతారు' అని చెప్పాడు. అనంతరం చంద్రబాబు స్వరంతో ఓ వ్యక్తి కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడారు. జడ్పీటీసీగా అవకాశం ఇస్తానని, పేరు డైరీలో రాసుకున్నానని చెప్పి కాల్ కట్ చేశాడు. తర్వాత మొదటి వ్యక్తి ఫోన్ చేసి రూ.లక్ష ఫోన్‌పే చేయాలని డిమాండ్ చేశాడు. ఏడుకొండలు డబ్బు లేదని చెప్పడంతో 9న ఫోన్ చేస్తానని చెప్పాడు. అయితే విజయవాడలో శుభకార్యానికి వస్తూ ఏడుకొండలు దేవినేని ఉమా ఇంటికి వెళ్లారు. జరిగిన విషయం చెప్పడంతో గుట్టు రట్టయింది. దీనిపై బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉమా పేరు ఉపయోగించుకుని 20 రోజుల క్రితం భరత్ అనే యువకుడు జడ్పీటీసీ టికెట్ విషయమై డబ్బులు తీసుకురావాలని ఓ ఆశావహుడిని కంకిపాడు పిలిపించుకున్నట్టు పోలీసులు తెలిపారు.

సత్తుపల్లిలో మరో మోసం

తెలంగాణలో ఓ అగంతకుడు ఏఐతో మోసగించాడు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ అభిమానికి గతనెల 30న ఫోన్ చేసి తాను దేవినేని ఉమా పీఏనంటూ పరిచయం చేసుకొని.. ఉమా వీడియో కాల్‌లో మాట్లాడతారని చెప్పాడు. ఉమాను పోలిన వ్యక్తితో మాట్లాడించాడు. పేద పిల్లల చదువుకు సాయం చేయాలని కోరడంతో.. బాధితుడు రూ.35 వేలు బదిలీ చేశాడు. వారం తర్వాత సదరు వ్యక్తినుంచి మళ్లీ ఫోన్ వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీ-ఫాం ఇస్తామని, చంద్రబాబు మాట్లాడతారని చెప్పారు. వీడియో కాల్‌లో చంద్రబాబును పోలిన వ్యక్తి ఆయనతో మాట్లాడి, అభినందించారు. చంద్రబాబును కలిపిస్తానని సదరు వ్యక్తి నమ్మించాడు. సత్తుపల్లి నుంచి 18 మంది 8న విజయవాడ చేరుకున్నారు. సాయంత్రం వరకూ హోటల్ వద్ద వేచి చూసినా ఎవరూ రాకపోవడంతో ఆ వ్యక్తికి ఫోన్ చేశారు. అదే సమయంలో బిల్లు చెల్లించాలని హోటల్ యాజమాన్యం డిమాండ్ చేసింది. వాగ్వాదం జరగడంతో పోలీసుల వచ్చారు. విషయం తెలుసుకొని ఉమాకు ఫోన్ చేశారు. తాను ఎవరికి వీడియో కాల్ చేయలేదని ఆయన స్పష్టం చేయడంతో మోసం బట్టబయలైంది. ఏలూరు జిల్లాకు చెందిన వ్యక్తి ఈ మోసానికి పాల్పడినట్లు నిఘా వర్గాలు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది.

నకిలీ మద్యం కేసులో
ఏ1 జనార్దనరావు అరెస్టు

- గన్నవరం ఎయిర్‌పోర్టులో అదుపులోకి.. దక్షిణాఫ్రికా నుంచి ముంబై మీదుగా రాక



జనార్దనరావు గన్నవరం విమానాశ్రయంలో అరెస్టు చేస్తున్న దృశ్యం

విజయవాడ/రాయచోటి/ములకలచెరువు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో ఏ-1 నిందితుడు అద్దేపల్లి జనార్దనరావును అరెస్ట్ చేశారు. శుక్రవారం గన్నవరం విమానాశ్రయంలో ఎన్టీఆర్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్స్ (ఈఎస్‌టీఎఫ్) సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. దక్షిణాఫ్రికా నుంచి శుక్రవారం మధ్యాహ్నం ముంబై చేరుకున్న ఆయన.. అక్కడి నుంచి ఎయిరిండియా విమానం గన్నవరం వచ్చాడు. ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకుని రోడ్డుమార్గంలో ములకలచెరువుకు తరలించినట్టు తెలుస్తోంది. ములకలచెరువు కేసుతో పాటు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో నమోదైన నకిలీ మద్యం తయారీ కేసులోనూ ఆయన ప్రధాన నిందితుడు. ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ వ్యవహారం బయటకు వచ్చేసరికి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన అద్దేపల్లి జనార్దనరావు, టీడీపీ నుంచి సస్పెండైన తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి దక్షిణాఫ్రికాలో ఉన్నారు. దక్షిణాఫ్రికాలోనూ వారు డిస్టిలరీలను నిర్వహిస్తున్నారు. నకిలీ మద్యం తయారీకి సంబంధించి అన్నమయ్య జిల్లాలోను, ఎన్టీఆర్ జిల్లాలోను ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత అజ్ఞాతంలో ఉన్న జనార్దనరావు సెల్ఫీ వీడియోను మీడియాకు విడుదల చేశాడు. అప్పటి నుంచి ఎక్సైజ్ పోలీసులు జనార్దనరావుపై నిఘా పెట్టారు. మూడు రోజుల క్రితం నుంచి ఆయన విజయవాడ రావడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడు. ఓ పార్టీకి అనుకూలంగా ఉండే న్యాయవాదిని నియమించుకున్నాడు. గన్నవరం విమానాశ్రయానికి జనార్దనరావు చేరుకోవడానికి ముందుగానే న్యాయవాది అక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి జనార్దనరావు బయటకు రాగానే ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. కాగా, జనార్దనరావు కోర్టులో లొంగిపోతాడని మూడు, నాలుగు రోజులుగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ ఉన్నతాధికారులు ముందుజాగ్రత్తగా గన్నవరం, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ విమానాశ్రయాలకు లుక్ అవుట్ నోటీసులు పంపినట్లు సమాచారం. ఈ విమానాశ్రయాల వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చిన జనార్దనరావును ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఏ-17గా జయచంద్రారెడ్డి

ప్రధాన నిందితుడు జనార్దనరావు అనుచరుడు కట్టా రాజు ఇచ్చిన వాంగ్మూలం మేరకు ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో కొత్తగా తొమ్మిది మందిని చేర్చారు. ఇందులో జయచంద్రారెడ్డితో పాటు ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి, ఇంట్లో పనిచేసే అంబురసు అలియాస్ బాబు, ఎస్కార్ట్ వాహన డ్రైవర్ అష్రఫ్‌తో పాటు బెంగళూరుకు చెందిన బాలాజీ, సుదర్శన్, హైదరాబాద్‌కు చెందిన నకిరికంటి రవి, కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డి, అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన చైతన్యబాబుపై కేసు నమోదైంది. దీంతో నకిలీ మద్యం కేసులో నిందితుల సంఖ్య 23కు చేరింది. టీడీపీ నుంచి సస్పెండైన తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డిని ఎక్సైజ్ అధికారులు ఏ-17 నిందితుడిగా చేర్చారు. ఆయన్ను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు బెంగళూరులో మకాం వేశాయి. ఏ క్షణమైనా ఆయన్ను అరెస్టు చేసే అవకాశముంది. శుక్రవారం జయచంద్రారెడ్డి ఎస్కార్ట్ వాహన డ్రైవర్ అష్రఫ్‌ను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నిందితుల కస్టడీ పిటిషన్ 13కు వాయిదా

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఇప్పటికే అరెస్టయి మదనపల్లె సబ్‌జైలులో ఉన్న 10 మంది నిందితులను కస్టడీకి ఇవ్వాలని ఈ నెల 7వ తేదీన ఎక్సైజ్ అధికారులు తంబళ్లపల్లె కోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసుకు సంబంధించి నిందితులను విచారించి పూర్తి వివరాలు రాబట్టాల్సి ఉందని, మూడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరారు. కస్టడీ పిటిషన్‌పై విచారణను కోర్టు 13వ తేదీకి వాయిదా వేసింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.